www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఏపీలో అరాచకాలపై వేలు నరుక్కొని నిరసన

దేశ రాజధాని ఢిల్లీలో కలకలం.. బాధితురాలు గుంటూరు మహిళ

మాజీ హోంమంత్రి సుచరిత అనుచరుల అక్రమాలపై ఏకరువు

గంజాయి, ఫోర్జరీతో భూకబ్జాలు, ఎన్నో ఘోరాలని ఆందోళన

ప్రధాని, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు సీజేఐకి వినతులు

11



ఢిల్లీలో ఇండియా గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కోపూరు లక్ష్మి, మహిళా సంఘాల నేతలు.. (ఇన్‌సెట్) కోపూరి లక్ష్మి బొటనవేలు నరుక్కున్న దృశ్యాలు

సోమవారం | 22-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 6 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి తె. 3.26 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: హస్త రా. 7.59 తదుపరి చిత్త; వర్జ్యం: తె. 4.50-6.36; దుర్ముహూర్తం: మ. 12.38-1.28, మ. 3.08-3.59; అమృతఘడియలు: మ. 1.16-3.03; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.57; సూర్యాస్తమయం: 6.29 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మన యుద్ధం రాక్షసులతో!

సానుభూతితో గెలిచేందుకు జగన్ యత్నం: బాబు

ఐదేళ్లలో ఏం చేశాడో చెప్పుకోలేక డ్రామాలు

చీకట్లో గులకరాయి దాడి చేశానంటూ

నాపై తప్పుడు ప్రచారం

బొండా ఉమను ఇరికించే కుట్ర

జనం భీత్యరిస్తున్నారు

పెన్షన్ల పంపిణీపైనా విషప్రచారం

ప్రజలు, శ్రేణుల అభీష్టం మేరకే అభ్యర్థులను ఎంపిక చేశాం

గెలిచి అసెంబ్లీకి రండి

ప్రచారానికి ఇంకా 20 రోజులే

సంకల్పంతో ముందుకెళ్లాలి

3 పార్టీల మధ్య సమన్వయంతో ఓట్ల బదిలీ జరగాలి: చంద్రబాబు

అభ్యర్థులకు బీఫారాల అందజేత

వారితో ప్రతిజ్ఞ చేయించిన బాబు



బీ ఫారాలు అందుకున్న టీడీపీ అభ్యర్థులతో ప్రమాణం చేయిస్తున్న చంద్రబాబు

అమరావతి/మంగళగిరి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మనం రాక్షసులతో యుద్ధం చేస్తున్నామని టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ అభ్యర్థులతో అన్నారు. ప్రతి ఒక్కరూ సంకల్పంతో ముందుకెళ్లాలని సూచించారు. 'లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు చెప్పడంలో జగన్ నేర్పరి. ప్రతిసారీ సానుభూతితో గెలవాలని చూస్తున్నాడు' అని మండిపడ్డారు.ఆదివారమిక్కడ ఉండవల్లిలోని తన నివాసంలో టీడీపీ తరఫున లోక్ సభ, శాసనసభకు పోటీ చేసే అభ్యర్థులకు ఆయన బీఫారాలు అందించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి మొదలు పెట్టి అన్ని జిల్లాల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలో ఏం చేశాడో చెప్పుకోలేక జగన్ డ్రామాలకు తెరతీస్తున్నాడని విమర్శించారు. తండ్రి అధికారంలో ఉన్నప్పుడు రూ.43 వేల కోట్లు అక్రమంగా సంపాదించారని సీబీఐ నిర్ధారిస్తే.. దానిని నిరూపించుకోకుండా తనపై అక్రమ కేసులు పెట్టారని ప్రచారం చేసుకుంటున్నాడని ధ్వజమెత్తారు. 'ఆయన బస్సుయాత్రలో వాళ్లే కరెంటు తీసేసుకున్నారు. చీకట్లో నేను

మిగతా 14వ పేజీలో...

ఉండి టికెట్ రఘురామకే

బండారుకు మాడుగుల.. ఐదుగురు టీడీపీ అభ్యర్థుల మార్పు

తంబళ్లపల్లె, దెందులూరు సీట్లు పెండింగ్.. అనపర్తి సమస్య తేలినట్లే!

నరసాపురం పార్లమెంటు అధ్యక్షుడిగా రామరాజు.. పొలిట్‌బ్యూరోలోకి తోట



కర్నూలు సభలో మాట్లాడుతున్న షర్మిల

ప్రాణాలకు తెగించి పోరాడుతున్నాం

రేపు మాకు, మా పిల్లలకు ఏమవుతుందో తెలియదు

సునీతకు, నాకు దేవుడే రక్షణ

బాబాయి హత్య కేసులో అవినాశ్‌రెడ్డి నిందితుడు

సీబీఐ చెప్పిన విషయాన్నే మేము చెబుతున్నాం

సీఎం జగన్ అడ్డుపడకుండా ఉండి ఉంటే ఈ కేసులో నిందితులకు ఇప్పటికే శిక్ష పడేది

మేం రోడ్డుపైకి వచ్చే అవసరమే ఉండేది కాదు

న్యాయం కోసం కొంగుపట్టి అడుగుతున్నాం: షర్మిల

ఆస్తిలో వాటా పొందే హక్కు ఆడబిడ్డకు ఉందని వెల్లడి

అవినాశ్ నేరచరిత్రపై జగన్ వివరణ ఇవ్వాలి

వివేకా హత్య కేసు నిందితులకు ఓట్లు వేయొద్దు

న్యాయం జరగాలంటే పోరాడే శక్తి కావాలి: సునీత

కర్నూలు/ నందికొట్కూరు, నంద్యాల, ఏప్రిల్ 21: వివేకా హత్య కేసులో న్యాయం కోసం పోరాటం చేస్తున్న తమకు, తమ పిల్లలకు రేపు ఏమవుతుందో తెలియని పరిస్థితి ఉందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. అయినా కూడా ప్రాణాలకు తెగించి మొండిగా న్యాయం కోసం పోరాటం చేస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. తనకు, సునీతకు దేవుడే రక్షణ అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలో

మిగతా 14వ పేజీలో...

సింహాలు కాదు.. పందికొక్కులు!

వైసీపీపై పవన్ ఫైర్



నరసాపురంలో నిర్వహించిన వారాహి విజయయాత్రకు హాజరైన జనం, మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

చిరంజీవిని ఏమైనా అంటే ఊరుకోను.. ఆయన అజాతశత్రువు

సీఎం రమేశ్, పంచకర్లను గెలిపించాలని పిలుపిస్తే మీకేంటి బాధ?

జనసేనకు విరాళమివ్వాలని రామ్‌చరణ్‌కు చెబితే రాజకీయమా?

ముగ్గురు పెళ్లాలంటావేంటి మూర్ఖుడా

భారతిని నీ పెళ్లామంటే నీకు కోపం రాదా?

ఒకప్పుడు చంద్రబాబు సాఫ్ట్

జైలుకు వెళ్లి వచ్చాక చాలా మార్పు

దుర్మార్గులపై ఇక కఠినంగా ఉంటారు

ఆయనకు నేను తోడు: పవన్

జగన్ గొడుగు కిందకు వెళ్లిన వారంతా రౌడీలే

ఇక మీ రౌడీయిజం ఆపండి.. ఎర్రి గొర్రె వేషాలు వేస్తే తాటతీస్తాం

సజ్జలా.. నువ్వు, జగన్ పద్ధతులు మార్చుకోండి

లేదంటే మేమొచ్చాక మోకాళ్లపై దేకిస్తా.. జనసేనాని హెచ్చరిక

భీమవరం-ఆంధ్రజ్యోతి/నరసాపురం, ఏప్రిల్ 21: ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తన అన్న చిరంజీవిని ఏమైనా అంటే ఊరుకోనని స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, భీమవరంలలో జరిగిన ఎన్నికల సభల్లో ఆయన ప్రసంగించారు. ఎన్డీయే అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. 'సజ్జల పులివెందుల నుంచి వచ్చారో.. ఫ్యాక్షన్

మిగతా 14వ పేజీలో...

కోడ్ ఉన్నా 'అజేయం'గా బిల్లులు!



జగనన్న కాలనీల భూసేకరణ, లే అవుట్ బిల్లులు సెటిల్

సర్కారుకు భూముల అమ్మకాల్లో వైసీపీ నేతల భారీ దందా

ఎన్నికల ముందు హడావుడి చెల్లింపులు.. కోడ్‌కు ముందు

వైసీపీ ఎమ్మెల్యేల లేఖలు.. ఆ వెంటనే సీఎంఓ సిఫారసు

కోడ్ వచ్చాక రెవెన్యూ శాఖ సెటిల్.. కర్త, కర్మ క్రియ అజయ్‌జైన్

హౌసింగ్ స్పెషల్ సీఎస్‌గా సిఫారసు.. రెవెన్యూ స్పెషల్ సీఎస్‌గా ఓకే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగనన్న కాలనీలకు భూసేకరణను గతంలో వైసీపీ నేతలు బాగా 'సొమ్ము' చేసుకున్నారు. తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి, ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అంటగట్టారు. జగన్ సర్కారు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి మరీ ఇప్పుడు వారికి బిల్లులు చెల్లిస్తోంది. అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫారసులకు పెద్దపీట వేస్తూ రెవెన్యూ శాఖ బిల్లులను చెల్లించేందుకు ఉరుకులు, పరుగులు పెడుతోంది. ప్రభుత్వం మారితే జగనన్న కాలనీలకు భూసేకరణ, లే అవుట్ల ఖర్చుపై విచారణ చేస్తారేమోనని ఎన్నికల కోడ్ రావడానికి ముందే 80 శాతం బిల్లులు చెల్లించింది. కోర్టు కేసులు, ఇతర వివాదాల్లో ఉన్న బిల్లులను కోడ్ రావడానికి ఒక రోజు ముందు నుంచి సెటిల్ చేస్తోంది. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత పాత తేదీలతో

మిగతా 11వ పేజీలో...



12 13

జాబులేవీ.. జగన్?

నిరుద్యోగులను నమ్మించి నయ వంచన

చేనేతను చిదిమేశారు!

సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో

ఉమాను వెనుకేసుకొస్తున్నావా?

గులకరాయిని టీడీపీ నేతలు వేయమన్నారా?

పోలీసులు పదేపదే ఒత్తిడి చేశారన్న దుర్గారావు

రెండు రోజులపాటు కొట్టారు

2

తెల్ల కాగితాలపై సంతకాలు తీసుకున్నారు

ఆధారాలేవీ దొరక్కపోవడంతో వదిలేశారు

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి దుర్గారావు వెల్లడి

దాచేస్తే దాగని దుర్భిక్షం

వాస్తవం అంగీకరించవేం జగన్?



శ్రీశైలం జలాశయంలో క్రెస్ట్ గేట్ల కన్నా దిగువకు కనిపిస్తున్న నీటి నిల్వ

ఐదేళ్లుగా కరువును కప్పిపెట్టే ప్రయత్నం

నాలుగేళ్లు ప్రకటనే చేయని వైసీపీ సర్కార్

కొత్త ప్రాజెక్టుల్లేవు.. పాతాళానికి నీటి నిల్వలు

వెలిగొండకు గ్రహణం.. కరువు కోరల్లో ప్రకాశం

డెడ్ స్టోరేజీకి చేరిన ప్రధాన జలాశయాలు

నాలుగో వంతు కంటే తక్కువగా నిల్వలు

3

ట్యాంకర్లతో తోటలు తడుపుకొంటున్న రైతులు



చీనీ చిన్నబోయె..

అనంతపురం జిల్లా యాడికి మండలంలోని పిన్నేపల్లి గ్రామ రైతు రామానాయుడు రెండెకరాల్లో నాటిన చీనీ మొక్కలను కాపాడుకునేందుకు ఇలా ట్యాంకర్ల నీటిని కొని వినియోగిస్తున్నారు. వర్షాభావం కారణంగా రెండు బోరుబావులు ఎండిపోయాయి. దీంతో నీటిని కొనక తప్పడంలేదని అంటున్నారు.

తన ప్రభుత్వానికి ప్రకృతి సహకరిస్తోందని సీఎం జగన్ గొప్పగా చెప్పుకొంటారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ప్రారంభించిన రోజున కడపజిల్లాలో వాన పడింది. అంతే.. బస్సు యాత్ర పట్ల ప్రకృతి పరవశించిపోతోందన్నట్టు జగన్ పత్రిక, చానల్ ఊదరగొట్టాయి. రాష్ట్రంలోని కరువు పరిస్థితులను కప్పిపెట్టి ఐదేళ్లు పాలన సాగించిన జగన్ పంథాలోనే, అవి కల్లబొల్లి కథలు అల్లేశాయి. వేసవి పూర్తిగా ప్రవేశించే ముందు పడే నాలుగు చినుకులనూ రాజకీయానికి వాడుకున్నాయి. కానీ, నిజానికి, రాష్ట్ర సాగు నీటివ్యవస్థలను ఐదేళ్లలో జగన్ ధ్వంసం చేశారు. కొత్త ప్రాజెక్టులు ఒక్కటీ పూర్తి చేయకపోగా, ప్రధాన జలాశయాల నిర్వహణలోని నిర్లక్ష్యం, జల వినియోగంపై ప్రణాళిక లేమీ రైతాంగం పాలిట శాపంగా మారాయి. వెలిగొండ ప్రాజెక్టును గాలికి వదిలేయడంతో ప్రకాశం పశ్చిమప్రాంతం ఎండిపోతోంది. రాయలసీమలో తాగు, సాగునీరు అందించే జలాశయాలు నీళ్లు లేక నోళ్లు తెరిచాయి.




'పది' ఫలితాలు

నేడే

ఉదయం 11కు విడుదల

3



14

విద్యుత్ డిమాండ్ పైపైకి

ఎండ మంటలతో పెరిగిన వినియోగం

శని, ఆదివారాల్లో 250 ఎంయూల డిమాండ్



'జై భవాని', 'హిందూ' తొలగించం

పార్టీ గేయాన్ని మార్చబోం.. ఈసీకి స్పష్టం చేసిన ఉద్ధవ్

'జై బజరంగబలీ' అంటూ ఓటేయాలని మోదీ పిలుపునిచ్చినప్పుడు మీరేం చేశారు?

2

ఉచిత అయోధ్య యాత్ర పేరిట బీజేపీకి షా ఓట్లు అడగలేదా?

మతం పేరుతో ఓట్లడిగేందుకు వీలుగా చట్టాలు మార్చేశారా?

ఎన్నికల సంఘానికి ఉద్ధవ్ ఠాక్రే ప్రశ్నలు

మోదీ పాలనలో రైలు ప్రయాణం ఓ శిక్షే

2

రైల్వేస్‌ను కాపాడాలంటే ఆయనను గద్దె దించాలి

కిక్కిరిసిన కేరళ ఎక్స్‌ప్రెస్ వీడియోతో రాహుల్ ట్వీట్



ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలాల్లో క్యాన్సర్ కారకాలు!

11

ఈ రెండు సంస్థలకు చెందిన నాలుగు ఉత్పత్తుల్లో ఇథిలీన్ ఆక్సైడ్

హాంకాంగ్ ప్రభుత్వ సంస్థ వెల్లడి

ఆ ఉత్పత్తుల ఉపసంహరణ



సూరత్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

- నామినేషన్ పత్రాలపై సంతకాలు తమవి కావన్న ప్రతిపాదకులు

సూరత్, ఏప్రిల్ 21: గుజరాత్‌లో కాంగ్రెస్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సూరత్ లోక్‌సభ అభ్యర్థి నీలేశ్ కుంభాని నామినేషన్ పత్రాలపై ఉన్న సంతకాలు తమవి కావని ముగ్గురు ప్రతిపాదకులు జిల్లా రిటర్నింగ్ అధికారికి అఫిడవిట్లు సమర్పించారు. దీంతో కుంభాని నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మరోవైపు, సూరత్ నుంచి కాంగ్రెస్ ప్రత్యామ్నాయ అభ్యర్థి సురేష్ పడ్సాల నామినేషన్ ఫారం కూడా చెల్లుబాటుకాలేదు. దీంతో గుజరాత్‌లో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ సూరత్‌లో ఎన్నికల బరిలో లేకుండా పోయినట్లయింది.

'జై భవాని', 'హిందూ' పదాలను తొలగించం

ముంబై, ఏప్రిల్ 21: శివసేన (యూబీటీ) గేయం నుంచి 'జై భవాని', 'హిందూ' పదాలను తొలగించేది లేదని ఆ పార్టీ అధినేత, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. ఆ పదాలను తొలగించాలంటూ ఎన్నికల కమిషన్(ఈసీ) నుంచి నోటీసు అందిందని, కానీ ఆ ఆదేశాలను పాటించబోమని స్పష్టం చేశారు. ఆ పదాలను తొలగించాలని ఆదేశించడం మహారాష్ట్రను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'తుల్జా భవానీ అమ్మవారి ఆశీస్సులతో ఛత్రపతి శివాజీ హైందవీ స్వరాజ్‌ను స్థాపించారు. అమ్మవారి పేరు మీద కానీ హిందూ మతం పేరుతో కానీ మేం ఓట్లు అడగడం లేదు. కానీ ఆ పదాలను తొలగించాలంటే సహించేది లేదని పేర్కొన్నారు. బహిరంగ సభల్లో తాను 'జై భవాని', 'జై శివాజీ' అని నినదించే సంప్రదాయాన్ని కొనసాగిస్తానని తెలిపారు.

'ఉచితాల' నియంత్రణకు కేంద్రం కృషి చేయాలి



హైదరాబాద్, ఏప్రిల్ 21: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇబ్బడిముబ్బడిగా ఉచిత పథకాలు ప్రకటించకుండా ఎలా నియంత్రించాలన్నదానిపై విస్తృత చర్చ జరగాలని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. ఈ అంశంలో రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావాలని, ఇందుకు కేంద్రప్రభుత్వం, ప్రధాని చొరవ తీసుకోవాలని సూచించారు. పార్టీల ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్ర ప్రభుత్వం 'శ్వేతపత్రం' విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఈ దిశగా కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉచితాల వల్ల జరుగుతున్న లాభలేంటి.. వాటి వల్ల నష్టమేంటి అన్నదానిపై ప్రజల్లో అవగాహన పెంచాలని, ఇది ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రధాని మోదీ చెప్తున్నట్లు 2029కల్లా భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా అప్పటికీ మనది పేద దేశంగానే ఉంటుందన్నారు.

అమిత్‌షా ఆస్తులు ఐదేళ్లలో రెట్టింపు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆయన భార్య సోనాల్ పేరున మొత్తం రూ.65.67 కోట్ల ఆస్తులు ఉన్నట్టు తాజా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో రూ.30.49 కోట్లుగా ఉన్న వీరి ఆస్తులు ఈ ఐదేళ్లలో రెట్టింపు అవడం విశేషం. గుజరాత్‌లోని గాంధీనగర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన ఈనెల 19న నామినేషన్ దాఖలు చేశారు. దానికి జత చేసిన అఫిడవిట్‌లో తనకు రూ.20.23 కోట్ల చరాస్తులు, సోనాల్‌కు 22.46 కోట్ల చరాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. అమిత్‌షా పేరిట రూ.16.31కోట్ల స్థిరాస్తులు, సోనాల్ పేరిట రూ.6.55కోట్ల స్థిరాస్తులున్నాయి.

ఆస్తుల వేలానికి 30 రోజుల నోటీసు తప్పనిసరి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ఇచ్చిన అప్పును తిరిగి వసూలు చేసే క్రమంలో ఆస్తులను వేలం వేయాలనుకుంటే బ్యాంకులు తప్పనిసరిగా రుణగ్రహీతకు 30 రోజులు ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. అలా చేయకుంటే బ్యాంకే బాధ్యత వహించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అంతేకాకుండా ఆ ఆస్తి అమ్మకాన్ని న్యాయస్థానం పక్కన పెడితే దాన్ని కొనుగోలు చేసిన వారు ఆటోమేటిక్‌గా కిరాయిదార్లుగా మారుతారని స్పష్టం చేసింది.

ఉమాను వెనుకేసుకొస్తున్నావా?

- గులకరాయిని టీడీపీ నేతలు వేయమన్నారా?
- పోలీసులు పదేపదే ఒత్తిడి చేశారన్న దుర్గారావు
- రెండు రోజులు కొట్టారని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి వెల్లడి

విజయవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): "గులకరాయి ఘటనలో మీ పార్టీ నేతలను వెనుకేసుకువస్తున్నావా? ఉమాను వెనకేసుకొస్తున్నావా? టీడీపీ నాయకులు ఎవరైనా గులకరాయి వేయమన్నారా? వారు ఎవరైనా దీని వెనుక ఉన్నారా?" అంటూ పోలీసులు తనను రెండురోజులుపాటు ఒత్తిడికి గురిచేశారని, కొట్టారని వేముల దుర్గారావు తెలిపారు. విజయవాడ సెంట్రల్ టీడీపీ అభ్యర్థి బొండా ఉమా పేరు పదేపదే పోలీసులు ప్రస్తావించారన్నారు. గులకరాయి కేసుతో తనకు సంబంధం లేదన్నా వినలేదన్నారు. 'రెండు రోజులపాటు తమ అదుపులో ఉంచుకుని కొట్టారు. ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో వదిలేశారు" అని తెలిపారు. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. "ఈనెల 16న సాయంత్రం 5.30 గంటలకు డాబాకొట్లు సెంటర్‌లోని టీ స్టాల్ దగ్గర ఆటో పెట్టుకుని కూర్చున్నాను. సివిల్ పోలీసులు వచ్చి నన్ను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌పైన ఉన్న సీసీఎస్‌కు తీసుకెళ్లారు. సీఎం జగన్‌పై దాడి చేయించింది నువ్వే కదా అని అడిగారు. 100ప్రశ్నలు వేశారు. నేను రాయి వేయించలేదని చెప్పాను. వేముల సతీశ్‌ను ఒత్తిడికి గురిచేసి బలవంతంగా నా పేరు చెప్పించారు. నన్ను అరెస్టు చేయడానికి పది గంటలకు ముందు సతీష్‌ను తీసుకెళ్లారు. రాయి వేయమని నేను ఎవరికీ చెప్పలేదు. నువ్వు టీడీపీలో తిరుగుతున్నావా అని అడిగితే అవునన్నాను. టీడీపీ నాయకులు ఎవరైనా వేయమన్నారా అని ప్రశ్నించారు. నేను వేయమని చెప్పలేదు కాబట్టి నీతి నిజాయితీగా ఉన్నాను. పోలీసులు విచారణ చేసుకుని, ఏ తప్పూ చేయలేదని అజిత్‌సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్ దగ్గర శనివారం రాత్రి అప్పగించారు. వారు నన్ను మా ఇంటికి తీసుకొచ్చారు. నాతో, మా అమ్మ, భార్యతో ఖాళీ కాగితాలపై సంతకాలు చేయించుకున్నారు. ఫారం 60 నోటీసుపై సంతకాలు పెట్టించుకున్నారు. అవసరమైతే స్టేషన్‌కు రావాలన్నారు" అని చెప్పారు.

జగన్‌పై రాళ్ల దాడి చేస్తామని 1902కు కాల్స్

సీతంపేట (విశాఖపట్నం), ఏప్రిల్ 21: సీఎం జగన్‌పై రాళ్ల దాడి చేస్తామంటూ 1902 (హెల్ప్‌లైన్ నంబర్)కు ఫోన్ చేసిన ఐదుగురు యువకులను నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వీరిని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. సీఎం ఆదివారం నగరంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయనపై రాళ్ల దాడి చేస్తామంటూ పలువురు 1902 నంబర్‌కు ఫోన్ చేశారు.

కాంగ్రెస్ గెలిస్తే.. మీ సంపదను ముస్లింలకు

పంచేస్తారు

తల్లుల మెడలోని మంగళసూత్రాలనూ వదలరు

రాజస్థాన్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని సంచలన వ్యాఖ్యలు



జైపూర్, ఏప్రిల్ 21: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశ ప్రజల సంపదను ముస్లింలకు పంపిణీ చేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం రాజస్థాన్‌లోని బన్స్వారాలో, జలోర్ జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీల్లో ఆయన పాల్గొని, ప్రసంగించారు. అర్బన్ నక్సల్ మనస్తత్వం కలిగిన ఆ పార్టీ నాయకులు మన తల్లులు, సోదరీమణుల మెడల్లోని మంగళసూత్రాలను కూడా వదలరని, వాళ్లు ఆ స్థాయికి కూడా వెళ్లగలరని మండిపడ్డారు. తల్లులు, సోదరీమణుల వద్ద ఉన్న బంగారాన్ని లెక్కపెట్టి, దాని గురించి పూర్తి సమాచారం సేకరిస్తామని, తర్వాత ఆ ఆస్తిని పంపిణీ చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్నారని తెలిపారు. ఈ దేశంలోని ఆస్తులపై ముస్లింలకు మొదటి హక్కు ఉందని గతంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వమే చెప్పిందని మోదీ గుర్తుచేశారు. ఈ లెక్కన దేశ ప్రజల ఆస్తులను ఎక్కువమంది పిల్లలు ఉన్నవారికి పంపిణీ చేయనున్నారని ఆరోపించారు. "మీ ఆస్తులను చొరబాటుదారులకు పంచుతారు. మీరు కష్టపడి సంపాదించిన డబ్బును వారికి ఇవ్వడం మీకు ఆమోదయోగ్యమేనా? మీ కష్టార్జితాన్ని జప్తు చేసే హక్కు ప్రభుత్వాలకు ఉందా?' అని ఆయన ప్రశ్నించారు. మన తల్లుల వద్ద ఉన్న బంగారం ప్రదర్శన కోసం కాదని, అది వారి ఆత్మగౌరవానికి సంబంధించినదని స్పష్టం చేశారు. మంగళసూత్రం విలువ బంగారంలోనో, దాని ధరలోనో లేదని, ఆమె కలలకు ప్రతిరూపమైన దాన్ని లాక్కోవడం గురించి వారు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 2006లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేసిన వివాదాస్పద 'ఫస్ట్ క్లెయిమ్' వ్యాఖ్యలను ఈ సందర్భంగా మోదీ ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రస్తుతం వామపక్షాల కబంధ హస్తాల్లో చిక్కుకుందని, ఆ పార్టీ మేనిఫెస్టో ఆందోళనకరంగా, తీవ్ర భావజాలంతో ఉందని ఆరోపించారు.

చేసిన పాపాలకు కాంగ్రెస్‌ను దేశం శిక్షిస్తోంది

కాంగ్రెస్ చేసిన పాపాలకు దేశం ఆ పార్టీని శిక్షిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఒకప్పుడు 400సీట్లు గెలుచుకున్న పార్టీ.. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో 300 సీట్లలో కూడా పోటీ చేయలేకపోతోందని ఎద్దేవా చేశారు. వారికి పోటీ చేయడానికి అభ్యర్థులే దొరకని పరిస్థితి ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆ పార్టీ పరిస్థితి చాలా దారుణంగా ఉందని, దీనికి కాంగ్రెస్సే స్వయంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయలేనివారు, గెలవలేనివారు బరిలో నుంచి పలాయనం చిత్తగించారని అన్నారు. "రాజస్థాన్ నుంచి దక్షిణాది నేత ఒకరిని కాంగ్రెస్ రాజ్యసభకు పంపింది. ఈ రాష్ట్ర సమస్యలపై ఆయన సభలో ఎప్పుడూ మాట్లాడలేదు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కూడా మీరు రాజ్యసభకు పంపారు. ఆయన అనారోగ్యంతో ఉన్నారు. మీ రాష్ట్రంలో ఎన్నడైనా ఆయన్ను చూశారా? ఇప్పుడు మీరు మరో నేతను కాపాడారు. ఎన్నికల్లో పోటీ చేసి గెలవలేని వారు రంగాన్ని వీడి రాజస్థాన్ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎంపికయ్యారు" అని పరోక్షంగా సోనియా గాంధీని ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించారు. "తొలిదశ పోలింగ్‌లోనే సగం రాజస్థాన్ కాంగ్రెస్‌ను శిక్షించింది. దేశభక్తిని అణువణువునా నింపుకున్న రాజస్థాన్‌కు.. కాంగ్రెస్ ఎన్నటికీ దేశాన్ని బలోపేతం చేయలేదని తెలుసు. 2014కు ముందునాటి పరిస్థితులు మళ్లీ రావాలని ఈ దేశం కోరుకోవడం లేదు. బంధుప్రీతి, అవినీతి అనే చెదపురుగులను వ్యాప్తి చేయడం ద్వారా కాంగ్రెస్ దేశాన్ని నిర్వీర్యం చేసింది. నేడు దేశం మొత్తం ఆ పార్టీపై ఆగ్రహంతో ఉంది. అది చేసిన పాపాలకు శిక్షిస్తోంది. కాంగ్రెస్‌పై చాలా ఆగ్రహంతో ఉన్న యువత.. మళ్లీ ఆ పార్టీ ముఖం చూడలనుకోవడం లేదు" అని మోదీ అన్నారు.


కూటమిలో కుమ్ములాటలు

ఇండియా కూటమి పరిస్థితి ఎగిరేలోపే దారం తెగిన గాలిపటంలా తయారైందని ప్రధాని విమర్శించారు. అది పేరుకు మాత్రమే పొత్తు అని, చాలా రాష్ట్రాల్లో కూటమిలోని భాగస్వామ్య పార్టీలు పరస్పరం కొట్లాడుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఎన్నికల్లో దేశంలో దాదాపు 25శాతం సీట్లలో ఈ కూటమికి చెందిన వారు ఒకరిపై మరొకరు పోటీ పడుతున్నారని చెప్పారు. ఎన్నికలకు ముందే ఈ స్థాయిలో కొట్టుకుంటున్నారంటే... ఇక ఆ తర్వాత దోచుకోవడానికి ఇంకెంతకు తెగిస్తారో ఊహించుకోవచ్చని, ఇలాంటి వారికి ఇంత పెద్ద దేశాన్ని అప్పగిస్తామా అని మోదీ ప్రశ్నించారు. కాగా, సంపద పంపిణీ విషయంలో తమ పార్టీని లక్ష్యంగా చేసుకొని మోదీ విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ మండిపడింది. మొదటి దశ లోక్‌సభ ఎన్నికల్లో పరిస్థితి నిరాశజనకంగా ఉండటంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకే మోదీ ఇలాంటి అబద్ధాలకు తెగబడ్డారని ఖర్గే దుయ్యబట్టారు. మోదీ అవాస్తవాలను 140 కోట్ల దేశ ప్రజలు నమ్మరని ఆయన పేర్కొన్నారు.

దక్షిణాదిలో రికార్డు సీట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణ భారతదేశం రికార్డు స్థాయి సీట్లతో బీజేపీని ఆశీర్వదిస్తుందని మోదీ ధీమా వ్యక్తంచేశారు. దక్షిణ భారత్ వ్యాప్తంగా తాను పర్యటిస్తున్నానని, తాను వెళ్లినప్పుడు అద్భుతమైన స్పందనను చూస్తున్నానని పేర్కొన్నారు. దక్షిణాదితో తమ పార్టీకి దగ్గరి సంబంధం ఉందని, తమ పార్టీ అధ్యక్షుల్లో ముగ్గురు దక్షిణాది నుంచే వచ్చారని చెప్పారు. 1984లో కేవలం రెండు సీట్లకే పరిమితమైనప్పుడు అందులో ఒకటి దక్షిణ భారతదేశం నుంచి ఉన్నట్టు మోదీ గుర్తు చేశారు. కేరళకు చెందిన మాతృభూమి వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ ఈ విషయాలు పేర్కొన్నారు.

లోకం తీరు



మోదీ పాలనలో శిక్షగా రైలు ప్రయాణం

రైల్వేస్‌ను కాపాడాలంటే ఆయన్ను దించాలి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ పాలనలో రైలు ప్రయాణం శిక్షగా మారిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. కేరళ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులతో కిక్కిరిసిన వీడియోను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కేరళ నుంచి న్యూఢిల్లీకి వెళ్తున్న రైలులో.. సీట్ల మధ్యలోనే కాక, వాష్‌రూమ్‌లలో కూడా ప్రయాణికులు కూర్చున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. "నరేంద్ర మోదీ పాలనలో రైలు ప్రయాణం శిక్షగా మారింది. సామాన్యులు ప్రయాణించే జనరల్ బోగీల సంఖ్యను తగ్గించి, ఉన్నత వర్గాలు ప్రయాణించే రైళ్ల సంఖ్యను పెంచారు. దీని ద్వారా సామాన్యులకు రైలు ప్రయాణాన్ని దూరం చేయాలని మోదీ భావిస్తున్నారు. రైల్వేను ప్రైవేటీకరించి తన స్నేహితులకు కట్టబెట్టాలని మోదీ ఆలోచిస్తున్నారు. రైల్వేను మోదీని గద్దె దించాలి" అని రాహుల్ పిలుపునిచ్చారు.

ఓటర్లకు 'ఇండియా' పిలుపు

బీజేపీని సాగనంపండి

రాంచీ, ఏప్రిల్ 21: బీజేపీకి అధికారం నుంచి నిష్క్రమించే మార్గాన్ని చూపాలని 'ఇండియా' కూటమి నేతలు ముక్తకంఠంతో ఓటర్లను కోరారు. కేంద్ర సంస్థలతో విపక్షాలను అణగదొక్కాలని చూస్తున్న మోదీ సర్కారుకు లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఝార్ఖండ్ ముఖ్యపట్టణం రాంచీలో ఆదివారం జరిగిన 'ఉల్‌గుల్(మహోద్యమం) న్యాయ్ మహార్యాలీ', భారీ బహిరంగ సభలో వారు మాట్లాడారు. కేంద్రం బెదిరింపులకు తలొగ్గకుండా.. ఇండియా కూటమిని వీడకుండా.. జైలుకైనా వెళ్లేందుకు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సిద్ధపడ్డారని ఏఐసీసీ చీఫ్ ఖర్గే అన్నారు. "గిరిజనులను బీజేపీ అంటరాని వారిలా జమకడుతోంది. అందుకే రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పార్లమెంట్ భవన ప్రారంభానికి పిలవలేదు. అయోధ్య రామమందిరం ఉద్ఘాటనకు ఆహ్వానించలేదు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ చేసే ఏ ప్రయత్నాన్నైనా తిప్పికొట్టేందుకు విపక్షాలు సిద్ధంగా ఉన్నాయి. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా.. ఇండియా కూటమిని విచ్ఛిన్నం చేయలేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 150-180 స్థానాలకే పరిమితమవుతుందని జోస్యం చెప్పారు. కేజ్రీవాల్ భార్య సునీత కేజ్రీవాల్ మోదీ సర్కారుపై తీవ్రంగా మండిపడ్డారు. "తిహాడ్ జైలులో ఉన్న నా భర్త కేజ్రీవాల్‌ను కేంద్రంలోని బీజేపీ సర్కారు చంపేయాలని కోరుకుంటోంది. ఆయన తీసుకునే ఆహారాన్ని కూడా సీసీకెమెరాల ద్వారా జైలు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కేజ్రీవాల్ మధుమేహంతో బాధపడుతున్నారు. 12 ఏళ్లుగా ఇన్సులిన్‌పై ఆధారపడుతున్నారు. రోజుకు ఆయనకు 50 యూనిట్ల ఇన్సులిన్ అవసరం. జైలులో ఆయనకు ఇన్సులిన్ ఇవ్వడం లేదు" అని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌లను ఈడీ అరెస్టు చేయడంపై మండిపడ్డారు. నేరం రుజువు కాకుండానే జైల్లో పెట్టారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "కేంద్ర ప్రభుత్వానిది నియంతృత్వమే. నా భర్త మంచి విద్య, ఆరోగ్య వసతులను కల్పించడమే నేరమా? కేజ్రీవాల్ ఐఐటీలో చదివారు. విదేశాలకు వెళ్లే అవకాశం ఉన్నా.. దేశభక్తికి ప్రాధాన్యమిచ్చారు. ఐఆర్‌ఎస్ అధికారి అయిన కేజ్రీవాల్.. ప్రజాసేవకు ముందుకు వచ్చారు. ప్రజల సంతోషం కోసం తన జీవితాన్ని పణంగా పెట్టారు" అని ఉద్వేగంగా చెప్పారు. జైలులో ఉన్న హేమంత్ సోరెన్ ఈ ర్యాలీ సందర్భంగా ఓ లేఖను పంపారు. ఆ లేఖను సోరెన్ భార్య కల్పన చదివి వినిపించారు. "ఝార్ఖండ్ ప్రజలు ప్రజాస్వామ్యాన్ని ఓడిపోనివ్వొద్దు. విపక్షాలను అణగదొక్కేందుకు ఈడీ, సీబీఐల ద్వారా కేంద్రంలోని బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. బీజేపీని ఝార్ఖండ్ నుంచి తరిమికొట్టాలి. బీజేపీకి ఝార్ఖండ్ నుంచి నిష్క్రమణ మార్గాన్ని చూపించాలి. ఒకవేళ బీజేపీ గెలిస్తే.. అది ఝార్ఖండ్‌లోని గిరిజనుల పాలిట పెనుముప్పే" అని ఆ లేకలో సోరెన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ మాట్లాడుతూ.. అస్వస్థత కారణంగా అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ ర్యాలీకి హాజరు కాలేదని వివరించారు.

మళ్లీ యడ్డీయే దిక్కు!

పక్కనపెట్టిన వృద్ధ నేతకే బీజేపీ అందలం



వయసు మీరిందని పక్కన పెట్టారు.. రాష్ట్రంలో ఒక్కో ఇటుకా పేరుస్తూ బీజేపీని నిర్మించి ప్రబల శక్తిగా మార్చిన నేతను మూలనపడేశారు.. గత అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో ఆయనకు పాత్ర లేకుండా చేశారు. కానీ ఈ ప్రయోగం విఫలమై కర్ణాటకలో బీజేపీ భారీ పరాజయం మూటగట్టుకుంది. ఆ దెబ్బతో మళ్లీ ఇప్పుడు ఆయన్నే ముందుపెట్టి లోక్‌సభ ఎన్నికలకు వెళ్తోంది. ఆయనెవరో కాదు.. కర్ణాటక మాజీ సీఎం యడియూరప్ప(81). ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని విజయం దిశగా నడిపించే బాధ్యతను ప్రధాని మోదీ-కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇప్పుడు ఆయన భుజాలపైనే పెట్టారు. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం, వ్యూహాల వరకు అన్నీ ఆయనకే అప్పగించారు. ఈసారి దేశవ్యాప్తంగా 400 లోక్‌సభ స్థానాలు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్న మోదీ-షా.. కర్ణాటకలో గత ఎన్నికల మాదిరి 25 స్థానాలు కాకున్నా గరిష్ఠ సంఖ్యలో సీట్లు గెలుచుకోవాలంటే యడియూరప్ప సహాయం అవసరమని భావించారు. అందుకే గత సెప్టెంబరు నుంచే ఆయన్ను రంగంలోకి దించారు. మూడు దశాబ్దాల క్రితం కర్ణాటకలో కేవలం నలుగురు ఎమ్మెల్యేలతో బీజేపీకి పునాదులు వేసిన యడియూరప్ప.. తన కృషితో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. నాలుగుసార్లు సీఎం అయ్యారు. మొదటి రెండు సార్లు మెజారిటీ లేక రాజీనామా చేశారు. 2008 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం పార్టీకి సొంత మెజారిటీ సాధించి పెట్టారు. 2013 ఎన్నికల నాటికి బీజేపీ నుంచి బయటకు వచ్చేసి సొంత పార్టీ పెట్టుకున్నారు. దరిమిలా బీజేపీ ఘోరంగా ఓడిపోయింది. 2014 లోక్‌సభ ఎన్నికల ముంగిట మోదీని ప్రచార కమిటీ సారథిగా నియమించగానే.. ఆయన చేసిన మొదటి పని యడియూరప్పను తిరిగి పార్టీలోకి తీసుకురావడం. ఫలితంగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కర్ణాటకలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆ ఏడాది మే 17న యడ్డీ మళ్లీ సీఎంగా ప్రమాణం చేశారు. కానీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ సాధించలేక ఆరు రోజులకే రాజీనామా చేశారు. హెచ్‌డీ కుమారస్వామి నేతృత్వంలో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. అయితే 17 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంతో 2019 జూలైలో కుమారస్వామి సర్కారు కూలింది. ఆ నెల 26న యడియూరప్ప తిరిగి సీఎం అయ్యారు.

వయోభారం సాకుతో

2021లో వయోభారం సాకుతో మోదీ-షా యడియూరప్పతో రాజీనామా చేయించారు. బొమ్మైను సీఎంను చేశారు. నిరుడు అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ నాయకత్వం యడియూరప్పను పూర్తిగా పక్కనపెట్టింది. అభ్యర్థుల ఎంపికలో ఆయన మాటకు విలువివ్వలేదు. సీనియర్ నేతలు శెట్టర్, లక్ష్మణ్ సవది, ఈశ్వరప్పలాంటి వారికి కూడా టికెట్లు నిరాకరించింది. దీంతో రాష్ట్ర బీజేపీలో సంక్షోభం చెలరేగింది. ఫలితంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయింది. ఆ తర్వాత యడియూరప్ప విలువ ఢిల్లీ పెద్దలకు తెలిసివచ్చింది. యడ్డీని క్రియాశీలం చేసే క్రమంలో ఆయన కుమారుడు విజయేంద్రకు నిరుడు నవంబరు 10న రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగించింది. నాటి నుంచి మాజీ సీఎం అవిశ్రాంతంగా పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నారు. నిరుడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీని వీడిపోయిన వారిలో అత్యధికులను తిరిగి వెనక్కి తీసుకొచ్చారు. లింగాయత్‌లు తిరిగి పార్టీకి మద్దతిచ్చే దిశగా యడియూరప్ప ఆ వర్గానికి చెందిన నేతలకు తిరిగి టికెట్లు ఇప్పించారు. ఇంకోవైపు.. మోదీ తన రాష్ట్ర పర్యటనల్లో యడియూరప్పను ప్రశంసిస్తున్నారు. ఇటీవల శివమొగ్గ సభలో.. దక్షిణ భారతంలో బీజేపీ వేళ్లూనుకోవడానికి ఆయన నిరంతరం శ్రమిస్తున్నారని ఆకాశానికెత్తారు. దీంతో ఈ ఎన్నికల్లో సీనియర్ నేతలంతా యడియూరప్ప వెన్నంటే ఉంటున్నారు.

- బెంగళూరు, ఆంధ్రజ్యోతి.

యూజీసీ-నెట్‌కు నోటిఫికేషన్

మొదటి సారి 3 కేటగిరీల్లో దరఖాస్తులు.. మే 10 వరకు స్వీకరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: దేశంలోని వర్సిటీల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల దరఖాస్తుకు అర్హత, పీహెచ్‌డీల్లో ప్రవేశాలకు నిర్వహించే యూజీసీ-నెట్ పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు యూజీసీ షెడ్యూల్‌ను విడుదల చేసింది. తొలిసారిగా మూడు కేటగిరీలకు పరీక్షలను నిర్వహించనుంది. అంతేకాదు.. నాలుగేళ్ల డిగ్రీని 75% మార్కుల ఉత్తీర్ణతతో పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా పీహెచ్‌డీలో చేరే అవకాశాన్ని కల్పించింది. మే 10 (రాత్రి 11.50లోపు) వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 16న పరీక్ష ఉంటుంది. జనరల్/అన్-రిజర్వ్‌డ్ కేటగిరీకి రూ.1,150, జనరల్-ఈడబ్ల్యూఎస్, ఓబీసీ(నాన్-క్రీమీలేయర్) అభ్యర్థులకు రూ.600, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, థర్డ్ జెండర్ కేటగిరీలకు రూ.325 చొప్పున దరఖాస్తు ఫీజుగా నిర్ణయించారు. పీజీలో 55% మార్కులు ఉన్నవారు యూజీసీ-నెట్‌కు అర్హులు. ఓబీసీ(నాన్-క్రీమీలేయర్), ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, థర్డ్‌జెండర్ కేటగిరీ అభ్యర్థులు పీజీలో 50% మార్కులను సాధిస్తే సరిపోతుందని యూజీసీ వెల్లడించింది. జేఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసేవారి వయసు ఈ ఏడాది జూన్ 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ కేటగిరీకి ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి లేదు. కాగా, రెండు కేటగిరీల్లో- జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటరీలకు మాత్రమే పరీక్షలు జరిగేవి. కొన్ని వర్సిటీలు మాత్రమే పీహెచ్‌డీలో ప్రవేశాలకు యూజీసీ-నెట్ అర్హతను పరిగణనలోకి తీసుకునేవి. యూజీసీ-నెట్‌తో పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందవచ్చంటూ మార్చి 28న యూజీసీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే.! ఆ మేరకు మొదటి కేటగిరీలో జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీకి అర్హత.. రెండో కేటగిరీలో జేఆర్ఎఫ్ వినహా, మిగతా రెండు అంశాలకు, మూడో కేటగిరీలో కేవలం పీహెచ్‌డీలో ప్రవేశాలకు నెట్ పరీక్షను నిర్వహించనున్నట్లు తాజా నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

నాలుగేళ్ల డిగ్రీతో పీహెచ్‌డీ

నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు యూజీసీ-నెట్ ద్వారా ఇకపై నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందవచ్చు. అయితే.. వారు 75% మార్కులతో పాస్ అయి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలతో పాటు.. యూజీసీ సూచించిన కేటగిరీల అభ్యర్థులు 70% మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది. వీరు మూడో కేటగిరీ- కేవలం పీహెచ్‌డీకి మాత్రమే అర్హులు. జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత ఉండదు.



మస్కట్‌లో సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ఒమాన్‌లో వైభవంగా శ్రీరామనవమి!

మస్కట్‌లోని శ్రీకృష్ణమందిరంలో వేడుకలు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): జై శ్రీరాం నినాదాలతో ఎడారి దేశం మారుమోగింది.. శ్రీరామనవమి సందర్భంగా ఒమాన్ రాజధాని మస్కట్‌లో సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. దేశం నలుమూలల నుంచి వందలాది మంది ప్రవాస దంపతులు మస్కట్‌లోని పురాతన శ్రీకృష్ణ మందిరానికి వేకువ జామునే చేరుకోవడంతో కిక్కిరిసిపోయింది. కాశీ పుణ్యక్షేత్రం నుంచి వచ్చిన కె.నాగశ్రీ నట్వర్‌లాల్, స్వామి అనఘేశ్వరానంద సరస్వతి ఆధ్వర్యంలో స్థానిక తెలుగు ప్రవాస పురోహితులు, వేదపండితులు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. భారత రాయబారి అమిత్ నారంగ్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. భద్రాచలం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన తలంబ్రాలను భక్తులకు అందజేశారు. ఇటు సౌదీ అరేబియాలో తెలుగు ప్రవాస సంఘం 'సాటా' ఆధ్వర్యంలో రియాద్ నగరంలో.. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్వర్యంలో ఖతర్‌లోనూ శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దుబాయ్, ఇతర ఎమిరేట్లలో శ్రీరామనవమి వేడుకలను ప్రవాసులు ఇళ్లలోనే జరుపుకొన్నారు.

వెంకట్రామిరెడ్డి మావాడే

- ఉద్యోగ సంఘానికి కోడ్ వర్తించదు
- 'హంస' అధ్యక్షుడు అరవపాల్
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై వివరణ
- విలేకరులకు బుద్ధిలేదని దూషణలు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల సంఘం నేత వెంకట్రామిరెడ్డి తమవాడేనని, ఆయనతో సన్నిహితంగా ఉంటానని ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ అన్నారు. ఏ ప్రభుత్వంతోనైనా తాము సన్నిహితంగా పని చేస్తామన్నారు. తమ ఉద్యోగ సంఘానికి కోడ్ వర్తించదన్నారు. ఆదివారం కడపలోని హరిత టూరిజం హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జిల్లా అధ్యక్షుడు రాజారత్నం అధ్యక్షతన జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో అరవపాల్ మాట్లాడుతూ... 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై స్పందించారు. తమ సమావేశాలకు కోడ్ అడ్డంకులు అంటూ కథనాలు రాయడాన్ని ఖండించారు. తమ సంఘం సమావేశంపై డీఎస్పీ, ఆర్డీవోలకు విన్నవించామని, రాజకీయ ప్రమేయం లేకుండా నిర్వహించుకోవచ్చన్నారు. 'ఉద్యోగ సంఘాలను టార్గెట్ చేయడం తగదు. మీ దుర్మార్గానికి అంతం తప్పదు' అంటూ విలేకరులపై దూషణలకు దిగారు. కోడ్ అమలులో ఉన్న సమయంలో ఉన్నపళంగా ఉద్యోగ సంఘాలతో సమావేశాలు పెట్టడం అనుమానాలకు తావిస్తోందని.. ఎన్నికల తరువాత సమావేశాలు నిర్వహించుకోవచ్చు కదా? అంత తొందరెందుకని విలేకరులు ప్రశ్నించగా డొంక తిరుగుడు సమాధానం చెప్పారు. 'ఎలక్షన్ సమయంలో అన్నం తినమా? ఖాళీగా పస్తుంటామా?' అని అన్నారు. పత్రికా విలేకరులకు బుద్ధి లేదని దూషించారు. దీంతో మీడియా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుచితంగా ఏకవచనంతో మాట్లాడడంపై అభ్యంతరం తెలిపారు. తాను అలా అనలేదని ఆయన వివరణ ఇచ్చారు. తాము రాజకీయ కార్యక్రమాలకు దూరమని అరవపాల్, కార్యవర్గం సర్దిచెప్పారు. అరవపాల్ తీరుతో అక్కడున్న ఉద్యోగ సంఘాల నేతలు ఖంగుతిన్నారు. కోడ్ రాకముందు జిల్లా కమిటీ ఏర్పాటు చేయకుండా ఇప్పుడెందుకు చేస్తున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జూన్ 6 తర్వాత జిల్లా సర్వసభ్య సమావేశమే కాదు రాష్ట్ర స్థాయి మీటింగ్ పెట్టుకున్నా ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఉద్యోగ సంఘాలకు కోడ్ వర్తించదన్న దానిపై ఈసీ ఎలా స్పందిస్తుందో చూడాలి. కోడ్ అమలులో ఉన్నప్పుడు చిన్న చిన్న సమావేశాలైనా ఈసీ నుంచి అనుమతి తీసుకోవాలి. అయితే హంస అనుమతి తీసుకుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. సచివాలయ ఉద్యోగుల సంఘం నేత వెంకట్రామిరెడ్డితో అత్యంత సన్నిహితంగా ఉంటానని అరవపాల్ ఒప్పుకొన్నారు. దీనిపై ఈసీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

చిరుజల్లులు.. వడగాడ్పులు!

▸▸ రాష్ట్రంలో అనిశ్చితి వాతావరణం.. 45.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణ ఛత్తీ‌స్‌గఢ్ నుంచి తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా తమిళనాడు వరకూ ఉపరితలద్రోణి విస్తరించింది. దీనికితోడు ఎండ తీవ్రతతో వాతావరణ అనిశ్చితి కొనసాగుతుంది. వీటి ప్రభావంతో ఆదివారం కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. మన్యం జిల్లాలో వడగళ్లు కూడా పడ్డాయి. కోస్తా, రాయలసీమల్లోని మిగిలిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత, ఉక్కపోతతోపాటు పలుచోట్ల వడగాడ్పులు వీచాయి. ఉత్తరాంధ్రలో 36 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. రాష్ట్రవ్యాప్తంగా 82 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. సోమవారం 2-3 డిగ్రీల ఉష్ణోగ్రతలు తగ్గనున్నాయి. ఆదివారం నంద్యాల జిల్లా చాగలమర్రిలో 45.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మరో నాలుగు రోజులు కోస్తా, రాయలసీమల్లో ఎండ తీవ్రత, వేడి వాతావరణం కొనసాగుతాయని పేర్కొంది.

వడగాడ్పులపై సర్కారు అప్రమత్తం

▸▸ బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్లలో చల్లటి గదులు, నీరు

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వడగాడ్పులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాల్లో పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారులను ఆరోగ్యశాఖ కమిషనర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. అన్ని జిల్లాల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, వడదెబ్బ బాధితుల కోసం ఆస్పత్రుల్లో ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. గర్భిణులు, చిన్నారులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత అధికయ్యే పరిస్థితుల నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు అన్ని ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్‌లు, అంబులెన్స్‌ల్లో ఐస్‌బ్యాగ్‌లు సిద్ధం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి ఆస్పత్రిలో వడదెబ్బ, అగ్నిప్రమాద బాధితుల కోసం ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో తగిన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండ్‌లలో కూలింగ్ వాటర్ సదుపాయంతో పాటు చల్లగా ఉండే గదులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించి ఫైర్ ఎన్‌వోసీలు, ఎలక్ట్రికల్ ఆడిట్ వివరాలు పరిశీలించాలని ఈమేరకు ఓ ప్రకటనలో సూచనలు చేశారు.

ప్రతి ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్ ఇవ్వండి

▸▸ ఓపీవోలకు శిక్షణ ఇవ్వాలి: సీఈవోకు వర్ల లేఖ

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆదివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాశారు. 'రాష్ట్రంలో దాదాపు 5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వర్తించబోతున్నారు. పోస్టల్ బ్యాలెట్లపై పీవో, ఏపీవోలకు శిక్షణ ఇచ్చినట్లే... పోలీసులు, డ్రైవర్లు, కండక్టర్లు, క్లీనింగ్ పర్సన్స్ లాంటి ఓపీవోలకు శిక్షణ ఇవ్వకపోతే.. పోస్టల్ బ్యాలెట్ సరిగా వినియోగించుకోలేరు. ఓపీవోలు ఫాం-12ను ఎవరికివ్వాలనే విషయంలో అనుమానాలున్నాయి. వాటిని నివృత్తి చేయాలి' అని లేఖలో కోరారు.

మా విజ్ఞప్తితో పోస్టల్ బ్యాలెట్‌పై కొత్త ఆదేశాలు

▸▸ టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ విజ్ఞప్తితో పోస్టల్ బ్యాలెట్‌పై ఎన్నికల కమిషన్ కొత్త ఆదేశాలు జారీ చేసిందని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్ బాబు ఆదివారం తెలిపారు. 'పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనే ఉద్యోగుల నుంచి ఫారం 12 తీసుకొనే బాధ్యతను నియోజకవర్గాల్లో విధుల్లో ఉన్న రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారికి ఎన్నికల కమిషన్ అప్పగించింది. తమకు సంబంధం లేదని వారు చెప్పడానికి వీలు లేదు. ఆ ఫారం తీసుకొని వారికి పోస్టల్ బ్యాలెట్‌ను సమకూర్చాలి. ఉద్యోగులు కూడా ఫారం 12 సమర్పించే సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. ఎన్నికల విధుల్లో భాగంగా అధికారులు నియోజకవర్గంలో ఉన్నా కూడా వీటిని తీసుకోవాల్సిందే. వెలగపూడి సచివాలయంలో పోస్టల్ బ్యాలెట్ల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఫారం 12 అన్నీ రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని నియోజకవర్గాలకు వెళ్తాయి' అని అశోక్‌బాబు వివరించారు. ఉద్యోగుల్లో తమపై ఉన్న వ్యతిరేకతను గ్రహించిన వైసీపీ ప్రభుత్వం వాటి సంఖ్యను తగ్గించడానికి రకరకాల కుట్రలను చేస్తోందని ఆరోపించారు.

జగన్ వల్లే విశాఖ ఉక్కు, గంగవరం నాశనం: పట్టాభి



అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): 'సీఎం జగన్ నిర్వాకం వల్లే గంగవరం పోర్టు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ మూతపడే పరిస్థితిలోకి చేరాయి. ఉత్తరాంధ్ర పాలిట వినాశనకారిగా మారిన జగన్, ఎన్నికల ప్రచారానికి విశాఖలో అడుగు పెట్టడానికి సిగ్గుండాలి' అని టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం ధ్వజమెత్తారు. 'జగన్ రెడ్డి తన జేబులు నింపుకోవడానికి గంగవరం పోర్టును దాని యాజమాన్యం తెగనమ్ముకొనేలా చేశాడు. కోకింగ్ కోల్ దిగుమతికి ఉన్న ప్రత్యేక బెర్త్ మాయం అయింది. వంద ఎకరాల స్టాక్ యార్డ్ లేకుండా పోయింది. గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను జగన్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పోర్టు స్తంభించింది. కమీషన్ల కోసం జగన్ గంగవరం పోర్టును అదానీల పరంచేశాడు. ఆ పోర్టులో కార్మికులు కనీస వేతనాల కోసం ఆందోళన చేస్తుంటే యాజమాన్యం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం అటువైపు తిరిగి కూడా చూడటం లేదు. పైగా కరెంటు బిల్లులు కట్టలేదని దాని పీకలపై జగన్ కూర్చున్నాడు. విశాఖ ఉక్కు మూతపడితే దాని కింద ఉన్న వేల ఎకరాల భూమిని తెగనమ్మడానికి జగన్ సిద్ధంగా ఉన్నాడు. ఇంకా ఏ మొహం పెట్టుకొని జగన్ సిగ్గు లేకుండా విశాఖకు వెళ్తున్నారు. భూకబ్జాలు, కొండలకు గుండు కొట్టించడం, గంజాయి అమ్మకాలు పెంచడం తప్ప జగన్ సాధించింది ఏమీ లేదు. ఉత్తరాంధ్ర ప్రజలు నిలదీయాలి' అని పట్టాభి పిలుపునిచ్చారు.

ఎన్డీయేతోనే ఏపీ ప్రగతి: బీజేపీ నేత చంద్రశేఖర్

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ బీజేపీకి లేకున్నా ఆ పార్టీ పాలిత రాష్ట్రాలకు మించి మోదీ ప్రభుత్వం నిధులిచ్చి అభివృద్ధికి సహకరించిందని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్ పేరాల చంద్రశేఖర్ అన్నారు. విజయవాడలో ఆదివారం 'వికసిత్ ఆంధ్ర-వికసిత్ భారత్' కరపత్రాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందని ప్రశ్నిస్తున్న వైసీపీ నేతలు.. కేంద్ర సంక్షేమ పథకాలకు తమ స్టిక్కర్లు అంటించుకుని ప్రచారం చేసుకున్నది వాస్తవం అవునో కాదో చెప్పాలంటూ నిలదీశారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీ మాటల్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థుల్ని గెలిపించాలన్నారు. కాగా, రాష్ట్రంలో దళితుడిని హత్య చేసిన అనంత్ బాబును పక్కనే బెట్టుకుని తిరుగుతున్న ద్రోహి జగన్ అంటూ బీజేపీ అధికార ప్రతినిధి విల్సన్ విమర్శించారు.

లోకేశ్‌ను కలిసిన రేషన్ డీలర్ల సంఘం నేతలు

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు రూ.7500 గౌరవ వేతనం ఇచ్చేలా చూడాలని రేషన్ డీలర్ల సంఘం సంఘం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కోరింది. రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు ఆధ్వర్యంలో ఆ సంఘం నేతలు ఆదివారం ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బియ్యంపై రూ.150 కమీషన్ ఇవ్వాలని, జీవోలు 5, 20 అమలుచేసి ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. డీలర్లకు మేలుచేస్తామని లోకేశ్ అన్నారు.

సచివాలయంలో మద్యం, రేషన్ బియ్యం

▸▸ 'సీ విజిల్'లో ఫిర్యాదుతో పట్టివేత

కావలి, ఏప్రిల్ 21: ప్రజలకు అన్ని రకాల సేవలందించేందుకే సచివాలయాలు ఏర్పాటు చేశామని చెబుతున్న వైసీపీ ప్రభుత్వం ఆ సచివాలయాలనే అక్రమాలకు అడ్డాగా వాడుకుంటోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెల్లూరు జిల్లా కావలి పట్టణ బుడంగుంట సచివాలయంలో ఆదివారం మధ్యాహ్నం 43 మద్యం సీసాలు, 9 బస్తాల రేషన్ బియ్యం నిల్వలను అధికారులు గుర్తించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సాయంతో స్థానిక వైసీపీ నాయకులు మద్యం సీసాలు నిల్వ ఉంచారనే అనుమానంతో స్థానికులు సీవిజిల్ యాప్ ద్వారా ఆదివారం ఫిర్యాదు చేశారు. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. తాను గూడూరులో ఉన్నట్టు సచివాలయ అడ్మిన్ ఫోన్‌లో తెలపడంతో, పోలీసుల సాయంతో సచివాలయ తలుపులు పగలగొట్టి తనిఖీ చేశారు. ఒక బస్తాలో 43 మద్యం సీసాలను గుర్తించారు. మరో గదిలో 9 బస్తాల రేషన్ బియ్యంతోపాటు మరో రెండు చిన్న బస్తాలలో బియ్యం మూటలను గుర్తించి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, సీఐ శ్రీనివాసులుకు సమాచారం ఇవ్వడంతో వారు స్వాధీనం చేసుకున్నారు.



కావలిలోని బుడంగుంట సచివాలయం ఇదే!



గుండె 'చెరువు'

అనంతపురం జిల్లా పుట్లూరులోని చెరువు ఇది. చుక్కనీరు లేక ఎండిపోయింది. తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) నుంచి సుబ్బరాయసాగర్ ద్వారా ఈ మండలంలోని మూడు చెరువులకు నీరు వస్తుంది. కానీ ఈ ఏడాది వర్షాభావం కారణంగా హెచ్చెల్సీ వాటా నీరు బాగా తగ్గిపోయింది. ఈ ప్రాంతానికి బొట్టునీరు రాలేదు.

దాచేస్తే దాగని దుర్భిక్షం

వాస్తవం అంగీకరించవేం జగన్?

▸▸ ఐదేళ్లుగా కరువును కప్పిపెట్టే ప్రయత్నం

▸▸ నాలుగేళ్లు ప్రకటనే చేయని వైసీపీ సర్కార్

▸▸ డెడ్ స్టోరేజీకి చేరిన ప్రధాన జలాశయాలు

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

తానొస్తే కరువే ఉండదంటూ గొప్పగా ప్రకటించుకున్న జగన్ పాలనలో గతేడాది రాష్ట్రం దుర్భిక్షంలోకి జారిపోయింది. అయినా కరువు మండలాల ప్రకటనలో ప్రభుత్వం బాగా జాప్యం చేసింది. ఈ నెల మూడోవారానికి ప్రధాన జలాశయాలు ఎండిపోయాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్, తుంగభద్ర ఆనకట్టలు డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. మధ్య తరహా రిజర్వాయర్లలో నీటి ఆనవాళ్లు కనిపించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన నీటివనరులైన చెరువులు ఎండిపోయి బీటలు వారాయి. వెరసి.. రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు 20 మీటర్ల మేర లోతుకు చేరాయి. ఇలాంటి తరుణంలో సీఎంగా జగన్ ఏం చేయాలి? అత్యవసరంగా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి, దుర్భిక్షంపై యుద్ధం ప్రకటించాలి. కానీ, ఆయన మాత్రం సిద్ధం అంటూ స్వీయ రాజకీయ ప్రయోజనాల కోసం బస్సు యాత్ర చేస్తున్నారు.

ఈ సవాల్‌కు 'సిద్ధమా'?

నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి ఈ నెల నాలుగో తేదీ నుంచి ఐదు టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేస్తున్నారు. తాగు, సాగు అవసరాలకు అవి ఏమాత్రం సరిపోయే పరిస్థితి లేదు. దీంతో కుడికాలువ కింద ఆయకట్టులో సాగు ప్రమాదంలో పడింది. మరోవైపు తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు జగన్ సర్కారు చర్యలు తీసుకోవడంలేదు. కనీసం రాష్ట్రంలోని దుర్భిక్ష పరిస్థితులను అంగీకరించే ధైర్యం జగన్‌కు ఉందా అని రాజకీయపక్షాలు సవాల్ చేస్తున్నాయి.

నిల్వలు అడుక్కి...

రాష్ట్రాన్ని మండువేసవి అల్లాడిస్తోంది. మరో రెండునెలలపాటు ఎండ తీవ్రత బాగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, చిత్తూరు జిల్లాల్లో మినహా మిగిలిన జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భజలాలు అడుగంటాయి. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలన్నీ డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 108 రిజర్వాయర్లలో 246.49 టీఎంసీల నీటి నిల్వలు ఉండాల్సి ఉండగా, 61.622 టీఎంసీల (25.06శాతం) నీటినిల్వలే ఉన్నాయి. రాష్ట్ర జల వనరుల శాఖ నియంత్రణలోని ఆంధ్రప్రదేశ్ వాటర్ రిసోర్సెస్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏపీడబ్ల్యూఆర్ఐఎంఎస్) తాజాగా అందించిన సమాచారం మేరకు రాష్ట్రం దుర్భిక్షం దిశగా వెళుతోంది.

దాఖలాలివిగో..

- ▸▸ రాష్ట్రంలో వర్షపాతం 17శాతం తక్కువగా ఉంది. గత ఏడాది 728 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.
- ▸▸ 14 జిల్లాల్లో మట్టిలో నీటితేమ 20 మీటర్ల కంటే లోతుకు వెళ్లిపోయింది.
- ▸▸ 38,441 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల్లో 99.71 టీఎంసీల నీటి నిల్వలకుగాను కేవలం 48.35 శాతం మాత్రమే నిల్వలు ఉన్నాయి.
- ▸▸ 13,99,238 వాటర్ స్ట్రక్చర్లలో 4.65 టీఎంసీల నీటినిల్వలే ఉన్నాయి.
- ▸▸ భారీ జలాశయాల్లో 865.64 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గాను తాజాగా సుమారు 212.69 టీఎంసీలు మాత్రమే నిల్వలే కనిపిస్తున్నాయి.
- ▸▸ మీడియం రిజర్వాయర్లలో 115.09 టీఎంసీలకుగాను 50.69 టీఎంసీల నిల్వ మాత్రమే ఉంది. ఇతర ట్యాంకుల్లో 1.62 టీఎంసీలకుగాను 0.18 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి.
- ▸▸ ప్రకాశం బ్యారేజీలో 3.07 టీఎంసీల సామర్థ్యానికి గాను కేవలం 1.15 టీఎంసీలు నీటి నిల్వలే ఉన్నాయి. ఎన్నడూ లేనివిధంగా బ్యారేజీ వెనుక ఇసుక మేటలు కనిపిస్తున్నాయి.
- ▸▸ తుంగభద్రలో 100.85 టీఎంసీలకుగాను కేవలం 3.95 టీఎంసీలే నీటి నిల్వలు ఉన్నాయి. మరో 96.91 టీఎంసీల వరద వస్తే తప్ప తుంగభద్ర గరిష్ఠ స్థాయి నిల్వకు చేరుకోలేదు.

ఎండిన సుంకేసుల.. తాగునీటికి కటకట

కర్నూలు నగర ప్రజల దాహం తీర్చే సుంకేసుల జలాశయం ఎండిపోయి నెర్రలిచ్చింది. ఈ జలాశయం గరిష్ఠ నీటి మట్టం 1.20 టీఎంసీలు కాగా, 0.032 టీఎంసీలకు చేరింది. కర్నూలు, అనంతపురం జిల్లాలకు నీటి ఆధారమైన తుంగభద్ర జలాశయం పూర్తిగా అడుగంటింది. దీంతో తాగునీటి అవసరాల కోసం కర్నూలు జిల్లాకు ఎల్లెల్సీ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని ఆపేశారు.



ప్రకాశం జిల్లాలో మండల కేంద్రమైన పెద్దారవీడుకు చెందిన ఈ రైతు తన ఐదు ఎకరాల బత్తాయి తోటను కాపాడుకునేందుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బోరు నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొస్తున్నారు. ఆయనకు ఉన్న *5 ఎకరాల పొలంలో 500 బత్తాయి చెట్ల పాదులు నింపడానికి 5 ట్యాంకుల నీరు అవసరం అవుతుందని చెబుతున్నారు. ఒక్కో ట్యాంకరుకు రూ. 800 వెచ్చిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.*



నీరు లేక నెర్రెలు చీలిన కర్నూలు జిల్లాలోని సుంకేసుల జలాశయం



నీటి మూటలు కావు.. డబ్బు మూటలే!

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామ పరిధిలో వేలాది ఎకరాల్లో చీనీ తోటలు ఉన్నాయి. ఈ ప్రాంతంలోని బోరు బావులు ఎన్నడూ లేనివిధంగా ఎండిపోయాయి. దీంతో చీనీ చెట్లను రక్షించుకునేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుంటున్నారు. గ్రామానికి చెందిన గోపాల్ తోటలో ఉన్న ఈ ట్యాంకర్లన్నీ నీటిని తెచ్చినవే. నెల క్రితం ముకుందాపురం చెరువులో ఉన్న కొద్ది నీటిని ట్యాంకర్ రూ.800 ప్రకారం తెచ్చి ఇచ్చేవారని, ప్రస్తుతం రెండు కిలోమీటర్ల దూరంలో నీరు లభించే బోరుబావుల నుంచి ట్యాంకర్ రూ.1000 ప్రకారం తెచ్చిస్తున్నారని రైతులు తెలిపారు. ట్యాంకర్ల నీటిని తోటల్లోని సంపుల్లో నింపి.. అక్కడి నుంచి డ్రిప్ పద్ధతిలో చెట్లకు అందిస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన రైతు గోపాల్, అతని సోదరుడికి వెయ్యి చెట్లు ఉన్నాయి. వీటిని కాపాడుకునేందుకు నీటి కోసం రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. గ్రామంలో 80 శాతం మంది రైతులు నీటిని కొని తోటలను కాపాడుకుంటున్నారు.

తిరుమలలో ప్రారంభమైన వసంతోత్సవాలు

తిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల వసంత మండపంలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు ఆదివారం శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా శనివారం ఉదయం వసంతమండపానికి చేరుకోగా ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిగింది. వసంతోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీభూ సమేత మలయప్పస్వామి స్వర్ణరథంపై తిరుమాడవీధుల్లో విహరిస్తారు.

మల్లన్న సన్నిధిలో జస్టిస్ మహేశ్వరి



జస్టిస్ మహేశ్వరికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈఓ

శ్రీశైలం, ఏప్రిల్ 21: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ మహేశ్వరి దంపతులు స్వామివారికి అభిషేకం, భ్రమరాంబికాదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

తిరుమలలో ఏనుగుల గుంపు సంచారం

▸▸ శిలాతోరణం వద్ద పార్కులో విధ్వంసం

తిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం రాత్రి ఏనుగుల సంచారం కలకలం సృష్టించింది. శ్రీవారిపాదాల మార్గంలోని శిలాతోరణం వద్దకు శనివారం రాత్రి 10 గంటలకు సుమారు 14 ఏనుగులు వచ్చాయి. ఇనుప కంచెను ధ్వంసం చేసి పార్కులోకి చొరబడ్డాయి. భారీ వృక్షాలను, ప్లాస్టిక్ చెత్త కుండీలను విరగ్గొట్టాయి. సాధారణంగా శ్రీవారిపాదాలు, శిలాతోరణం ప్రదేశాలకు సాయంత్రం 6 గంటల తర్వాత భక్తులకు అనుమతి ఉండదు. దీంతో ఎలాంటి సమస్య తలెత్తలేదు. వేసవికాలం కావడంతో శిలాతోరణం సమీపంలోని చెరువులో నీటిని తాగేందుకు ఏనుగులు వచ్చాయని, ఈ క్రమంలోనే పార్కులోకి చొరబడ్డాయని అటవీ అధికారులు తెలిపారు. భారీ శబ్దాలు, సైరన్లు మోగించడంతో రాత్రి 2 గంటల తర్వాత ఏనుగుల గుంపు అడవిలోకి వెళ్లిపోయిందన్నారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన ఇనుప కంచె

అమరావతి విధ్వంసంతో ఉపాధి అవకాశాలు పోయాయి

▸▸ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్న వారికి బుద్ధి చెప్పండి

▸▸ హైదరాబాద్‌ను మించిన నగరంగా అమరావతి... చంద్రబాబు ఆశయం అదే

▸▸ చేనేతల జీవితాలను మార్చాలన్న లక్ష్యం దిశగా లోకేశ్

▸▸ మంగళగిరి నియోజకవర్గంలో నారా బ్రాహ్మణి ప్రచారం

మంగళగిరి, ఏప్రిల్ 21: 'అమరావతి విధ్వంసంతో ఇక్కడి ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి. ఈ ప్రాంత పేద, మధ్య తరగతి ప్రజల ఆదాయాలు పడిపోయాయి' అని నారా బ్రాహ్మణి ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త నారా లోకేశ్ విజయాన్ని కాంక్షిస్తూ బ్రాహ్మణి ఆదివారం మంగళగిరి నియోజకవర్గంలోని బేతపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'రాష్ట్ర ప్రజలు రెండు మాసాలు ఓపిక పడితే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. ఆ వెంటనే నిలిచిపోయిన అమరావతి నగర నిర్మాణ పనులను ఆరంభించి ఈ ప్రాంతానికి గత వైభవాన్ని తీసుకువస్తారు. రాష్ట్రానికి పరిశ్రమలను రప్పించి యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తారు. ఆ మంచి రోజుల కోసం ప్రజలు కూటమి అభ్యర్థులకు ఘన విజయాన్ని సాధించి పెట్టాలి. ప్రజలిచ్చిన అధికారాన్ని సుపరిపాలన కోసం వినియోగించాలే తప్ప.. కక్షపూరిత రాజకీయాల కోసం వాడకూడదు. కక్షపూరిత రాజకీయాలే పరమావధిగా పనిచేసే వారికి జరుగనున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలి. సమర్థులైన పాలకులు ఉంటేనే సమాజానికి మంచి జరుగుతుంది. టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పటికే అనేకమార్లు తన సమర్థతను నిరూపించుకున్నారు. ఒకప్పుడు రాళ్లూరప్పలతో నిండిన హైదరాబాద్‌ను హైటెక్ సిటీ నిర్మాణంతో విశ్వనగరంగా మార్చిన ఘనత చంద్రబాబుది. హైదరాబాద్‌ను మించిన మహానగరంగా అమరావతిని తీర్చిదిద్దాలన్న ఆశయసిద్ధి కోసం అహర్నిశలు ఆయన పాటుపడుతున్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయి. చంద్రబాబు సీఎం అయ్యాక మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతారు. శాంతిభద్రతలను పూర్తిస్థాయిలో అదుపులో ఉంచుతారు. రాబోయే రోజుల్లో మంగళగిరికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉండబోతుంది. ఇబ్బందుల్లో ఉన్న చేనేతల జీవితాలను మార్చాలన్న ఆశయంతో లోకేశ్ కంకణం కట్టుకుని పని చేస్తున్నారు. ఇప్పటికే టాటా తనైరా సంస్థతో ఒప్పందం చేసుకుని వీవర్స్‌శాలలను ఏర్పాటు చేయించారు. అధునాతన మగ్గాలు, డిజైన్లతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలను కల్పిస్తూ చేనేతల ఆదాయాన్ని విశేషంగా పెంచేందుకు కృషి చేస్తున్నారు. లోకేశ్ చేస్తున్న మంచి పనుల్లో ఇదో చిన్న కార్యక్రమం మాత్రమే. లోకేశ్ విజన్ అమలైతే మంగళగిరికి దేశంలో మరే నియోజకవర్గం పోటీకి రాలేదు' అని బ్రాహ్మణి వివరించారు.



బేతపూడిలో టీడీపీ కార్యకర్తలు అందించిన గొర్రె పిల్లతో నారా బ్రాహ్మణి

తరగని స్వామిభక్తి!

▸▸ మంత్రి పెద్దిరెడ్డికి డీఎస్పీ కేశప్ప శాల్యూట్

▸▸ రోడ్ షోలో మంతనాలు..

▸▸ కోడ్‌ను పట్టించుకోని అధికారి

రాయచోటి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఇది రాజకీయ నేతలకు, పార్టీలకే కాకుండా.. అధికారులకు కూడా వర్తిస్తుంది. నేతలు, మం త్రులతో అధికారులు ఎవరూ మిలాఖత్ కాకూడదు. ప్రొటోకాల్ గౌరవాలు ఇవ్వకూడదు. అయితే.. ఇవ న్నీ తెలిసి కూడా డీఎస్పీ స్థాయి అధికారి ఒకరు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శాల్యూట్ చేసి కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరించారు. మరి ఇంతగా పెద్దిరెడ్డికి ఆడీఎస్పీ ఎందుకు శాల్యూట్ చేశారంటే.. వారి మధ్య ఉన్న ఫెవికాల్ బంధం అలాంటిది. ఆ డీఎస్పీనే కేశప్ప! ఈ పేరు వినగానే అంగళ్లు ఘటన గుర్తుకువస్తుంది. గత ఏడాది ఆగస్టు 4 అన్నమయ్య జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన సందర్భంగా కురబలకోట మండలం అంగళ్లులో వైసీపీ నేతలు సృష్టించిన విధ్వంసం అందరికీ తెలిసిందే. సాక్షాత్తూ పోలీసుల సమక్షంలోనే.. చంద్రబాబుపై వైసీపీ రౌడీ మూక రాళ్లదాడికి పాల్పడింది. అప్పుడు మదనపల్లె డీఎస్పీగా ఉన్న కేశప్ప అధికార పార్టీకి సంపూర్ణ సహకారాలు అందించారనే ఆరోపణలున్నాయి. కేవలం కేశప్ప వల్లే.. అంగళ్లులో విధ్వంసం జరిగిందని ప్రతిపక్షాలు కూడా పేర్కొన్నాయి. మదనపల్లె డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కేశప్ప మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై బహిరంగంగానే స్వామిభక్తి ప్రదర్శించారు. అనంతరం అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన కేశప్ప మంగళగిరిలోని పోలీసు కేంద్ర కార్యాలయానికి బదిలీ అయ్యారు. అయితే ఏం జరిగిందో ఏమో.. ఆయన పదోన్నతి నిలిచిపోయినట్లు సమాచారం. ప్రస్తుతానికి ఆయన డీఎస్పీగానే ఉన్నారు. తాజాగా ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దగ్గర ప్రత్యక్షమయ్యారు. డీఎస్పీ కేశప్ప మఫ్టీలో వెళ్లి మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం మండలం బొమ్మనచెరువులో రోడ్డుషో నిర్వహించిన మంత్రి పెద్దిరెడ్డికి శాల్యూట్ చేశారు. కాసేపు మంతనాలు జరిపారు. దీనిపై విపక్షాలు మండిపడుతున్నాయి. కోడ్ ఉల్లంఘనేనని.. ఎన్నికల్లో అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



పెద్దిరెడ్డికి శాల్యూట్ చేస్తున్న డీఎస్పీ కేశప్ప

నేడు 'పది' ఫలితాలు

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ సోమవారం ఉదయం 11 గంటలకు విజయవాడలో ఫలితాలను విడుదల చేయనున్నారు. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ https:// results. bse.ap.gov.in/ ద్వారా తెలుసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. 7లక్షల మందికి పైగా విద్యార్థు లు ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు.

నేడు శ్రీశైలానికి చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నేడు టీడీపీ అధినేత చంద్రబాబు శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామిని దర్శించుకోనున్నారు. సోమవారం ఉదయం హెలికాప్టర్‌లో శ్రీశైలం వెళ్లి స్వామివారిని దర్శించుకుని అనంతరం హైదరాబాద్‌కు చేరుకుంటారు. అనంతరం హైదరాబాద్ నుం చి మధ్యాహ్నం జగ్గంపేట, శృంగవరపుకోటలకు చేరుకుని ప్రజాగళం సభలో పాల్గొని ప్రసంగించనున్నారు.

రెండేళ్లుగా నిధులు ఇవ్వడం లేదు

▸▸ ఇలాగైతే బోర్డు నిర్వహణ కష్టం

▸▸ రెండు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ చైర్మన్ లేఖ

▸▸ నేడు బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల విషయంలో స్పర్థలు తలెత్తకుండా వ్యవహారాలను చక్కబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. తన సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని దుర్భర స్థితిలోకి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో బోర్డు చైర్మన్ శివనందన్‌కుమార్ రెండు తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకూ పరిస్థితిని వివరిస్తూ లేఖలు రాశారు. 'బోర్డు నిర్వహణ కోసం క్రమం తప్పకుండా కేటాయించాల్సి నిధులు గత రెండేళ్లుగా ఇవ్వడం లేదు. బోర్డును మూసేసుకోవడం మినహా గత్యంతరం లేదు' అంటూ కేఆర్ఎంబీ చైర్మన్ లేఖ రాశారు. కృష్ణా జలాలను బోర్డు నియంత్రణలోకి తీసుకోవడాన్ని ఆది నుంచీ తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తుంటే ఆంధ్రప్రదేశ్ మాత్రం సమర్థించింది. ఆమేరకు బోర్డు మనుగడకు సహకరించాల్సిన వైసీపీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదు. బోర్డు చైర్మన్ రాసిన లేఖపై ఇటు ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డిగానీ, అటు తెలంగాణ సీఎస్ శాంతకుమారిగానీ స్పందించిన దాఖలాలు లేవు. ప్రతి బోర్డు సమావేశంలోనూ కేఆర్ఎంబీ బడ్జెట్‌ను గురించి ప్రస్తావన చేయడం, ఏపీ వినీ విననట్లు వదిలేయడం అలవాటుగా మారింది. ఈ నేపథ్యంలో నేడు, సోమవారం హైదరాబాద్ జలసౌధ ప్రాంగణంలోని కేఆర్ఎంబీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో నిధుల విడుదలపై బోర్డు, రెండు తెలుగు రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకువచ్చే అవకాశం ఉంది.

రిటైర్డ్ ఉద్యోగులకు విందులు

▸▸ సచివాలయాల్లో పార్టీ కార్యక్రమాలు

▸▸ 'కోడ్'ను బేఖాతరు చేసిన మంత్రి ధర్మాన

▸▸ ఎంసీసీ ఫిర్యాదుతో రెండు కేసులు నమోదు

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 21: వైసీపీ సీనియర్ నాయకుడు, మంత్రి ధర్మాన ప్రసాదరావు.. నా ఇష్టం నాదే.. అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా.. దానిని బేఖాతరు చేస్తూ తాను చేయాలనుకున్న పనులు ఎంచక్కా చేసుకుపోతున్నారు. అయితే.. నేతల కోడ్ ఉల్లంఘనలను డేగకన్నుతో పసిగడుతున్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) బృందం ధర్మాన లీలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆయనపై రెండు కేసులు నమోదు చేసినట్టు శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ జి.వాసు తెలిపారు. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున బరిలో ఉన్న ధర్మాన.. ఈ నెల 14న సాయంత్రం కళ్లేపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సదర్భంగా గ్రామ సచివాలయ భవనాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అంతేకాదు, ఆ సచివాలయం వద్దే కొంతమంది స్థానికులకు వైసీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఇది కోడ్ నిబంధనలను ఉల్లంఘించడమేనని ఎంసీసీ బృందం గుర్తించింది. అలాగే శుక్రవారం రాత్రి స్థానిక ఓ హోటల్‌లో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులను ఆకట్టుకునేందుకు 'ఆత్మీయ కలయిక' పేరుతో ధర్మాన ప్రసాదరావు సమావేశం ఏర్పాటు చేశారు. వైసీపీని గెలిపించాలని కోరారు. అంతేకాదు.. వారందరికీ షడ్రశోపేతమైన విందు ఇచ్చారు. దీనిని కూడా ఎంసీసీ బృందం పసిగట్టింది. ఈ రెండు ఘటనలపై పోలీసులు ఎంసీసీ బృందం ఫిర్యాదు చేయడంతో ధర్మానపై కేసులు నమోదు చేశారు.

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

వడ్లరాశి కింద



ఇంకా ఆ గుట్టల కింద చేలలో
మోపులు కట్టి ఎత్తుతున్నట్టే ఉంది

కోత కోసిన ఆ చేల నడుమ తిరిగే
మిణుగురులు గుర్తొచ్చినప్పుడు
గుండెగుమ్మి నిండా
చీకట్లు కమ్ముకుంటున్నయి.

తూర్పాల పట్టి, వొడ్లు కుప్పనూకినంక
చుట్టూ పొత్తి వోస్తుంటే
వొడ్లరాశి మీద కొడవలి లెక్క కూర్చునే
ఆ వెన్నెలపిట్ట ఏ మబ్బుల్లో దాసుకుందో!

కుట్టిన వొడ్లబస్తాలకు ఆనుకొని
కల్లుధార కోసం మర్రాకు పట్టుకునే
కూలీతల్లులందరు ఇప్పుడెక్కడ ఉన్నరో!

గడ్డివాము సందుల్లో
సాట, పొరక దాచిపెట్టిన
ఆ గుర్తులెక్కడున్నవో ఇప్పుడు?
రెక్కలు దాసుకోకుండా
నిండార కూలిజేసి ఇంటికొచ్చి
కంటినిండా నిద్రపోయిన రోజులేవి?

ఎడ్లకు గడ్డేసి, బర్లకు కుడితివెట్టి
పాలు పిండుకొని వచ్చె మా ఎంకన్న
ఎప్పుడైనా ఎదురైయ్యిండా?
ఏ మెట్రోస్తంభాల కింద
వరికంకుల బొమ్మ గీస్తుండో.

ఇట్లా మీ మధ్య
ఆరడుగుల నీడలాగ తిరుగుతున్న గానీ
పరిగె గింజలాగ
నా ఆత్మను ఆ చేలలోనే వొదిలేసి వచ్చిన

ఏ అర్ధరాత్రి పూటైనా మెలకువ వస్తే
రెక్కలుగట్టుకొని వరికల్లంలోకి వాలిపోత

కల్లం చేసుడంటే మాటలా?
బండెడు పెండ తెచ్చి అలుకుపెట్టాలె
తెల్లారక ముందే బంతులు గట్టాలె
ఎండగాక ముందే మెద దులుపాలె
కొలిచేటప్పుడు కుండ కుండకు
ఆరున్నొక్క రాగం ఎత్తుకోవాలె

మార్కెట్ ముందట
రైతు ఇప్పుడు ధర పలుకుతలేడు గానీ
ఒకప్పుడు పనివాటోళ్ళందరూ
'కట్టడి'కి వరుసగట్టెటోళ్ళు
పక్షులకింతా, ప్రకృతికింతా
కూలిచేసినోళ్ళకింత పంచిపెట్టినంక
మిగిలినదానితోటి తిన్న నాడే
రైతు పచ్చని నారుమడి లాగ బతికిండు
ఇయ్యాల ఎడ్లకు
ఏ రాజ్యపు దిష్టి తగిలిందో
ఒంటి మీద ఎక్కడ చూసినా
నల్లగా వాతలు పెట్టిన
అచ్చులు మిగిలినవి
పుట్లకొద్ది ధాన్యం పండె పొలంలో
ఇనుపకంచెలు మొలుస్తున్నవి

పొలాలను దాటి, ఎంతో దూరం వచ్చేసి
నాగరికత అంటున్నం గానీ
ఆ నాగరికతకు మూలాలు
ఇంకా ఆ వడ్లరాశి కిందనే ఉన్నయి.

తగుళ్ళ గోపాల్
83098 37260

ఆటా నవలల పోటీ ఫలితం

అమెరికా తెలుగు సంఘం (ఆటా) నిర్వహించిన నవలల పోటీలో ఉణుదుర్తి సుధాకర్ రచించిన 'చెదరిన పాదముద్రలు' నవలకి లక్ష రూపాయిలు బహుమతిగా ఇవ్వాలని ఆటా కార్యవర్గం నిర్ణయించింది. ఈ నవలని ఆటా త్వరలోనే ప్రచురిస్తుంది.

రవి వీరెల్లి

'లౌకిక విలువలు - సాహిత్యం' సదస్సు

సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో 'లౌకిక విలువలు-సాహిత్యం' అంశంపై తెలంగాణ రాష్ట్ర స్థాయి సదస్సు ఏప్రిల్ 28న ఉదయం 10గంటల నుంచి సెనేట్ హాల్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్‌లో జరుగుతుంది. ప్రారంభ సమావేశం తర్వాత నాలుగు సెషన్లలో జరిగే సమావేశాలకు యాకూబ్, మెట్టు రవీందర్, పసునూరి రవీందర్, భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహిస్తారు. ప్రాంభోపన్యాసం నందిని సిధారెడ్డి, ముగింపు ఉపన్యాసం ఖాదర్ మొహియుద్దీన్ చేస్తారు. అంశాలపై ప్రసంగాలు ఉంటాయి. 'ఫాసిస్ట్ పోకడలను సాహిత్యంలోకి వస్తువుగా తీసుకురావడం ఎలా?' అంశంపై నరేష్ కుమార్‌సూఫీ, మెర్సీ మార్గరెట్ నిర్వహణలో ప్యానెల్ డిబేట్ ఉంటుంది.

సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం

ఐదు పుస్తకాల ఆవిష్కరణ

కొండపల్లి నీహారిణి మూల గ్రంథానికి మరిగంటి లక్ష్మణాచార్యులు హిందీ అనువాదం 'చిత్రకళా తపస్వి డా. కొండపల్లి శేషగిరిరావు కీ జీవన్ గాథా'; కొండపల్లి నీహారిణి రాసిన స్త్రీవాద సాహిత్య విమర్శ సంపుటి 'అనివార్యం'; మయూఖ అంతర్జాల పత్రిక కథా సంకలనాలు 'కథా మయూఖం', 'బాల కథా మయూఖం'; ఇంకా ధూళిపాళ అరుణ కథా సంపుటి 'మిగిలేవి గురుతులే'.. ఈ ఐదు పుస్తకాల ఆవిష్కరణ సభ ఏప్రిల్ 27 ఉదయం 10గంటల నుంచి స్పైసీ హబ్ హోటల్, కొత్తపేట, హైదరాబాద్‌లో జరుగుతుంది. మాడిశెట్టి గోపాల్, ఓలేటి పార్వతీశం, ఎన్. గోపి, నరేంద్రరాయ్, వారాల ఆనంద్, కొలకలూరి ఇనాక్, సి. మృణాళిని, తదితరులు పాల్గొంటారు.

నక్క హరికృష్ణ

'నీతిచంద్రిక - చిన్నయ గద్యశైలి' అంశంపై ప్రసంగం

రాజాం రచయితలవేదిక సమావేశం ఏప్రిల్ 28 ఉ.10గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో విద్యానికేతన్ పాఠశాలలో జరుగుతుంది. పై అంశంపై ఒమ్మి రమణమూర్తి ప్రసంగిస్తారు.

గార రంగనాథం

అనగనగా ఒక 'మంచి పుస్తకం'

20 సంవత్సరాల మంచి పుస్తకం

పిల్లలు బాగుంటే ప్రపంచం బాగుంటుంది. పిల్లలు సృజనాత్మకంగా ఎదిగితే భవిష్యత్తు కళాత్మక శోభతో అలరారుతుంది. ఉత్కృష్టమైన ఈ పనికి తల్లిదండ్రుల కన్నా, తరగతి గదుల కన్నా పుస్తకాలే ఎక్కువ దోహదపడగలుగుతాయి. పాఠ్య పుస్తకాల కంటే పఠన గ్రంథాలే ఈ వికాసానికి దారి చూపగలుగుతాయి. ఈ ఎరుకతోనే సరిగ్గా ఇరవయ్యేళ్ల క్రితం ఇదే నెలలో ఏర్పాటైంది 'మంచి పుస్తకం'. బాల సాహిత్యం కోసమే అంకితమయ్యి ఈ రెండు దశాబ్దాల్లో అయిదు వందల వరకు పుస్తకాలు ప్రచురించింది. లాభాపేక్షకి అతీతంగా పిల్లల బాగే తమ ఆకాంక్షగా నిర్వాహకులు కొసరాజు సురేష్, పి. భాగ్యలక్ష్మి పనిచేస్తున్నారు. 'మంచి పుస్తకం' అనేది ఇప్పుడు వారి ఇంటిపేరయ్యింది. వారందించే ప్రచురణలు పిల్లల పాలిట మంచి పుస్తకాల పంటయ్యింది. గురుతరమైన ఈ పనిలో ముఖ్య భూమికగా ఉన్న సురేష్, భాగ్యలక్ష్మిలతో మాటామంతి!

'మంచి పుస్తకం' తొలి అడుగుల గురించి చెప్పండి?

సురేష్: 'బాల సాహితి' పునాదిగా 'మంచి పుస్తకం' ఏర్పడింది. పిల్లల్లో తెలుగు బాగా చదివే సామర్థ్యాన్ని పెంచటం, పుస్తకాలు అంటే ప్రేమ కలిగేలా చెయ్యటం ఈ రెండు సంస్థల ఉద్దేశాలు. 1990లో 'బాల సాహితి' ట్రస్ట్‌గా ఏర్పడినప్పుడు, 2002లో 'మంచి పుస్తకం' పని మొదలుపెట్టి 2004లో దీనినొక ట్రస్ట్‌గా రిజిస్టర్ చేసినప్పుడు తెలుగులో పిల్లల పుస్తకాలలో కొంత కొరత ఉందనే చెప్పాలి. ఉన్నవాటితో మొదలుపెట్టి, ప్రచురణలు పెంచుకుంటూ, ఎంపిక చేసిన పుస్తకాలు పంపిణీ చేస్తూ పుస్తకాల జాబితాను విస్తరించుకుంటూ ముందుకెళ్లాం. కంటెంట్, నాణ్యత, ధరల రీత్యా మంచి పుస్తకం ప్రత్యేక గుర్తింపు పొందింది.

'మంచి పుస్తకం' అనగానే పిల్లల పుస్తకాలకి అడ్డా అన్న గుర్తింపు తెచ్చుకోగలిగారు. ఈ నేపథ్యంలో మీ ఇరవై ఏళ్ల కృషి ఎలా సాగిందో చెప్పండి?

భాగ్యలక్ష్మి: పుస్తకాల ప్రచురణ చేస్తున్నప్పుడు అవి పెద్ద ఫాంటుతో, బొమ్మలతో చైల్డ్ ఫ్రెండ్లీగా ఉండటానికి మంచి పుస్తకం ప్రాధాన్యత ఇచ్చింది. అదే క్రమంలో బై-లింగ్వల్ పుస్తకాల ప్రచురణ మొదలయ్యింది. సోవియట్ బాల సాహిత్యాన్ని మొదట్లో ఎక్కువగా తిరిగి ప్రచురించింది. అప్పటికే ఉన్న సోవియట్ పిల్లల పుస్తకాల తెలుగు అనువాదాలలో భాషను సరళీకరించి, ఫాంట్ సైజ్ పెంచి ప్రచురించింది. వీటిల్లో కొత్తగా కొన్ని అనువాదాలను మంచి పుస్తకం చేయించింది కూడా.

పిల్లలు చదవటానికి దోహదం చేసేలా చేసిన ప్రయోగాలలో 'కథాకదంబం' పేరుతో మంచి పుస్తకం 50 కార్డులను ప్రచురించింది. ఒక్కొక్క కార్డు 4 పేజీలు. చిన్న కథల నుండి మొదలై క్రమేపి కథలు పెద్దవి అవుతాయి. వీటి ఆధారంగా పిల్లలు తెలుగు చదవటం నేర్చుకున్నారని చాలా మంది టీచర్లు, తల్లిదండ్రులు, వాలంటీర్ల ద్వారా ఫీడ్‌బ్యాక్ లభించింది.

పిల్లల పుస్తకాలు అంటే క్రౌన్ సైజులో చిన్నగా ఉంటాయని కొంచెం పెద్ద తరగతి పిల్లల్లో ఓ అభిప్రాయం బలపడిన సంగతి మా గమనికలోకి వచ్చింది. ఆ పుస్తకాలు సైజు పెంచి ఉన్నా ఆకర్షణ కొరవడి వాటిని చదవటానికి సిద్ధంగా లేరని పరిశీలనలో తెలిసింది. ఈ మానసిక అవరోధాన్ని అధిగమించటానికి 1/8 డెమ్మీ సైజులో 16 పేజీల పుస్తకాలను ఇంపైన రీతిలో 'పుస్తకాలతో స్నేహం' అన్న సిరీస్‌ని మంచి పుస్తకం ప్రచురించింది. పది పుస్తకాలు ఒక సెట్‌గా మొత్తం 160 పేజీల రీడింగ్ మెటీరియల్ ఇది. ఒక పుస్తకం చదవగానే పిల్లల్లో ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. '0' లెవల్ నుంచి 5వ లెవల్ వరకు ఇప్పటివరకు 10 సెట్లలో 85 పుస్తకాలను ఈ సిరీస్‌లో మంచి పుస్తకం ప్రచురించింది. చదవటంలో పిల్లలు ఏ స్థాయిలో ఉన్నారో వీటి ద్వారా తెలుసుకుని అక్కడినుంచి ముందుకి వెళ్లడానికి ఇవి ఎంతో ఉపయోగపడుతున్నాయి.

పిల్లల మానసిక వికాసానికి సాహిత్యం ఎలా దోహదపడుతుంది?

సురేష్: పుస్తకాలు చదవటం ద్వారా ఆలోచనా శక్తి, సృజనాత్మకత, భావ ప్రకటన వంటి ప్రయోజనాలు ఉంటాయని అనేకమంది చెపుతుంటారు. ఇందులో అనుమానం కూడా లేదు. కానీ, పిల్లలకు పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్న ఆలోచన తప్పించి ఇతర ఏ ఉద్దేశాలు పెద్దవాళ్లకు ఉండకూడదు. పుస్తకాల నుంచి ఏం ఎంచుకుంటారో, ఏం నేర్చుకుంటారో పిల్లలకే వదిలెయ్యాలి. అది వాళ్ల వ్యక్తిగత పురోగతి.

ఏది బాల సాహిత్యం అని చెప్పడానికి నిర్దిష్ట ప్రమాణం ఏంటి?

భాగ్యలక్ష్మి: బాలలు అంటే 0-16 సంవత్సరాల వరకు ఉంటారు. వీళ్ల వివిధ ఆర్థిక, సామాజిక వర్గాలకు చెందిన వాళ్లు. వయస్సు బట్టి బొమ్మల సంఖ్య, ఫాంట్ సైజ్‌లలో తేడాలు ఉంటాయి. ఇక కంటెంట్ విషయానికి వస్తే వైవిధ్యానికి అంతు ఉండదు. తల్లిదండ్రుల మధ్య ఘర్షణ ఉండే కుటుంబ నేపథ్యం, ఆడపిల్లల వేధింపులతో మొదలుకుని మురికివాడల పిల్లల బొమ్మల కథల వరకు అన్నీ పిల్లల పుస్తకాలే. ఏ పుస్తకం ఎవరికి, ఎందుకు నచ్చుతుందో, ఎలా ప్రభావితం చేస్తుందో మనకి తెలియదని మంచి పుస్తకం బలంగా నమ్ముతుంది. సాధ్యమైనన్ని పుస్తకాలు పిల్లలకు అందుబాటులో ఉంచటమే మన పని.

ఈ ఇరవయ్యేళ్ల ప్రచురణల పర్వంలో మీకు ఎదురైన పెద్ద సవాళ్లు ఏమైనా ఉన్నాయా?

సురేష్: తెలుగులో చక్కటి మూల కథలు, నవలలు లేని కారణంగా అనువాదాలపై మొదట్లో ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది. తానా సంస్థతో కలిసి రచనలను ఆహ్వానించి, ఎంపిక చేసిన వాటిని ప్రచురించటం ద్వారా దీనిని అధిగమించగలిగాం. మంచి పుస్తకం ప్రచురించిన 114 మూల రచనలలో 49 తానాతో చేసినవి!

మరొక పెద్ద సమస్య బొమ్మలు వేయించటం. మాకు బాగా చనువు ఉన్న శ్రీకాంత్ నాల్గింట మూడు వంతుల బొమ్మలు వేశాడంటే అతిశయోక్తి కాదు. అలాగే పావని, రాహుక్ మాకు సన్నిహితమైన ఆర్టిస్టులు. చైతన్య పైరపు (కోవిడ్ కాలంలో చాలా చిన్న వయస్సులోనే చనిపోయాడు), తుంబలి శివాజీలు పరిచయం అయిన తరవాత బొమ్మలు వేయించటంలో వెసులుబాటు అయ్యింది. తాన సంస్థతో కలిసి ప్రచురించిన బొమ్మల కథల పుస్తకాలు, నవలలకి కొంతమంది కొత్త ఆర్టిస్టులతో బొమ్మలు వేయించాం.

తెలుగులో బాల సాహిత్యానికి ఆదరణ ఎలా ఉంది?

భాగ్యలక్ష్మి: కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు తెలుగు పుస్తకాలు చదవాలని అనుకుంటున్నారు. మరి కొందరేమో తెలుగు





వద్దని అనుకుంటున్నారు. అంతే కాకుండా ప్రయివేటు స్కూళ్లల్లో తెలుగులో మాట్లాడకూడదన్న నిబంధనలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం మొదలుపెట్టడం... ఇన్ని గందరగోళాల మధ్య కొట్టుమిట్టాడుతోంది తెలుగు బాల సాహిత్యం. ఇంతటి క్లిష్ట పరిస్థితులలోనూ మునుపటి కంటే ఇప్పుడు పిల్లల పుస్తకాల ఆదరణ బాగానే ఉందని చెప్పాలి.



ఇక తెలుగునాట వెలువడుతున్న బాల సాహిత్యం విషయానికి వస్తే సమకాలీన అంశాలతో కథలు చాలా తక్కువగా వస్తున్నాయి. కౌమార వయస్సు బాలల (యంగ్ అడల్ట్స్) కోసం పుస్తకాల అవసరం కూడా ఉంది. 'బాల్యం కథలు' చాలా మంది రాశారు. అలాగే పిల్లల కోసం కూడా రాస్తే బాగుంటుంది. పెద్దవాళ్ల కోసం రాసే వాళ్లు పిల్లల కోసం రాస్తే బాగుంటుంది. వాస్తవ జీవితాలు, అనుభవాల ఆధారంగా కథలు రాసే ఒరవడి ఏర్పడాలి.

నేటి తరం పిల్లల సైకాలజీ ఎలా ఉంటోంది? బాల సాహిత్యంతో వారికి స్నేహం కుదురుతోందా అసలు?

భాగ్యలక్ష్మి: ఇంగ్లీషులో తోటివాళ్లు చదువుతున్న దాన్ని బట్టి పెద్ద పెద్ద పుస్తకాలు, పుస్తకాల సిరీస్‌లు పిల్లలు చదువుతున్నారు. తెలుగులో చదువుతున్న పిల్లలకు చుట్టుపక్కల అంతగా పుస్తకాల వాతావరణం, చదివే సంప్రదాయం కనపడటం లేదు. కాబట్టి బాల సాహిత్యంతో అంతగా స్నేహం కుదరటం లేదనే చెప్పాలి.

పాఠ్య ప్రణాళికల్లో సాహిత్యాంశానికి ఎంత శాతం ప్రాధాన్యం ఉండాలి? ఆ మేరకు మన దగ్గర చోటు కల్పిస్తున్నారా లేదా?

సురేష్: పాఠ్య ప్రణాళికలలో ఏది చేరినా దానిని పరీక్షలు, మార్కుల దృష్టి నుంచే ఎక్కువగా చూస్తారు. తప్పనిసరిగా చదవాల్సిన దానికీ, ఇష్టంతో చదివే దానికీ మధ్య చాలా తేడా ఉంటుంది. పాఠ్యపుస్తకాలలోని కవితలు, కథలతో ప్రభావితం కావాలంటే వాటిని ఎంతో ఇష్టంగా చెప్పే టీచర్లు ఉండాలి. అలాంటి టీచర్లు తక్కువ, దీనివల్ల సాహిత్యం పట్ల ఇష్టం ఏర్పడే పిల్లలు ఇంకా తక్కువ.

డిజిటల్ యుగంలో.. అందునా కరోనా తర్వాత ఆన్‌లైన్ క్లాసుల కల్చర్ పెరిగింది. చిన్నారులు కూడా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వాడకానికి అలవాటు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి సాహిత్య ప్రయోగాలు అవసరమని భావిస్తున్నారు?

భాగ్యలక్ష్మి: అన్నం తినటం లేదనో, విసిగిస్తున్నారనో యూట్యూబ్ చూపించే వాళ్లు ఉన్నారు. పెద్దవాళ్లు కూడా చాలా ఎక్కువగా సెల్ ఫోన్, యూట్యూబ్, టీవీ, కంప్యూటర్, సోషల్ మీడియాలలో గడుపుతున్నారు. వెరసి పెద్దవాళ్ల స్క్రీన్ టైమ్ చాలా పెరిగింది. అదే పిల్లలకి కూడా అలవాటైతే నేరం మొత్తం వాళ్ల మీద మోపుతున్నాం.

చిన్న పిల్లలకి యూట్యూబ్ ఆడియో రైమ్స్, యానిమేటెడ్ కథలు, ఆడియో బుక్స్‌ని మంచి పుస్తకం ప్రోత్సహించటం లేదు. చేతిలో పుస్తకం పట్టుకోవటం కనీసం ఒక వయస్సు వరకైనా తప్పనిసరి అని మంచి పుస్తకం గాఢంగా నమ్ముతోంది. పిల్లలు చదవగలగటానికి పుస్తకాలే సరైన మాధ్యమం. డిజిటల్ మీడియా వేగంగా చొచ్చుకుని పోతున్న సమయంలో పుస్తకాన్ని, చదవటాన్ని బలంగా ముందుకు తీసుకుని వెళ్లాలంటే ప్రచురణకర్తలతోపాటు పుస్తకాలను పిల్లలకు దగ్గర చెయ్యటానికి తల్లిదండ్రుల, ఉపాధ్యాయులు, పెద్దవాళ్ల భాగస్వాములు కావాలి.

ఏఏ వయసు పిల్లలకి ఎలాంటి పుస్తకాలు ఇస్తే వారిలో పఠనాసక్తి పెరుగుతుంది?

సురేష్: చిన్న పిల్లలకు బొమ్మల కథల పుస్తకాలు, గొలుసు కట్టు కథలు (ఉదా: పేరు మరిచిన ఈగ, చిలక ముక్కు ఊడిపోయింది) బాగుంటాయి. పెద్దవాళ్ల కోసం రాసేటప్పుడు ఎటువంటి కథా లక్షణాలు ఉండాలో పిల్లల కథలలో కూడా అవే ఉండాలి. ముందు ముందు ఏం జరుగుతుందో అన్న ఉత్సుకతను కథ కలిగించాలి, ఒక సమస్య ఉండి దానికి పరిష్కారం ఉండాలి, క్లైమాక్స్ లేదా ముగింపు ఆశ్చర్యం కలిగించేలా ఉండాలి. మొత్తంమీద పెద్ద సంఖ్యలో మంచి పుస్తకాలు, సమాజంలో చదివే వాతావరణం ఉంటే పిల్లల్లో కూడా పఠనాసక్తి పెరిగే అవకాశం ఉంది.

ఈ ప్రయాణంలో పరిపరి తలుచుకునే ఇష్టం సందర్భాల గురించి చెప్పండి?

భాగ్యలక్ష్మి: విభవసు అని ఒక అబ్బాయి చిన్నప్పటి నుంటి హెచ్‌బిఎఫ్‌లో మా స్టాలులో కూర్చుని సైన్స్ పుస్తకాలు చదువుకునేవాడు. తెలుగులో చదవటం వల్ల కాన్సెప్ట్స్ చాలా వరకు అర్థం అయ్యాయని, తోటి విద్యార్థులకు అనుమానాలు ఉంటే వివరించగలిగేవాడినని, తద్వారా ఎంతో నేర్చుకున్నానని విభవసు చెప్పాడు. ఆ కారణంగానే యాస్ట్రో ఫిజిక్స్‌లో ఆసక్తి ఏర్పడిందనీ చెప్పాడు. ఎంతో సంతోషం కదా!

హైదరాబాదు పుస్తక ప్రదర్శన జరుగుతున్నప్పుడు ఆఫీసు మూసివేస్తాం. ఆ సమయంలో నల్లగండ్లలోని తల్లిదండ్రుల దగ్గరకు అమెరికా నుండి వచ్చిన ఒక తల్లి తన కొడుకుతో ఆఫీసుకు వచ్చింది. ఆఫీసు మూసి ఉండటంతో అంతటి ఎండలో బుక్ ఫెయిర్‌కి వాళ్లు వచ్చారు. అక్కడికి రాగానే తనకి పరిచయం ఉన్న 'కోటయ్య కట్టిన ఇల్లు' కనపడటంతో దానిని తీసుకుని ఆ బాబు కింద కూర్చుని దాంట్లో మునిగిపోయారు. పెద్దవాళ్లు కూడా పిల్లలతో సమానంగా పుస్తకాలు చూసి ఆనందపడుతుంటే అవే మాకు ఆనంద క్షణాలు.

బాల సాహిత్య వృద్ధికి వచ్చే రోజుల్లో మీరెలాంటి కృషి చేయాలని భావిస్తున్నారు?

భాగ్యలక్ష్మి: నేల విడిచి సాము చెయ్యకుండా ఇప్పుడు చేస్తున్న పనిని ఇంకా బాగా చెయ్యాలి. మూల రచనలను ప్రోత్సహిస్తూనే అనువాదం కోసం మంచి పుస్తకాలను ఎంపిక చేసి తెలుగులోకి తీసుకుని రావాలి. ఆలోచనలు పుట్టి, కొంత పని జరిగి ప్రచురణ వరకు రాని పుస్తకాలు ఎప్పుడూ ఉంటూ ఉంటాయి. మళ్లీ కొత్త శక్తినీ, స్ఫూర్తినీ తెచ్చుకుని వాటిని వెలుగులోకి తీసుకుని వచ్చే ప్రయత్నం చేస్తూ ఉంటాం.

ఇంటర్వ్యూ: ఒమ్మి రమేష్ బాబు

పార్వతీశం, నీకు వందేళ్ళు!

1924లో తెలుగులో పూర్తి హాస్య నవలగా ముద్రింపబడినది మొక్కపాటి నరసింహశాస్త్రి 'బారిష్టర్ పార్వతీశం'. ఈ నవలకు రచయితనంటే తప్ప గుర్తుపట్టలేనంతగా నవల ప్రఖ్యాతి తనను మించి స్థిరపడిపోయిందని, "ఆ పేరు మీదనే నేటికీ చెలామణీ అవుతున్నా"నని మొక్కపాటి నరసింహశాస్త్రి ఒకచోట చెప్పుకుంటారు. గత శతాబ్ద కాలంలో (1924-2024) ఈ నవల పొందిన ప్రజాదరణకు ఇదొక నిదర్శనం.

తెలుగు నవలా సాహిత్యంలో హాస్య రచనలు కాస్త తక్కువే. ఆ తరహా రచనలు చేసిన వారిని వేళ్ళ మీద లెక్కించవచ్చు. హాస్యం ద్వారా 'వ్యంగ్యం' చెప్పేవారున్నారు. నిజానికి రెండూ వేరు వేరు. ఎన్.ఆర్. నంది, పతంజలి, ఆదివిష్ణు, డి.వి. నరసరాజు, యర్రంశెట్టి సాయి, జంధ్యాల తదితరులు, వీరితోపాటు ముళ్లపూడి వెంకటరమణ, శ్రీరమణలను ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. 'రాజకీయ బేతాళ పంచ వింశతిక', 'నవ్వులో శివుడున్నాడురా' వంటి రచనలు నేటికీ 'వాస్తవ దృశ్యాలు'గా నిలిచి ఉన్నాయంటే కారణం- 'హాస్యం' (వ్యంగ్యం).



ఏముందీ 'బారిష్టర్ పార్వతీశం' నవలలో అనే సందేహం ఉన్నవారు బహుశా తెలుగు లోకంలో తక్కువనే నా భావన. ఇది మూడు భాగాల రచన. మొదటి భాగంలో ఉన్న హాస్యం రెండు మూడు భాగాలలో క్రమంగా తగ్గిందనే భావన ఉంది. ఇందుకు కారణంగా రచయిత 'హాస్యం జీవితంలో అన్ని దశల్లోనూ సమానంగా ఉండకపోవచ్చు' అని సర్ది చెప్పారు. వాస్తవం కూడా అంతే కదా. ఈ రచనలో ప్రధాన పాత్ర పార్వతీశం. ఇతను నరసాపురం దగ్గర మొగల్తూరు గ్రామవాసి. పడవ ప్రయాణం అతని నిత్య వ్యవహారం. అతను చదువు కోసం చెన్నై వెళ్లాడు. అక్కడి నుంచి ఇంగ్లాండ్ వెళ్లి బారిష్టర్ చదువుకొని వచ్చాడు. ఇదీ వరుసగా ఆ కుర్రాడి జీవితంలో 'వివిధ వికాస దశలు'. అయినా 'ఆంగ్లేయ విద్యతో పాటు అబ్బవలసిన అనేక రకాలైన సుగుణాలు అతనిలో కొరతపడ్డాయి. నేటి నాగరికతంతా అతనికి కొత్త. ఎన్నడూ రైలెక్కి ఎరగని వ్యక్తి అని శాస్త్రిగారు ముందుమాటలో చెబుతారు. అటువంటి వ్యక్తి ఇంగ్లాండు వరకు వెళ్లి బారిష్టర్ చదివి వచ్చాడంటే నమ్మవలసిందే.

పార్వతీశం చేసే ప్రతీపనిలో చదువరికి హాస్యం 'కనిపిస్తుంది'. రైలులో అతడి నడత, మద్రాసులోనూ పడిన అవస్థలు, స్టీమర్‌లో చిక్కులు... రచన చదువుతున్నంతసేపు ఒక ఘట్టానికి మించి మరొక ఘట్టం కడుపు చెక్కలయ్యేలా నవ్విస్తుంది. చక్కని, ఆరోగ్యవంతమైన హాస్యాన్ని రచయిత మొక్కపాటి నరసింహశాస్త్రి ఈ రచనలో స్పృశించారు.

'బారిష్టర్ పార్వతీశం' చిరంజీవిగా నిలిచిపోవడానికి కారణం- ప్రధాన వస్తువులోని సునిశితమైన 'సన్నివేశపరమైన హాస్యం' దానికి సరిజోడైన 'సంభాషణ పరమైన' హాస్యం. అలాగే మనం కొత్త ప్రాంతాలకు పోయినప్పుడు అక్కడ ఆచార వ్యవహారాలు, వస్తువులు చూసినప్పుడు వాటిని ఎలా అనుసరించాలో తెలియక అయోమయానికి గురవుతాం. ఫోర్క్, చెంచాలతో దోశ తినటం ఎలానో నాకిప్పటికీ తెలియదని ప్రముఖ సినీ హాస్య రచయిత, దర్శకుడు జంధ్యాల అంటారు. అటువంటిది మొగల్తూరులోని అమాయకమైన కుర్రాడు చెన్నై, ఇంగ్లాండ్లకు వెళితే...!? "పొరపాటు మరో పొరపాటుకి మూలమై వికృతులు ఒకదానికొకటి గుది గ్రుచ్చినట్లు పెనవేసుకున్నట్లు చూపించి, ఊహకందని వంపులోకి కథను ఈడ్చితే"! అతనికి ఆవేదన, చదువరులకు ఆనందం!

పార్వతీశం స్వభావతః మూర్ఖుడు కాదు. పరిస్థితులతనిని మూర్ఖునిగాచేసి వెక్కిరిస్తాయి. పార్వతీశానికి మించి ఎప్పుడో ఒకప్పుడు నవ్వుల పాలైన అవస్థలు జీవితంలో మనం కూడా ఎదుర్కొనే ఉంటాం. అందుకే పార్వతీశం మనందరివాడు. ఇందుకు కారకులైన మొక్కపాటి వారికి తెలుగు సాహితీ లోకం ఋణపడి ఉంది.


> **పార్వతీశం స్వభావతః మూర్ఖుడు కాదు. పరిస్థితులతనిని మూర్ఖునిగా చేసి వెక్కిరిస్తాయి. పార్వతీశానికి మించి ఎప్పుడో ఒకప్పుడు నవ్వుల పాలైన అవస్థలు జీవితంలో మనం కూడా ఎదుర్కొనే ఉంటాం. అందుకే పార్వతీశం మనందరివాడు. ఇందుకు కారకులైన మొక్కపాటి వారికి తెలుగు సాహితీ లోకం ఋణపడి ఉంది.**

'బారిష్టర్ పార్వతీశం' రచనలో అతడు ఆడవాళ్ళ టోపీ కొనటం, ఫ్రాన్స్‌లో షాపులో తివాచీ మీద నడవకూడదేమోననుకొని మైనం నునుపు పెట్టిన చెక్కల మీద నడవబోయి పడిపోవటం... ఇలా ఆ పాత్ర చేతకానితనం మనకు విపరీతమైన హాస్యాన్ని అందిస్తుంది. కానీ ఆ పరిస్థితుల్లో మనం ఉంటే అనే ఆత్మ పరిశీలన చేసుకుంటే నవ్వు రాదు. "ప్రతీ హాస్యం వెనుక ఓ విషాదం ఉంటుందనే" చార్లీ చాప్లిన్ వ్యాఖ్యానం ఈ రచనంతటా కనిపిస్తుంది. మానవుడు చాలా విషయాల్లో అజ్ఞానుడు. అతనిలో అజ్ఞాన జనితమైన అపచారాలు చాలా ఉంటాయి. ఇటువంటివి కొన్ని చేర్చి ఒక వ్యక్తిలో చూపించటం కొంతవరకు అతిశయోక్తిలా కనిపించినా తప్పక హాస్యజనకంగా ఉంటుందంటారు రచయిత. హాస్యాన్ని ఆస్వాదించేవారు ఎంతమంది ఉంటారో, విమర్శించేవారు అంతకుమించి ఉంటారు. ముఖ్యంగా ఆంధ్రదేశంలో 'ఇది కాపీ రచన' అని, 'వీడి బొంద ఇంతగా హాస్యం రాయడం మన వాళ్లకు.. అబ్బే' అన్నవారున్నారని రచయిత అంటారు. ఈ విషయం గురించి రచయిత తన ముందుమాటలో "ప్రతీ ఆంధ్రుడికి ఒక గట్టి నమ్మకం. ఏమంటే బుద్ధి కుశలత కలిగిన ఏ పనిగాని ఆంధ్రుడు చేయలేడని. అందుకని అటువంటి అపురూపమైన రచన ఏదైనా కనబడితే 'ఇది ఎక్కడో చేతి దెబ్బ కొట్టాడని' అనుకొని తృప్తి పడతారు. అలా అనుకోకపోతే పాపం వారికి ఆ పూట భోజనం చేసినట్లుండదు" అని రాసుకున్నారు. ఇది నాటికి (1924) నేటికి (2024) ఏనాటికి వాస్తవమే కావచ్చు.

రచయిత వాక్యాలలోనే ముగింపు పలుకుతాను: "ఎవరైనా నాకు నవ్వు ఎప్పుడూ రాదు అంటే అతని శరీరతత్వంలో ఏదో జబ్బు ఉన్నదన్న మాట. లేదూ ఏమైనా సరే నేను నవ్వనని ఎవరైనా భీష్మించుకుని కూర్చుంటే అతనికి కొంచెం దూరంలో ఉండటం మంచిదన్నారు (ఇది కూడా ఓ ఆంగ్ల రచయిత చెప్పినదే సుమండి. నేను గొప్ప ఆంధ్రుణ్ని మరి)".

భమిడిపాటి గౌరీ శంకర్
94928 58395

వృద్ధాప్యం ఒడ్డున



కనపడకుండా భూగర్భంలో
విత్తనం పెరుగుతున్నట్టు
పెరిగిపోతున్న వయస్సు

వయసొచ్చేది శరీరానికి
శరీర యంత్రాలకే అయినా
మనస్సుకీ ఆలోచనలకీ
ఎంత దూరమో..

నడవాల్సిన దారికి
నడిచొచ్చిన దారి
ఎన్నెన్ని రహస్య సూచనలో

వృద్ధాప్యం ఒడ్డుకి చేరుకుంటున్నపుడు
కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్నట్టుంది

సముద్రమధ్యంలో
అణిగిమణిగి ఉన్న అలల్లా
తీరానికి చేరువవుతున్న కొద్దీ
తెలియని ఉద్వేగం

నీటిలో దాని కాళ్లను
చూసుకుంటున్న వంతెనలా
ప్రపంచాన్ని ఇంతవరకూ చూసిన కళ్లు
గతాన్ని గుర్తు చేసుకుంటూనే ఉన్నాయి

పేరుకున్న ధైర్యంతో వృద్ధాప్యం
వ్యాధిలా అనిపించక
కాలాతీత ఆరోహణో
నాతో పెరుగుతున్న సంఖ్యలానో అనిపిస్తోంది


సాయంకాలం వెలుగులా
చూస్తూ చూస్తూనే శక్తి సన్నగిల్లుతున్నా
దూరాన చీకటిలో కూడా
ఎక్కడో మిణుకు మిణుకుమంటున్న కాంతి

మనస్సులోకి ఏ ముసలితనాన్నీ రానివ్వక
కొవ్వొత్తిలా కరుగుతూ
నిశ్శబ్దంగా నేర్చుకుంటున్నదే
అనువాదం చేసుకుంటున్నాను

సూర్యోదయాలే కాదు
సూర్యాస్తమయాలూ ఇష్టమే
రెండూ అనివార్యాలేనన్న ఎరుకతోనే
ఎంత దూరమైనా ప్రయాణం

ముకుంద రామారావు
99083 47273

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





బందరు లడ్డూ ఆనవాయితీ

ఇక్కడ గెలిచిన పార్టీకే రాష్ట్రంలో అధికారం..

* 1983 నుంచి కొనసాగుతున్న ఇదే పరంపర
* ఈసారి కూడా జరుగుతుందని బందరులో చర్చ
* టీడీపీ తరపున కొల్లు రవీంద్ర, వైసీపీ నుంచి పేర్ని కిట్టూ పోటీ
* ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి చేపడితే ఓటమే..!
* ఇప్పటికి మూడుసార్లు కొనసాగిన ఆనవాయితీ
* ఈ ఎన్నికల్లోనూ అదే కొనసాగుతుందా..?

మచిలీపట్నం నియోజకవర్గంలో అదో సెంటిమెంట్

• మచిలీపట్నం నియోజకవర్గం.. 1989లో కాంగ్రెస్ తరఫున పేర్ని కృష్ణ మూర్తి ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత జరిగిన 1994 ఎన్నికల్లో ఓడిపోయారు.

• 1999లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన నడకుదిటి నర సింహారావు కూడా మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2004 ఎన్నికల్లో ఓడిపోయారు.

• 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా నడకుదిటి అల్లుడు కొల్లు రవీంద్ర గెలిచి, మంత్రిగా పనిచేశారు. 2019 ఎన్నికల్లో ఆయన కూడా ఓడిపోయారు.

• 2019లో వైసీపీ ఎమ్మెల్యేగా పేర్ని నాని గెలిచి, మంత్రిగా పనిచేశారు.

ఈసారి జరిగే ఎన్నికల్లో ఈ సెంటిమెంట్ కొనసాగుతుందా? లేదా? అనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాగే, మచిలీపట్నం నియోజకవర్గంలో గెలిచే ఎమ్మెల్యే అభ్యర్థి ఏ పార్టీలో అయితే ఉంటారో, అదే పార్టీ రాష్ట్రంలో అధికారం చేపడుతుందనే ఆనవాయితీ ఇప్పుడు చర్చకు దారితీస్తోంది.



వినపడదా.. వినగడప

కట్టలేరుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని మరిచారా?

* టీడీపీ హయాంలోనే రూ.కోట్లతో ప్రతిపాదనలు
* వైసీపీ ప్రభుత్వం వచ్చాక పట్టించుకోని వైనం
* రూ.25 కోట్లతో నిర్మిస్తామన్న సీఎం జగన్
* సాంకేతిక పనులు పూర్తికాకుండానే శిలాఫలకం
* ఇంకా మొదలుకాక తిరువూరు ఎదురుచూపులు

జన కేతనంలో..

సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడి కేసులో అసలు నిందితులు ఎంతమంది? రిమాండ్ రిపోర్టులో ఏ2 ప్రోద్బలంతోనే ఈ ఘటన జరిగిందన్న పోలీసులు ఆ ఏ2 ఎవరో ఎందుకు చెప్పట్లేదు..? అసలు ఈ కేసులో రెండో నిందితుడు ఉన్నట్టా లేనట్టా?.. ఇప్పటికే అనేక మలుపులు తీసుకున్న గులకరాయి కేసు తాజాగా మరిన్ని సందేహాలను తెరపైకి తెచ్చింది.

ఏ2 ఎవరు?



న్యాయవాదిని కలిసిన దుర్గారావు కుటుంబం

పోలీసుల అదుపులో నుంచి ఇంటికి చేరుకున్న దుర్గారావు న్యాయవాది అబ్దుస్ సలీంను ఆదివారం కలిశాడు. కుటుంబ సభ్యులతో కలిసి మురళీ ఫార్చ్యూన్ వీధిలో ఉన్న న్యాయవాది ఇంటికి వెళ్లాడు. పోలీసులు ఖాళీ కాగితాలపై తనతో, తల్లిదండ్రులతో సంతకాలు చేయించుకున్నారని వివరించాడు. దీనిపై భవిష్యత్తులో ఏం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశాడు.

సీఎంపై గులకరాయి దాడి కేసులో అనుమానాలు

* ఏ2 చెప్తేనే దాడి జరిగిందని పోలీసుల రిమాండ్ రిపోర్ట్
* దుర్గారావు విడుదలతో అసలు ఏ2 ఎవరన్న ప్రశ్న
* ఇప్పటికే జిల్లా జైల్లో ఏ1 నిందితుడు సతీష్
* కావాలనే తనను ఇరికిస్తున్నారంటున్న దుర్గారావు
* నేటి సీఆర్పీసీ 164 పిటిషన్ విచారణపై ఉత్కంఠ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : సీఎంపై గులకరాయి దాడి కేసులో ప్రధాన నిందితుడు వేముల సతీష్‌కుమార్‌ను పోలీసులు ఇప్పటికే కోర్టులో హాజరుపరిచారు. ప్రస్తుతం అతడు నగరంలోని జిల్లా జైల్లో ఉన్నాడు. రెండో నిందితుడిగా అనుమానించి పోలీసులు అదుపులోకి తీసుకున్న వేముల దుర్గారావును శనివారం రాత్రే ఇంటికి పంపేశారు. వాస్తవానికి నిందితులిద్దరినీ కోర్టులో ఒకేసారి ప్రవేశపెడతారని సమాచారం లీక్ చేశారు. కానీ, సతీష్‌ను మాత్రమే కోర్టులో హాజరుపరిచారు. దుర్గారావును సోమవారం కోర్టులో హాజరుపరుస్తారని భావించారు. అదేరోజు సతీష్‌ను విచారించడానికి కస్టడీ పిటిషన్ దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉండగానే పోలీసులు ట్విస్ట్ ఇచ్చారు. దుర్గారావును ఇంటికి పంపేశారు. కేసు వాదించడానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చిన న్యాయవాది అబ్దుస్ సలీం.. దుర్గారావు ఆచూకీ చెప్పకపోతే హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేస్తానని చెప్పడంతో పోలీసులు అతడిని ఇంటికి పంపేశారన్న వాదన వినిపిస్తోంది.

కావాలనే చెప్పించారా..?

దుర్గారావును విడుదల చేయడంతో ఏ2 ఎవరు అనే ప్రశ్న వినిపిస్తోంది. ప్రధాన నిందితుడు వేముల సతీష్‌కుమార్‌ను కోర్టులో హాజరుపరిచినప్పుడు సమర్పించిన రిపోర్టు రిమాండ్‌లో ఏ2 ప్రోద్బలంతోనే ఈ ఘటన జరిగిందని పేర్కొన్నారు. అనుమానంతో తీసుకెళ్లిన దుర్గారావును ఇంటికి పంపడంతో అసలు ఏ2పై ఇప్పుడు చర్చ నడుస్తోంది. ఈనెల 16వ తేదీ తెల్లవారుజామున సతీష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకోగా, అదేరోజు సాయంత్రం దుర్గారావును పోలీసులు తీసుకెళ్లారు. సీసీఎస్‌లో ఇద్దరినీ విచారణ చేశారు. సతీష్‌కుమార్‌ను విచారించాక అతడు వెల్లడించిన అంశాలతో దుర్గారావుపై ప్రశ్నలను సంధించారు. ఈ ఘటనతో తనకు ఎలాంటి సంబంధం లేదని దుర్గారావు చెప్పడంతో సతీష్‌ను అతడి ముందుకు తీసుకొచ్చారు. దుర్గారావు చెప్తేనే తాను రాయి విసిరానని సతీష్ చెప్పాడు. దీనిపై అతడు పోలీసుల సమక్షంలోనే అభ్యంతరం వ్యక్తం చేశాడు. తన పేరును చెప్పిన సతీష్.. చివర్లో పరిస్థితిని అర్థం చేసుకోవాలని చెప్పి ముఖం తిప్పేసుకున్నాడని దుర్గారావు చెబుతున్నాడు. పోలీసులు తనను రెండు రోజులు కొట్టారని, సతీష్, తాను ఒకే కాలనీకి చెందిన వాళ్లమే అయినా తమ మధ్య ఎలాంటి పరిచయం లేదంటున్నాడు. తమ ఇద్దరి మధ్య ఉన్నది ముఖ పరిచయం మాత్రమేనంటున్నాడు. సీసీఎస్‌లో విచారించిన తర్వాత తనను మైలవరంలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లారని, అక్కడి నుంచి శనివారం సాయంత్రం తీసుకొచ్చి ఇంటికి పంపారని దుర్గారావు వెల్లడించాడు.

సీఆర్పీసీ 164పై నేడు విచారణ

సీఆర్పీసీలోని 164 ప్రకారం ప్రధాన నిందితుడు సతీష్‌కుమార్ వాంగ్మూలం ఇప్పించాలని పోలీసులు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ జరగనుంది. ఇప్పటికే సతీష్‌కుమార్.. 161 ప్రకారం వాంగ్మూలం ఇచ్చాడు. ఇది న్యాయస్థానంలో ఉంది. ఒకవేళ 164 ప్రకారం వాంగ్మూలం నమోదు చేయడానికి న్యాయాధికారి అంగీకరిస్తే, సతీష్‌కుమార్ నోటి నుంచి వచ్చే మాటలు ఎలా ఉంటాయన్న చర్చ నడుస్తోంది. ఇంటికి చేరుకున్న దుర్గారావు తన పేరును సతీష్‌తో పోలీసులు బలవంతంగా చెప్పిస్తున్నారని ఆరోపిస్తున్నాడు. ఈ ఘటనతో దుర్గారావుకు సంబంధించిన లింకులు దొరక్కపోవడంతో ఇంటికి పంపినట్టు తెలుస్తోంది. ఎప్పుడైనా విచారణ పేరుతో దుర్గారావును తీసుకెళ్లే సూచనలున్నాయి. దీనికి అనుగుణంగా పోలీసులు రికార్డును సిద్ధం చేసుకున్నారు. ముందే దుర్గారావుతో పాటు అతడి తల్లిదండ్రులతో సంతకాలు తీసుకున్నారు.



చంద్రబాబు నుంచి బీ-ఫారాలు అందుకున్న ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అభ్యర్థులు కొలికపూడి శ్రీనివాస్, బొండా ఉమా, కేశినేని చిన్ని, శ్రీరాం తాతయ్య, తంగిరాల సౌమ్య

బీ రెడీ

* బీ-ఫారాలు అందుకున్న టీడీపీ అభ్యర్థులు
* ఆశీర్వదించి పంపిన అధినేత చంద్రబాబు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో పోటీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు అధినేత చంద్రబాబు ఆదివారం బీ-ఫారాలను అందజేశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో జరిగిన కార్యక్రమంలో కృష్ణాజిల్లా నుంచి టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కొల్లు రవీంద్ర, యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, బోడె ప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా బీ-ఫారాలు అందుకున్నారు. ఇక ఎన్టీఆర్ జిల్లా నుంచి పోటీ చేస్తున్న విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్నితో పాటు అసెంబ్లీ అభ్యర్థులు వసంత కృష్ణప్రసాద్, శ్రీరాం తాతయ్య, కొలికపూడి శ్రీనివాస్, గద్దె రామ్మోహన్, బొండా ఉమా, తంగిరాల సౌమ్యకు బీ-ఫారాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ చంద్రబాబు నుంచి బీ-ఫారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ 20 రోజులూ ఎలా పనిచేయాలో చంద్రబాబు దిశానిర్దేశం చేశారని, ఎన్నికల యుద్ధంలో గెలుపు కోసం పోరాడతామన్నారు. గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము మాట్లాడుతూ ఈసారి గుడివాడలో టీడీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. తాను నామినేషన్ వేయాలని అనుకున్న రోజే వైసీపీ అభ్యర్థి కొడాలి నాని నామినేషన్ వేస్తానంటూ పట్టుబడుతున్నారని, వారి కవ్వింపు చర్యల కారణంగా ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో తాను వేరే రోజు నామినేషన్ వేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. నాని తలకాయ లేని వ్యక్తి అని మండిపడ్డారు. మైలవరం అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గం కోసం నిధులు ఇవ్వాలని ఎన్నిసార్లు అడిగినా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ఐదేళ్ల వైసీపీ వైఫల్యాలే ప్రధాన అజెండాగా ప్రచారానికి వెళ్తున్నానన్నారు. నియోజకవర్గంలో అందరినీ కలుపుకొని వెళ్తానన్నారు. తన నామినేషన్‌కు మాజీ మంత్రి దేవినేని ఉమాను ఆహ్వానిస్తానని చెప్పారు.



ఆరెంజ్ అలర్ట్

* జిల్లాలో ఏడు మండలాలకు హెచ్చరిక
* చందర్లపాడులో అత్యధికంగా 44.3 డిగ్రీలు
* మరో నాలుగు రోజులు భారీగా వడగాల్పులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. రెండు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. అన్ని ప్రాంతాల్లోనూ వడగాల్పులు వీస్తున్నాయి. జిల్లాలో ఏడు మండలాల్లో వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత చందర్లపాడు మండలంలో నమోదైంది. ఇక్కడ ఆదివారం 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తర్వాత నందిగామలో 44.1 డిగ్రీలు, జి.కొండూరులో 42.8, ఇబ్రహీంపట్నంలో 43.2, కంచికచర్లలో 43.9, విజయవాడ అర్బన్‌లో 42.6, విజయవాడ రూరల్‌లో 42.6 ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే నాలుగు రోజుల్లోనూ ఉష్ణోగ్రతలు ఇలాగే ఉంటాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక కృష్ణాజిల్లాలోని మచిలీపట్నంలో ఆదివారం 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సోమ, మంగళవారాల్లో భారీ ఉష్ణోగ్రతలు, వడగాల్పులు వీచే అవకాశముందని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు.

కలుషిత నీటి కలకలం..!



మంచినీటిలో పురుగులు

వన్‌టౌన్‌లో పలువురు మహిళలకు అస్వస్థత

* పురుగులతో కూడిన నీరు సరఫరా
* శ్రీరామనవమి పానకం వల్లేనంటున్న అధికారులు

చిట్టినగర్, ఏప్రిల్ 21 : కొత్తపేట శ్రీనివాసమహల్ సెంటర్ కొండ ప్రాంతంలోని రాజగిరివారి వీధి, రాయన చిట్టిబాబు వీధిలో కలుషిత మంచినీరు కలకలం రేపింది. రెండు, మూడు రోజులుగా మంచి నీరు రంగుమారి రావడంతో పాటు చిన్నచిన్న పురుగులు వస్తున్నాయని స్థానిక మహిళలు చెబుతున్నారు. ఇప్పటికే ఐదారుగురు మహిళలు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొంత మంది ఇంటి వద్దే వాంతులు చేసుకుంటూ అనారోగ్యం పాలవుతున్నారు. రిజర్వాయర్లు శుభ్రం చేయకపోవడం వల్లే మూడు రోజులుగా మంచినీరు మురికిగా రావడంతో పాటు బిందెల్లో పట్టిన నీటిలో చిన్న వానపాముల్లాంటి పురుగులు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. వాటర్ లీకులకు మరమ్మతులు అసంపూర్తిగా చేయడం వల్లే నీరు కలుషితమై ఉంటుందంటున్నారు. డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయేమోనని భయపడుతున్నారు. అధికారులు మాత్రం శ్రీరామ నవమి పానకం తాగడం వల్లే స్థానికులకు అజీర్తి చేసి, వాంతులు, విరేచనాలు అవుతున్నాయని చెబుతూ దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. ఫిర్యాదులు చేస్తే వీఎంసీ అధికారులు తూతూమంత్రంగా పరీక్షలు చేసి వెళ్తున్నారని, సమస్య పరిష్కరించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

పానకం వల్లే అయ్యి ఉండొచ్చు : వాటర్ సప్లయ్ డీఈ

ఈ ఘటనపై వాటర్ సప్లయ్ డీఈ రజాక్‌ను వివరణ కోరగా, ఆయా ప్రాంతాల్లో నీటి పరీక్షలు నిర్వహించామన్నారు. నీటి సరఫరా బాగానే ఉందని, ఒకటి రెండు బిందెల్లో రంగుమారి ఉండవచ్చన్నారు. ప్రమాదమేమీ లేదని, బాధిత కుటుంబంతో మాట్లాడామని చెప్పారు. శ్రీరామ నవమి పానకం అధికంగా తీసుకోవడం వల్లే ఇలా అస్వస్థతకు గురై ఉండొచ్చన్నారు.



నగరంలో యూపీఎస్సీ పరీక్ష

యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) పరీక్షలు ఆదివారం నగరంలో సజావుగా జరిగాయి. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్‌కు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,872 మంది అభ్యర్థులకు ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కలెక్టర్ దిల్లీరావు ఎస్ఆర్ఆర్ కళాశాల, బిషప్ అజరయ్య జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కాగా, పరీక్షకు పది నిమిషాలు ఆలస్యంగా రావడంతో నగరంలోని స్టెల్లా కాలేజీ వద్ద బయటే ఉండిపోయిన విద్యార్థులు వీరు.



చేతులు కలిపి చిరునవ్వులు చిందిస్తున్న దేవినేని ఉమా, వసంత

చేతులు కలిపారు..

దేవినేని ఉమాను కలిసిన ఎమ్మెల్యే వసంత

* 22న నామినేషన్ ర్యాలీకి రావాలని ఆహ్వానం
* సానుకూలంగా స్పందించిన మాజీమంత్రి
* తప్పక వస్తానని హామీ.. కేడర్‌కు పిలుపు
* మైలవరం టీడీపీలో నయా జోష్

గొల్లపూడి, ఏప్రిల్ 21 : మైలవరం టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చేతులు కలిపారు. నిన్నటివరకు వేర్వేరు పార్టీల్లో ఉన్న వీరిద్దరూ నేడు ఒకతాటిపైకి వచ్చారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సిటింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వల్లే తనకు సీటు రాలేదని దేవినేని ఉమా ఇన్నాళ్లూ దూరంగా ఉంటూ వచ్చారు. సరైన సమయంలో ఉమాను కలుస్తానని పలు వేదికల్లో చెప్పిన వసంత ఆదివారం తన మాట నిలబెట్టుకున్నారు. తనను కలవడానికి వచ్చిన వసంతను ఉమా సాదరంగా స్వాగతించారు. ఉమా మెడలో టీడీపీ కండువా వేసిన వసంత తన నామినేషన్‌కు రావాలని ఆహ్వానించారు. ఇద్దరూ చేతులు కలిపి చిరునవ్వులు చిందించడంతో మైలవరం టీడీపీలో జోష్ కనిపించింది. ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ మైలవరంలో టీడీపీ గెలుపునకు కృషి చేస్తానన్నారు. తామిద్దరి మధ్య రాజకీయ వైరం తప్ప, వ్యక్తిగతంగా ఏమీ లేదన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ టీడీపీ జెండా ఎగురవేయాలని కేడర్‌కు పిలుపునిచ్చారు. గతంలో తన కోసం కోమటి సుధాకర్ సీటు త్యాగం చేశారని, ఇప్పుడు వసంత కోసం తాను సీటు త్యాగం చేశానన్నారు. ఈనెల 22 ఉదయం 8.30 గంటలకు ఇబ్రహీంపట్నం రింగ్ నుంచి ప్రారంభమయ్యే వసంత నామినేషన్ ర్యాలీలో తాను పాల్గొంటున్నానని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేడర్‌కు పిలుపునిచ్చారు. తన నామినేషన్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కోరారు.


బిషప్ అజరయ్య జూనియర్ కాలేజీలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఢిల్లీరావు

యూపీఎస్సీ పరీక్షలు ప్రశాంతం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) పరీక్షలు ఆదివారం విజయవాడలో ప్రశాంతంగా జరిగాయి. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్‌లకు సంబంధించి పరీక్షలను నిర్వహించారు. మొత్తం 1872 మంది అభ్యర్థులకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం విజయవాడలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ) నేవల్ అకాడమీ (ఎన్ఏ) పరీక్షలకు సంబంధించి మొత్తం 1127 మంది అభ్యర్థులకు గాను సెషన్-1కు 751 మంది (66.64%), సెషన్-2కు 725 మంది (64.33%) హాజరయ్యారు. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్)కు సంబంధించి 745 మంది అభ్యర్థులకు గాను సెషన్-1కు 263 (35.30%) మంది, సెషన్-2 కు 264 (35.44%) మంది హాజరయ్యారు. కలెక్టర్ ఢిల్లీరావు నగరంలో ఎస్ఆర్ఆర్ కళాశాల, బిషప్ అజరయ్య జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు.


ప్రకాశం బ్యారేజీ వద్ద చెక్‌పోస్టును పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

చెక్ పోస్టుల వద్ద పటిష్ట నిఘా

▸▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్, ఏప్రిల్ 21 : ఎన్నికల సందర్భంగా చెక్ పోస్టుల వద్ద 24 గంటలు పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఆదివారం ప్రకాశం బ్యారేజీపై చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేసి పరిస్థితిని సమీక్షించారు. వాహనాలు, అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేశారు. సిబ్బందికి విధి విధానాలపై సూచనలు చేశారు. వేసవి దృష్ట్యా మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లా సరిహద్దులు, గరికపాడు, జొన్నలగడ్డ, ముత్యాల, గంఢ్రాయి, గంగినేని పాలెంల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలు నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అధిక మొత్తంలో నగదు, మద్యం, మత్తు పదార్థాలు, విలువైన వస్తువుల అక్రమ రవాణాపై నిఘా పెట్టినట్టు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలీసు ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)తో పాటు కేంద్ర బలగాలను మోహరించినట్టు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పకడ్బందీగా పనిచేస్తున్నదన్నారు. ఇప్పటివరకు రూ 3.25 కోట్ల నగదు, రూ. 30.67 లక్షల విలువైన 5999 లీటర్ల మద్యం, రూ 7.35 లక్షల విలువైన మత్తు పదార్థాలు, రూ 2.32 కోట్ల విలువైన దాదాపు 8 కిలోల లోహాలు సహా మొత్తం రూ. 6.53 కోట్ల విలువైన సీజర్లు ఉన్నట్టు తెలిపారు.

సీ-విజిల్‌లో 634 ఫిర్యాదుల పరిష్కారం

ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నిక ప్రవర్తనా నియామవళి అమలులోకి వచ్చినప్పటినుంచి ఈనెల 20 వతేదీ వరకు సీవిజిల్ ద్వారా వచ్చిన 634 ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు తెలిపారు. ఈమేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ ద్వారా వచ్చిన 1635 ఫిర్యాదులలో 1609 ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ పూర్తయిందన్నారు. ఓటరు హెల్ప్‌లైన్ (1950) ద్వారా వచ్చిన 288 పిర్యాదులు, ఎన్‌జీఎస్‌పీ ద్వారా వచ్చిన 499 ఫిర్యాదులలో 491 ఫిర్యాదులు, వాట్స్ యాప్ (9154970454) ద్వారా వచ్చిన 34, కాల్ సెంటర్ (0866 2570051) ద్వారా వచ్చిన 24 ఫిర్యాదులు, కంప్లైంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (సీఎంఎస్) ద్వారా వచ్చిన 66 ఫిర్యాదులలో 58, సీఈవో మెయిల్స్ ద్వారా వచ్చిన 14 ఫిర్యాదులలో 11 పిర్యాదులు, మీడియా మానిటరింగ్‌లో జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో వచ్చిన 72 అంశాలకు సంబంధించి 69 అంశాలను పరిష్కరించినట్టు తెలిపారు. ప్రతి ఫిర్యాదుపై కూడా ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన పరిష్కారం చేసినట్టు తెలిపారు. సీ విజిల్ ద్వారా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే తిరువూరు 67, విజయవాడ వెస్ట్ 14, విజయవాడ సెంట్రల్ 89, విజయవాడ తూర్పు నుంచి 101, మైలవరం నుంచి 22, నందిగామ నుంచి 180, జగ్గయ్యపేట నుంచి 157, పోలింగ్ స్టేషన్ల నుంచి 4 మేరకు ఫిర్యాదులు వచ్చాయి.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : మండలి

అవనిగడ్డ, ఏప్రిల్ 21 : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని అవనిగడ్డ జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఆదివారం అవనిగడ్డలోని సేవాశ్రమంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గడిచిన ఐదేళ్లుగా పోరాటం చేసిన సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తానని అన్నారు. దివి కరకట్టను పటిష్ఠ పర్చటం, కోతకు గురవుతున్న ఎడ్లంక, ఎదురుమొండి గ్రామాల రక్షణకు చర్యలు, ఆక్విడెక్ట్ పరిరక్షణ, నిలిచిపోయిన పర్యాటక ప్రాజెక్టులు పూర్తి చేయటం, నాగాయలంకలో జలక్రీడల కేంద్రాన్ని ప్రారంభించటం, శ్రీకాకుళం, మొవ్వ, ఘంటసాల, మోపిదేవి, పెదకళ్లేపల్లి, హంసలదీవి, గణపేశ్వరం, సంగమేశ్వరంలలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయటం, ఏటిమొగ - ఎదురుమొండి మధ్య వారధి నిర్మాణం, పాత ఎడ్లంకకు వంతెన నిర్మాణం, ఆక్వా కల్చర్ అభివృద్ధి తదితర కార్యక్రమాలను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రారంభించి పూర్తిచేసేందుకు కృషిచేస్తానని బుద్ధప్రసాద్ తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా బాలశౌరిని, ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి చేస్తామని బుద్ధప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేతలు మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుట్టాతో యార్లగడ్డ భేటీ

హనుమాన్ జంక్షన్ రూరల్, ఏప్రిల్ 21 : వైసీపీ నేత దుట్టా రామచంద్రరావును గన్నవరం నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు కలవటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదివారం హనుమాన్‌జంక్షన్‌లోని దుట్టా నివాసానికి యార్లగడ్డ వెళ్లారు. ఈ నెల 25 నామినేషన్ వేస్తున్న సందర్భంగా తనకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. సీఎం జగన్ గన్నవరం బస్సు యాత్ర సందర్భంగా దుట్టా ఆయన్ను కలిశారు. వంశీకి సపోర్టు చేయాల్సిందిగా దుట్టాను జగన్ సూచించటం జరిగింది. ఆ తర్వాత దుట్టా వంశీ ప్రచార కార్యక్రమాలకు దూరంగానే ఉంటూ వస్తున్నారు. ఈక్రమంలో యార్లగడ్డ వెంకట్రావు దుట్టాతో ఆంతరంగికంగా భేటీ కావటం చర్చనీయాంశమైంది.

నాగాయలంకలో జన చైతన్య యాత్ర

నాగాయలంక, ఏప్రిల్ 21 :: ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ఓట్ల కోసం వచ్చే రాజకీయ పార్టీల నేతలను ప్రజలు ప్రశ్నించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర నేతలు కోరారు. నెల్లూరు జిల్లా నుంచి చేపట్టిన జన చైతన్య బస్సు



యాత్ర ఆదివారం నాగాయలంకకు చేరింది. ప్రధాన సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వీరాంజనేయులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ హామీలను మోదీ విస్మరించారన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి కొండా దుర్గారావు మాట్లాడుతూ తీర ప్రాంత భూములకు సాగునీరు అందించటంలో పాలకుల విఫలమయ్యారన్నారు. కరీంబాషా, మల్హార్, బాలు విప్లవ గేయాలు అలరించాయి. బి.రమేష్, నాగేంద్రరావు, అంజిబాబు, డి.సురేష్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.


గుడివాడలో వెనిగండ్ల సమక్షంలో టీడీపీలో చేరిన బిళ్లపాడు వైసీపీ కార్యకర్తలు


మైలవరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

వైసీపీ ఖాళీ అవుతోంది..

టీడీపీ కూటమిలోకి భారీగా చేరికలు

ఎన్నికలకు ముందే వైసీపీ ఖాళీ అవుతోంది.. సీఎం జగన్ అవినీతి, నియంత పోకడలతో విసుగు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ కూటమిలోకి భారీగా తరలి వస్తున్నారు. వైసీపీలో తగిన గుర్తింపు లేక, అధికార పార్టీ నేతల అరాచకాలు తాళలేక.. యువత సహా.. అన్ని వర్గాల ప్రజలు టీడీపీ, జనసేన పార్టీలోకి వలసలు వస్తున్నారు. రోజురోజుకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలో కూటమి అభ్యర్థుల సమక్షంలో పార్టీలో చేరుతున్నారు.



చిన్న నందిగామ వైసీపీ ఖాళీ

ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, ఏప్రిల్ 21 : ఇబ్రహీంపట్నం ఫెర్రీ డౌన్‌కి చెందిన నడకుదిటి ఈశ్వరవర్మ ఆధ్వర్యంలో సురేశ్, శ్రీనివాస్, మాధవవర్మ, కన్నా వెంకటేశ్వరరావు, రేచర్ల అశోక్, వడుగు రాంబాబు, పి.బాలు, మద్దుల వెంకటేశ్వర్లు, మాడావత్ బద్రితో పాటు ఇసుక రేవు మత్స్యకారులు, పుష్కరకాలనీ వాసులతో పాటు మరి కొంతమంది, జాకీర్‌హుస్సేన్ కాలేజీ రోడ్డుకు చెందిన వైష్ణవి, బుజ్జి, షేక్ మహబూబ్ సుభాని, పల్లపు వెంకటేశ్వర్లు, డి.వాసు, శివలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

జి.కొండూరు మండలం చిన్ననందిగామ గ్రామం నుంచి మైలవరం ఏఎంసీ మాజీ చైర్మన్ ధనేకుల సాంబశివరావు (బుల్లిబాబు), మాజీ సర్పంచ్ ఉప్పు నాగమల్లేశ్వరరావుల ఆధ్వర్యంలో ఉప్పు సతీష్, నలజాల సుబ్బారావు, వెంకట్రావ్‌తో పాటు మరో 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారందరికీ వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, రాష్ట్ర నాయకులు జంపాల సీతారామయ్య, చెన్నుబోయిన చిట్టిబాబు, పీతా శ్రీనివాసరాజు, మైలా సైదులు, మన్నం వెంకట్రావ్, ధనేకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్‌కు భరోసా

▸▸ యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం : నమ్మండి.. మీ పిల్లల భవిష్యత్‌కు నాది భరోసా.. బడ్డీ కొట్లు, తోపుడు బండ్లు ఇచ్చి నిరుద్యోగ యువతను అవమానపరిచే తత్వం నాది కాదు. చదువుకు తగిన ఉద్యోగం ఇప్పించటమే తన లక్ష్యమని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఉంగుటూరు మండలం ఇందుపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చెరుకుమిల్లి వేణు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు ఉయ్యూరు మురళీ ఆధ్వర్యంలో 30మంది వైసీపీ శ్రేణులు ఆదివారం యార్లగడ్డ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో నడిపిస్తానని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో అధిక శాతం వైసీపీ ఖాళీ అయ్యిందని చెప్పారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వేణు మాట్లాడుతూ, 2019లో జగన్ రాష్ట్రాన్ని ఉద్ధరిస్తాడని వైసీపీకి సపోర్టు చేశామని, ఐదేళ్లు గడచినా చేసిందేమీ లేదన్నారు. అధికారంలోకి రాగానే ప్రజా వేదిక కూల్చటంతోనే రాష్ట్రం నాశనమవుతుందని అర్థమైందన్నారు. వైసీపీ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. వెనిగండ్ల రాము, కాసరనేని రాజా, తెలుగు యువత నేత జాస్తి శేషు తదితరులు పాల్గొన్నారు.

> **జగన్ ఐదేళ్లలో చేసిందేమీ లేదు**
> \- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వేణు
>
> 2019లో జగన్ రాష్ట్రాన్ని ఉద్ధరిస్తాడని వైసీపీకి సపోర్టు చేశాం.. ఐదేళ్లు గడచినా చేసిందేమీ లేదు.. అధికారంలోకి రాగానే ప్రజా వేదిక కూల్చటంతోనే రాష్ట్రం నాశనమవుతుందని అర్థమైంది. వైసీపీ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం.


చనుపల్లివారిగూడెం ప్రజలతో యార్లగడ్డ

కేసరపల్లిలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. గ్రామ శివారు చెంచుల కాలనీ నుంచి అధిక సంఖ్యలో వైసీపీ శ్రేణులు యార్లగడ్డ సమక్షంలో టీడీపీలో చేరారు. రాంబాబు, ప్రసాద్, శివయ్య, గడ్డం అంకమ్మ, ఆంజనేయులు, మహాలక్ష్ముడు, సుబ్బారావు, శ్రీను, రామకృష్ణ, తదితరులు ఉన్నారు. చనుపల్లివారిగూడెం నుంచి 26 మంది వైసీపీకి చెందినవారు టీడీపీలో చేరారు.

భారీ మెజారిటీ సాధిస్తాం : బోడె

పెనమలూరు : వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధిస్తామని టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం కానూరులో జరిగిన పాదయాత్ర సందర్భంగా వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా కార్యకర్తలు చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సైకో పాలనా విధానాల కారణంగా టీడీపీలోకి రాష్ట్ర వ్యాప్తంగా భారీ సంఖ్యలో చేరికలు వస్తున్నాయని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో అంగిరేకుల ఉమామహేశ్వరరావు, ముదిగొండ వీరబాబు, శివశంకర్, సరికొండ సాయికిరణ్, శంకరరావు, పసుమర్తి సోమేశ్వరరావు, కుమార్, రాచమల్లు విజయకిషోర్, కనుమూరి సూర్య ప్రకాష్, జమ్ముల సుబ్బారావు, కావటి నవీన్, కిట్టుబాబు తదితరులు ఉన్నారు.


బోడె ప్రసాద్ సమక్షంలో టీడీపీలోకి చేరికలు

కేశినేని శివనాథ్ సమక్షంలో..

భవానీపురం : 43వ డివిజన్‌లో ఊర్మిళానగర్ రామాలయం సమీపంలో వైసీపీకి చెందిన కాపు నాయకులు పూల కాంతారావు, బీసీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ మాగం ఆత్మారామ్‌లు ఆధ్వర్యంలో 50 మంది కార్యకర్తలు విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పూల సలోమి, ఇతర నేతలు చేరారు.




తెలుగుదేశం, జనసేన పార్టీలో చేరిన చిరంజీవి అభిమానులు

కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్.బేగ్, డివిజన్ అధ్యక్షులు కొనికి కొండయ్య, పూజల శ్రీనివాస్, వల్లభనేని ప్రసన్నలక్ష్మిలు పాల్గొన్నారు.

కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరు

▸▸ వల్లభనేని బాలశౌరి, కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : పేదరికం నిర్మూలన, ప్రజా సంక్షేమంతో పాటు జిల్లాను అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేస్తామని మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అసెంబ్లీ అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం 6వ డివిజన్ చిలకలపూడి, కొబ్బరితోట తదితర ప్రాంతాల్లో బాలశౌరి, రవీంద్ర విస్తృతంగా పర్యటించారు. వారికి అడుగడుగునా టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మత్స్యకారులకు రూ.లక్షా 60వేల విలువ చేసే బోట్లు అందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, వైసీపీ పాలనలో బీసీ, ఎస్సీ, కాపు కార్పొరేషన్ నిర్వీర్యమయ్యాయని, తమ ప్రభుత్వం రాగానే కార్పొరేషన్లు పునరుద్ధరించి పేదలను ఆదుకుంటామన్నారు. చివరి రక్తపుబొట్టు వరకు బందరు అభివృద్ధికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా నేత బండ్రెడ్డి రామకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, గొర్రెపాటి గోపీచంద్, పీవీ ఫణికుమార్, దిలీప్, గంటా సురేష్, గోపు సత్యనారాయణ, మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన పార్టీలోకి చిరంజీవి అభిమానులు

ఆదివారం రాత్రి కొబ్బరితోటలో చిరంజీవి అభిమాన సంఘాలకు చెందిన పలువురు యువకులు టీడీపీ, జనసేనలో చేరారు. కొబ్బరితోట, చిలకలపూడి ప్రాంతాలకు చెందిన చిరంజీవి ఫ్యాన్స్, కాపునాడు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చలమలశెట్టి చిరంజీవి ఆధ్వర్యంలో కొనకళ్ల నవీన్, అబ్దుల్ కలాం, అభిషేక్, సాయి, నవీన్, వందమంది టీడీపీ, జనసేన పార్టీలో చేరారు.

వెనిగండ్ల సమక్షంలో..

గుడివాడ : అధికార వైసీపీ నుంచి వలసల పర్వం కొనసాగింది. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో గుడివాడ మండలం బిళ్లపాడు, రిక్షా కాలనీ, న్యూ మందపాడు కాలనీకి చెందిన 100 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో రావి వెంకటేశ్వరరావు, వాసే మురళీ, కర్రె వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో కృష్ణా ఆదర్శం కావాలి

▸▸ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం టౌన్ , ఏప్రిల్ 21 : కృష్ణాను అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలోనే ఆదర్శజిల్లాగా నిలబెడదామని ఎంపీ, ఉమ్మడి మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. ఆదివారం తనను కలిసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో ఎన్నికల ప్రచార కార్యక్రమంపై సమీక్షించారు. వైసీపీ అరాచక, అప్రజాస్వామ్య విధానాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే సత్తా ఎన్డీఏ కూటమికే ఉందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అమరావతి రాజధానిని సంపదను సృష్టించే కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. పోర్టు ఆధారిత పరిశ్రమలు తెచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగులకు వైసీపీ ప్రభుత్వం ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని పరిస్థితికి కారణం కేవలం ఫైనాన్స్ మేనేజిమెంట్ తెలియక పోవడమే అన్నారు.స్వాతంత్ర్య సమర యోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనాన్ని నిర్మించి తీరుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పీవీ ఫణికుమార్, జనసేన నాయకులు మాదివాడ రాము, కొట్టె వెంకట్రావుతో పాటు మహమ్మద్ బాషా, సుంకర రాజశేఖర్, సంకుల నాని తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, బీసీ, మైనార్టీలపై జగన్‌ది కపట ప్రేమ

తోట్లవల్లూరు: నా ఎస్సీ, బీసీ, మైనార్టీలంటూ వేదికలపై సీఎం గజన్ చెప్పేవన్నీ ఉత్తుత్తి మాటలేనని, చేతల్లో శూన్యమని, తన కార్యాలయాల్లో ఒక్క ఎస్సీ అధికారిని కూడా నియమించకపోవటమే ఇందుకు నిదర్శనమని వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. మండలంలోని పెనమకూరులో ఆదివారం రాత్రి మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో మండల దళిత గర్జన సదస్సు జరిగింది. వేలాదిమంది దళిత విద్యార్థులు కానిస్టేబుల్, ఎస్సై పోస్టుల కోసం ఎదురు చూస్తుంటే

సీఎం జగన్ నిరాశ మిగిల్చారని, అంబేద్కర్ విదేశీ విద్యను రద్దుచేసి తనపేరు పెట్టుకున్న అహంకారి జగన్ అని బాలశౌరీ విమర్శించారు. బటన్ నొక్కుడుతో తాత్కాలిక ప్రయోజనం తప్ప ఏమీ ఉండదని, రాజధాని నిర్మించి పరిశ్రమలు తెస్తే మంచి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఎంపీగా పామర్రు-గుడివాడ రోడ్డులో రెండు రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రజలు ఇబ్బందులు పడకుండా కేంద్రం నుంచి 325 కోట్లు తెచ్చి బిడ్జి నిర్మాణం చేయిస్తున్నానని, 10 కోట్లు ఎస్సీ కాలనీల్లో కమ్యూనిటీ భవనాలకు ఇచ్చానని వివరించారు. వచ్చే ఎన్నికల్లో తనకు గాజుగ్లాసు గుర్తుపైన, వర్ల కుమార్ రాజాకు సైకిల్ గుర్తుపైన ఓట్లువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం పామర్రు ఎమ్మెల్యే అభ్యర్థి వర్ల కుమార్ రాజా ప్రసంగించారు. కార్యక్రమానికి చింతపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా పామర్రు సమన్వయకర్త గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, వీరంకి వెంకట గురుమూర్తి, లుక్కా రేణుకారావు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఎస్ కృష్ణసుమన్, బీజేపీ నాయకుడు పాముల కోటేశ్వరరావు పలువురు నాయకులు పాల్గొన్నారు.


పెనమకూరు దళిత గర్జన సదస్సులో ప్రసంగిస్తున్న వల్లభనేని బాలశౌరి


వెండిరథం, పల్లకిలపై ఊరేగుతున్న గంగా పార్వతీ మల్లేశ్వరులు

దుర్గమ్మకు నెక్లెస్ కానుక

వన్‌టౌన్, ఏప్రిల్ 21 : హైదరాబాద్ సైనిక్‌పురికి చెందిన చింతల రామకుమార్ ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు 33 గ్రాముల నెక్లెస్‌ను కానుకగా అధికారుల ద్వారా అందజేశారు. ఆదివారం ఆయన ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

● బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం గంగా పార్వతి మల్లేశ్వరుల ఉత్సవ మూర్తులను వెండి రథంపై ఊరేగించారు.

24, 25 తేదీల్లో చాగంటి ప్రవచనం

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దుర్గామల్లేశ్వరుల బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 24, 25 తేదీలలో దేవస్థానం ఆధ్వర్యాన తుమ్మలపల్లివారి క్షేత్రయ కళాక్షేత్రంలో ప్రముఖ ప్రవచకుడు చాగంటి కోటేశ్వరరావుతో ఆధ్యాత్మిక ప్రసంగాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈవో రామరావు ఆదివారం తన చాంబర్‌లో సంబంధిత విభాగాల అధికారులతో సమావేశంలో వెల్లడించారు. బుధ, గురువారాల్లో సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య ప్రవచనాలుంటాయన్నారు.


ఉదయభానుతో ధర్నాలో పాల్గొన్న కాకాని పద్మ (ఫైల్)

పెనుగంచిప్రోలు ఐకేపీ అధ్యక్షురాలు విధుల నుంచి తొలగింపు

జగ్గయ్యపేట: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి వైసీపీ అభ్యర్థి సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న పెనుగంచిప్రోలు మండల సమైక్య అధ్యక్షురాలు కాకాని పద్మను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా అధ్యక్షురాలు కె.సీత శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. సీఎం జగన్‌పై గులకరాయిదాడికి నిరసనగా ఈ నెల 14న జాతీయ రహదారిపై ఉదయభాను ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో, విమలాభాను నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు సిమ్మసత్తి వెంకటేశ్వర్లు 18న స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడంతో పైఆదేశాలు ఇచ్చారు. ఉపాధ్యక్షురాలు కె.సౌమ్యకు బాధ్యతలు అప్పగించారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల ఖరారు

భవానీపురం, ఏప్రిల్ 21 : కాంగ్రెస్ పార్టీ విజయవాడ,మచిలీపట్నం ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసింది. విజయవాడ ఎంపీ అభ్యర్థిగా వల్లూరు భార్గవ్, మచిలీపట్నానికి గొల్లి కృష్ణల పేర్లను ఖరారు చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం రాత్రి ఈ జాబితాను విడుదల చేశారు.

చంద్రబాబుకు ఘనస్వాగతం

గన్నవరం : గన్నవరం విమానాశ్రయంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు ఘనస్వాగతం లభించింది. చిత్తూరు నుంచి ప్రత్యేక విమానంలో శనివారం అర్ధరాత్రి ఇక్కడికి విచ్చేయగా యార్లగడ్డ వెంకట్రావు బొకే ఇచ్చి స్వాగతం పలికారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చంద్రబాబు రోడ్డు మార్గాన ఉండవల్లి వెళ్లారు.

మచిలీపట్నం నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే రాష్ట్రంలో అదే పార్టీ అధికారంలోకి రావడం కొన్నేళ్లుగా ఆనవాయితీగా మారింది. బందరు ప్రజలు ఆచితూచి ఏ పార్టీని పక్కన పెట్టాలి, ఏ పార్టీని అందలమెక్కించాలనే అంశంపై తమదైన శైలిలో నిర్ణయం తీసకుంటారనే నానుడి కొనసాగుతోంది. అంతేకాక మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేస్తే ఆ తరువాత జరిగే ఎన్నికల్లో సదరు ఎమ్మెల్యే ఓటమి పాలవడం కూడా అనవాయితీగా మారింది. 1989లో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన పేర్ని కృష్ణమూర్తి సమాచారశాఖ మంత్రిగా పనిచేశారు. అనంతరం 1994లో జరిగిన ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు. 1999లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన నడకుటి నరసింహారావు బీసీ సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. 2004లో జరిగిన ఎన్నికల్లో నడకుదిటి ఓటమి పాలయ్యారు. 2014లో టీడీపీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికైన నడకుదిటి నరసింహారావు అల్లుడు కొల్లు రవీంద్ర కూడా మంత్రిగా పనిచేయగా 2019లో జరిగిన ఎన్నికల్లో కొల్లు ఓటమి పాలయ్యారు. 2019లో వైసీపీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికైన పేర్నినాని సుమారుగా మూడేళ్లపాటు సమాచార, రవాణాశాఖ మంత్రిగా పనిచేశారు. మరి ఇప్పుడు జరిగే ఎన్నికల్లో ఆనవాయితీ ప్రకారం జరుగుతుందా.. కొత్త సంప్రదాయానికి నాంది పలుకుతుందో వేచి చూడాలి..

బందరు లడ్డూ ఆనవాయితీ



కోనేరు సెంటర్

మచిలీపట్నం నియోజకవర్గంలో అదో సెంటిమెంట్... ఇక్కడ గెలిచిన పార్టీకే రాష్ట్రంలో అధికారం

● ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి చేపడితే.. తర్వాత ఎన్నికల్లో ఓటమి ఖాయం ● ఇప్పటికి మూడుసార్లు ఇదే ఆనవాయితీ
1983 నుంచి కొనసాగుతున్న సెంటిమెంట్ ● ప్రస్తుతం జరిగే ఎన్నికల్లోనూ కొనసాగుతుందని బందరులో గుసగుసలు



పేర్ని కృష్ణమూర్తి (కిట్టూ)
పేర్ని వెంకట్రామయ్య (ఇన్‌సెట్)

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లా ముఖ్యకేంద్రంగా ఉన్న మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయం రోజురోజుకు రంగులు మారుతోంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్య పోటీ నువ్వా, నేనా అన్నట్టుంది. ఆయా సామాజికవర్గాల ఓటర్లు ఏ పార్టీ అభ్యర్థిని అందలమెక్కిస్తారో, ఎవరిని ముంచేస్తారో నన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా గెలిచిన నడకుదిటి నరసింహారావు, 2014 ఎమ్మెల్యేలుగా గెలిచిన కొల్లు రవీంద్ర తొలివిడతలోనే మంత్రిపదవులు దక్కించుకుని ఐదేళ్లపాటు పనిచేశారు. వీరిద్దరు మామా అల్లుళ్లు కావడం విశేషం, 19 89లో ఎమ్మెల్యేగా గెలిచిన పేర్ని కృష్ణమూర్తి, 2019లో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన పేర్ని నానీ ఇద్దరూ ఆ యా ప్రభుత్వాల్లో సమాచారశాఖ మంత్రులుగానే పనిచేయడం విశేషం. కొసమెరుపేమిటంటే తండ్రీకొడుకులిద్దరూ ఐదేళ్ల పదవీకాలంలో సగంకాలం మాత్రమే మంత్రులు గా పనిచేయడం. కాపు ఓటర్లు ఎటు మొగ్గి తే ఆ పార్టీనే విజయం వరిస్తుంది. ప్రస్తుత ఎమ్మెల్యే పేర్ని నాని రాజకీయాల నుంచి త ప్పుకుని వారసుడిగా తన కుమారుడు పేర్ని కిట్టును వైసీపీ ఎమెల్యే అభ్యర్థిగా పోటీలో దించారు. ఈసారీ కొల్లు, పేర్ని కుటుంబాల మధ్యే తీ వ్రపోటీ. నియోజకవర్గంలో 1,93,574మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 93,492 మంది, మహిళలు 1,00,070 మంది. ఇతరులు 12 మంది ఉన్నారు.



టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర, నడకుదిటి నరసింహారావు (ఫైల్)

సామాజికవర్గాల వారీగా ఓటర్లు	
కాపు	- 45వేలు
తూర్పు కాపులు	- 2,500
మత్స్యకారులు	- 23వేలు
గౌడ	- 20వేలు
ముస్లింలు	- 23వేలు
ఎస్సీల్లో మాలలు	- 13,300
మాదిగలు	- 6,500
యాదవులు	- 12,400
వైశ్యులు	- 10వేలు
బ్రాహ్మణులు	- 8,200
విశ్వబ్రాహ్మణులు	- 5,800
కమ్మ	- 1000

రజకులు, ముదిరాజులు, పెరికీలు, వెలమలు, నాయీ బ్రాహ్మణులు ఇతరత్రా అన్ని సామాజికవర్గాల వారు కలిపి 1500 నుంచి 3వేల మంది వరకు ఉన్నారు.

మచిలీపట్నం నియోజకవర్గం విజేతలు వీరే :

సం..	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజారిటీ
1952	గుండాబత్తుల ఆంజనేయులు	సీపీఐ	రాళ్లపల్లి అచ్యుతరామయ్య	కాంగ్రెస్	8,879
1955	కొల్లిపర వెంకటరమణయ్య	కాంగ్రెస్	మోదుమూడి శ్రీనివాసరావు	సీపీఐ	11,798
1959	రాళ్లపల్లి అచ్యుతరామయ్య	కాంగ్రెస్	పీఎన్‌రావు	స్వంతంత్ర	6,224
1962	పెదశింగు లక్ష్మణరావు	స్వతంత్ర	రాళ్లపల్లి అచ్యుతరామయ్య	కాంగ్రెస్	470
1967	పెదశింగు లక్ష్మణరావు	కాంగ్రెస్	సన్నాల వేణుగోపాలరావు	స్వతంత్ర	2,886
1972	పెదసింగు లక్షణరావు	కాంగ్రెస్	పేర్ని కృష్ణమూర్తి	స్వతంత్ర	7,819
1978	వడ్డీ రంగారావు	జనతా	చిలంకుర్తి వీరాస్వామి	కాంగ్రెస్	1,902
1983	బొర్రా వెంకటస్వామి	టీడీపీ	పేర్ని కృష్ణమూర్తి	కాంగ్రెస్	25,341
1984	వడ్డీ రంగారావు	టీడీపీ	చిలంకుర్తి వీరాస్వామి	కాంగ్రెస్	13,368
1985	వడ్డీ రంగారావు	టీడీపీ	తిరుమాని మంగతాయారు	కాంగ్రెస్	10,712
1989	పేర్ని కృష్ణమూర్తి	కాంగ్రెస్	నడకుదిటి నరసింహారావు	టీడీపీ	7,819
1994	అంబటి బ్రాహ్మణయ్య	టీడీపీ	పేర్ని కృష్ణమూర్తి	కాంగ్రెస్	16279
1999	నడకుదిటి నరసింహారావు	టీడీపీ	పేర్నినాని	కాంగ్రెస్	15,717
2004	పేర్నినాని	కాంగ్రెస్	నడకుదిటి నరసింహారావు	టీడీపీ	31,301
2009	పేర్నినాని	కాంగ్రెస్	కొల్లు రవీంద్ర	టీడీపీ	11,399
2014	కొల్లు రవీంద్ర	టీడీపీ	పేర్నినాని	వైసీపీ	15,806
2019	పేర్నినాని	వైసీపీ	కొల్లు రవీంద్ర	టీడీపీ	5,932

ఏ సామాజిక వర్గం ఎటువైపు..?

కాపు సామాజిక ఓటర్లు గత నాలుగైదు విడతలుగా పేర్ని కుటుంబానికి వ్యతిరేకంగానే పనిచేస్తూ వచ్చారు. దీంతో పేర్ని కుటుంబం తన సామాజిక వర్గీయులను నమ్ముకుండా ఇతర సామాజికవర్గాల ఓటర్ల మద్దతుతో గెలుస్తూ వచ్చారు. 2009లో పేర్ని నాని కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి 31,301 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అప్పట్లో మచిలీపట్నం మునిసిపల్ చైర్మన్ పదవిని కాపులకు ఇవ్వకుండా ముస్లింలకు ఇచ్చారు. అప్పటి నుంచి కాపు సామాజికవర్గం ఆయనంటే గుర్రుగానే ఉన్నారు. 2019లో త్రిముఖ పోటీ జరిగింది. వైసీపీ అభ్యర్థి పేర్నినానికి 66,141 ఓట్లురాగా, టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్రకు 62,232 ఓట్లు వచ్చాయి. జనసేన అభ్యర్థిగి బండి రామకృష్ణకు 18,807 ఓట్లు వచ్చాయి. పేర్నినాని వ్యతిరేక ఓటు టీడీపీ కాకుండా జనసేనకు మళ్లడంతో ఈ ఎన్నికల్లో పేర్నినాని గెలుపొందారు. ఈసారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి పోటీ చేస్తుండటంతో ఈ ప్రభావం వైసీపీ అభ్యర్థి గెలుపు, ఓటములను శాసిస్తుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు.

కొల్లు రవీంద్ర గెలుపు ధీమా

కొల్లు రవీంద్రకు సౌమ్యుడిగా పేరుంది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక వివిధ కారణాలతో పేర్నినాని ముఖ్య అనుచరు డు మోకా భాస్కరరావు హత్యకు గురయ్యాడు. వైసీపీ నేతల మధ్య నెలకొన్న ఆధిపత్యపోరు కారణంగానే ఈ హత్య జరిగిందనే వాదన లేకపోలేదు. కేసును పక్కదారి పట్టించేందుకు కొల్లు పేరును చేర్చడంతో రవీంద్ర 53 రోజులు జైల్లో ఉన్నారు. దీంతో రవీంద్రకు ప్రజల్లో సానుభూతి పెరిగింది. కూటమి అభ్యర్థిగా ఉండటం, మంత్రిగా చేసిన అనుభవంతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పేర్ని నాని తీరులో మార్పులు

2019లో పేర్నినాని మంత్రి పదవి చేపట్టాక ఆయన వ్యవహారశైలిలో పెనుమార్పులు వచ్చాయి. పార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నేతలు, ప్రజలు ఆయన వద్దకు వస్తే చులకనగా మాట్లాడటం, ఈసడించుకోవడం, విసుక్కోవడం, పట్టీపట్టనట్లుగా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడ్డారు. అంతేకాక తన వారసుడిగా తన కుమారుడిని దించటంతో వైసీపీలోని సీ నియర్ నేతలు, అసంతృప్త కార్యకర్తలు బాహటంగానే వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

పేర్ని కిట్టు అనధికార పెత్తనం

పేర్ని నాని మంత్రిగా పనిచేసిన ఈ ఐదేళ్లలో పెత్తనం ఆయన కుమారుడు పేర్ని కిట్టు తనచేతుల్లోకి తీసుకుని ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకున్నారు. ఏ పదవీ లేకుండానే వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టించడం, దాడులు చేయించడం, ఆర్థిక మూలాలు దెబ్బతీయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. దీంతో ఆయన గెలుపు అవకాశాలు సన్నగిల్లాయని వైసీపీ నేతలే చెబుతున్నారు.



ఫోటో చిత్రం

స్టెప్ అదిరింది..!

జిల్లాలో ఎన్నికల సందడి పూర్తిస్థాయిలో మొదలైంది. వివిధ పార్టీల అభ్యర్థులు మందీ, మార్బలంతో, డోలు, డప్పు విన్యాసాలతో అట్టహాసంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో పాటు ప్రజల్లోకి వెళ్లి ఓట్లు వివి ధ రీతుల్లో ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కొంత మంది కార్యకర్తలు ఉత్సాహంతో వెయ్.. చిందెయ్.. శివమెత్తర సాంబయ్యా అంటూ డ్యాన్సులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సెంట్రల్ నియోకవర్గంలో బొండా ఉమా ప్రచారంలో పార్టీ కార్యకర్తలు డ్యాన్సులు వేస్తూ ఓటర్లను ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.



యథేశ్చగా నిబంధన ఉల్లంఘన

వైసీపీ చిత్రాలు ఎన్నికల అధికారులకు కనపడదా..?

అధికార పార్టీ యథేశ్చగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నా అధికారులకు మాత్రం అవేమీ కనిపించవు. నెలరోజులుగా పట్టణ రహదారుల్లో తిరుగుతున్న మంచినీటి ట్యాంకర్లపై వైసీపీ అభ్యర్థి కొడాలి నాని పేరు స్పష్టంగా కనిపిస్తున్నా మున్సిపల్ అధికారులకు కనిపించడం లేదు. కళ్లెదుటే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నా పట్టించుకోవడం లేదు. పైగా నిబంధనలు ఉల్లంఘించరాదు.. కఠిన చర్యలు తీసుకుంటామంటూ నీతి వాఖ్యాలు వల్లిస్తున్నారు. - గుడివాడ.

దేశోద్ధారకుడు ఈ కాశీనాథుడు

మొగల్రాజపురం, : కాశీనాధుని నాగేశ్వరరావు.. అలియాస్ దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు. ఈయన కృష్ణాజిల్లా ఎలకుర్రు గ్రామంలో 1867 మే 1న జన్మించారు. స్వ గ్రామంలో పాఠశాల విద్య, మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో పట్టభద్రుడయ్యారు. కొద్దికాలం మద్రాసు, కలకత్తా, బొంబాయిలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేశారు. 1893లో అమృతాంజన్ లిమిటెడ్‌ను స్థాపించారు. దానిపై వచ్చిన డబ్బును స్వాతంత్ర్య ఉద్యమానికి, పేద విద్యార్థులకు ఖర్చుచేసేవారు. 1935లో ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ, ఆంధ్రమహా సభ దేశోద్ధారక బిరుదులు అందజేసింది. ప్రస్తుత చెన్నైలో ఆయన నివాసం శ్రీబాగ్‌లోనే చరిత్రాత్మక ఒప్పందం జరిగింది. కోస్తా, రాయలసీమ నేతల మధ్య జరిగిన ఈ ఒడంబడిక వల్ల రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమమైంది. దీన్నే శ్రీబాగ్ ఒడంబడిక అంటారు.



● **పాత్రికేయుడిగా**

1907లో సూరత్‌లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సభలో పాల్గొన్న తరువాత తెలుగు వారికి తెలుగులో వార్తా సమాచారాన్ని అందించాలనే అవసరాన్ని గుర్తించారు. ఆంగ్లేయ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 1908లో బొంబాయి నుంచి ఆంధ్రపత్రిక పేరుతో వారపత్రికను ప్రారంభించారు. 1914 ఏప్రిల్1న అంధ్రపత్రికను దినపత్రికగా, 1924లో భారతి అనే మరో పత్రిక ప్రారంభించారు.

● **ప్రచురణ రంగంలో**

ప్రచురణ రంగం తన కృషిని కొనసాగిస్తూ 1926లో ఆంధ్రగ్రంథమాల అనే సంస్థను ప్రారంభించారు. అనేక ప్రాచీన గ్రంథాలను పునర్ముద్రించారు. తెలుగు నేలపై గ్రంథాలయ ఉద్యమానికి ఆయన పితామహుడిగా చెప్పుకునేవారు.

● **ఉద్యమాల నాగేశ్వరరావు**

మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి అంధ్ర ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా విభజించాలనే ఉద్యమాన్ని మొదట నడిపిన నేతల్లో ఆయనొకరు. ప్రకాశం పంతులు సమకాలీకుడైన ఆయన 1924-34 మధ్య 4సార్లు ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1931లో జైల్లో ఉన్నారు. భగవద్గీత మతపరమైంది కాదని మానవాళికి దాని సందేశం వర్తిస్తుందన్నారు.

● **మహాత్ముడు ఇచ్చిన బిరుదు**

ఆయన దానశీలి. ఇల్లు ఎపుడు అతిథులతోను, సాయం కోరి వచ్చేవారితో నిండి ఉండేది. వివిధ సేవా కార్యక్రమాలకు సాయం చేసేవారు. ఆయన నుంచి సాయం ఆశించిన వారు వట్టి చేతులతో వెళ్లేవారు కాదు. దీనికి అబ్బురపడి మహాత్మాగాంధీ ఆయనకు విశ్వదాత అనే బిరుదుతో కొనియాడారు. తన ప్రచురణ సంస్థ నుంచి అనేక తెలుగు గ్రంథాలను, ఉగాది ప్రత్యేక సంచికలను వెలువరించారు. తెలుగు సాహిత్యానికి, నాటక రంగానికి సేవ చేశారు.

వినపడదా.. వినగడప

● హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం ఎప్పటికి మొదలయ్యేనో..!
● సీఎం హామీ ఇచ్చినా నెరవేరని లక్ష్యం
● సాంకేతిక పనులు పూర్తికాకుండానే శిలాఫలకం



హడావిడిగా వేసిన శిలఫలకం

మీకు వినిపిస్తోందా.. సీఎం జగన్ గారూ.. మా 'వినగడప' ఆక్రందన. గంపల గూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణంపై మీరు హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా పనులు మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. నేటికి కూడా బ్రిడ్జి నిర్మాణం పై హామీ అమలు జరిగే పరిస్థితులు కనిపించడం లేదు. ఇటీవల వైసీపీ నేతలు ఎన్నికల స్టంట్‌లో భాగంగా సాంకేతికపరమైన పనులు పూర్తి కాకుండానే స్టేట్ ప్లాన్ గ్రాంటు రూ.25.60 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరించి బ్రిడ్జి కట్టినట్టేనన్నట్టుగా వ్యవహరించారు. - తిరువూరు



కట్టలేరు, విప్లవవాగు, వెదుళ్ల వాగు, పడమటివాగు, గుర్రపువాగులు.. గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరులో కలుస్తాయి. 2018 ఆగస్టు 28లో సంభవించిన తుఫానుకు వినగడపవద్ద కట్టలేరుపై గతంలో నిర్మించిన బ్రిడ్జి ధ్వంసమైంది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సుమారు రూ.13కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు, టెండర్ల దశలో ఉండగానే 2019 సార్వత్రిక ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం ఏర్పాడవటంతో ఈ బ్రిడ్జి నిర్మాణం అటకెక్కింది. ఈ నేపథ్యంలో గత ఏడాది మార్చి 19న తిరువూరులో విద్యాదీవెన బటన్ నొక్కుడు కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వినగడప బ్రిడ్జి నిర్మాణానికి రూ.25 కోట్లు ప్రకటించారు. అప్పటి నుంచి త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని నాయకులు ప్రకటనలు చేస్తున్నా, సీఎం హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా నిర్మాణ పనుల ప్రతిపాదనలకే నోచుకోలేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వినగడప వద్ద కట్టలేరుపై బ్రిడ్జి కూలడంతో గంపలగూడెం నుంచి విజయవాడ, నూజివీడు, కనుమూరు, అనుములంక, కొత్తపల్లి, తెలంగాణ ప్రాంతానికి చెందిన పుణ్యక్షేత్రమైన జమలాపురంతో పాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం కూలిన బ్రిడ్జి ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు కొద్దిపాటి వరదలకే కొట్టుకుపోవడం, తిరిగి రోడ్డు నిర్మించడం పరిపాటిగా మారుతుంది. ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డుపై రాకపోకలు సాగుతున్నా ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందో అనే భయం వాహనదారుల్లో నెలకొంది.

కూలిన బ్రిడ్జి (ఫైల్‌ఫోటో)



చుక్కలకు తొలగని చిక్కులు

చుక్కల భూములకు చిక్కులు తప్పటం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా సమస్య మాత్రం అక్కడే ఉంది. విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి గ్రామంలో నెలకొన్న భూసమస్య (చుక్కల భూములు) ఎప్పటి పరిష్కారం అవుతుందోనని గ్రామానికి చెందిన నిరుపేదలు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. ముఖ్యమంత్రికి వివరించి మీ భూముల సమస్యను పరిష్కరిస్తామని జిల్లా అధికారులిచ్చిన హామీ సైతం నీరుగారి పోయిందని బాధితులు వాపోతున్నారు.
- తిరువూరు/విస్సన్నపేట

తెల్లదేవరపల్లి గ్రామంలో ఆర్‌ఎస్ నెం. 280 నుంచి 341 వరకు సుమారు 250 ఎకరాల భూమిని 2006లో దివంగత ఉప ముఖ్యమంత్రి డాక్టర్ కోనేరు రంగారావు హయాంలో కొంత భూమిని ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయగా, మరికొంత భూమి పేదలు తరతరాలుగా సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు అశ్రద్ధ, నిర్లక్ష్యంతో 2022లో పేదలు సాగుచేసుకుంటున్న భూముల్ని ఆన్‌లైన్‌లో చుక్కలభూములుగా చూపించారు. రికార్డుపరంగా పేదల భూముల్ని రెడ్‌మార్క్‌గా సూచించడంతో పేదలు సాగుచేసుకునే భూములపై రుణాలు పొందేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రధానంగా గిరిజనులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నేటికీ నెరవెరకపోతే ఇంకేవరికి చెప్పుకోవాలో తెలియని స్దితిలో గిరిజనులు కొట్టుమిట్టాడుతున్నారు. కొందరు లబ్దిదారులు ఈ భూముల్లో ఇల్లు నిర్మించుకున్న మీ భూమి చుక్కలభూమి జాబితాలో ఉందంటూ హౌసింగ్ అధికారలు బిల్లుచెల్లించేందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సన్నచిన్న కారు రైతులు రుణాలు పొందలేక ఇబ్బంది పడుతుంటే కొందరు భూమిని విక్రయించి కుటుంబ అవసరాలు తీర్చుకుందామనుకుంటే అమ్మకాలు జరగటం లేదు. గత ఏడాది తిరువూరులో జరిగిన విద్యాదివేన బటన్ నొక్కేందుకు వచ్చిన సీఎం జగన్ సభను అడ్డుకుంటామని గిరిజనులు ప్రకటించడంతో కలెక్టర్ ఢిల్లీరావు సీఎంతో చర్చించి పరిష్కరిస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఆయన హామీ ఇచ్చి ఏడాది దాటినా తమకు కన్నీటి చుక్కలే మిగిలాయని, సమస్య పరిష్కారం కాలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చినా దొరకని పరిష్కారం



భూసమస్య పరిష్కరించాలని రాస్తారోకో చేస్తున్న గిరిజనులు (ఫైల్‌ఫోటో)

మూడుతరాలుగా సాగుచేస్తున్నాం: ధారావతు భారతి



మూడుతరాలుగా భూమి సాగుచేసుకుంటూ జీవిస్తు న్నాం. ప్రస్తుతం తమ భూముల్ని చుక్కులభూముగా ఎందు కు గుర్తించారో తెలియటం లేదు. అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. భూమి విక్రయించి తమ పిల్లలకు ఉన్నత చదువులు చదివించాలనే ఆశ అడియాశాలు చేశారు.

సాగుకు రుణసాయం అందటం లేదు: ధారావతు ఛత్రియ



1.20 ఎకరాల్లో సాగుచేసుకుంటున్నాం. గతంలో బ్యాంక్ నుంచి ఆర్థిక సహాయం తీసుకునేవాళ్లం. ప్రస్తుతం తమ భూములు చుక్కలభూములుగా చూపడంతో రుణం అందక సాగుచేపట్టలేని పరిస్థితి. భూమి అమ్ముకునేందుకు, అవకాశం లేకుండా పోయింది.

అంబటి బ్రాహ్మణయ్యకు ఘన నివాళి



విద్యాధరపురం, ఏప్రిల్ 21: ఉమ్మడి కృష్ణా జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు అంబటి బ్రాహ్మణయ్య 11వ వర్ధంతి సందర్భంగా ఆదివారం విజయవాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి టీడీపీ శ్రేణులు ఘన నివాళులు సమర్పించాయి. టీడీపీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, పార్టీ కార్యదర్శి కొత్త నాగేంద్రబాబు, గొల్లపూడి నాగేశ్వరరావు, పామర్తి కిషోర్‌బాబు, కోడూరు ఆంజనేయవాసు, బత్తుల దుర్గారావు, అంజనేయులు, చంద్ర కిషోర్, ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.97

వచ్చేది టీడీపీ ప్రభుత్వమే

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న గద్దె అనురాధ

లబ్బీపేట, ఏప్రిల్ 21: సంక్షేమం అనే పునాదులపై నిర్మాణం అయినదే టీడీపీ అని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. ఆదివారం 19వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు చేసిన అభివృద్ధి తప్ప నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, టిడ్కో ఇళ్లను వెంటనే అందిస్తామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ, జనసేన బలపరిచిన తూర్పు అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను, ఎంపీ అభ్యర్థిగా కేశినేని శివనాథ్‌ను అత్యధిక మెజారిటీతో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత అందించే సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.

గుణదల: తూర్పులో ఎన్నికల ప్రచారంలో భాగంగా గద్దె రాజేష్ స్థానిక 2వ డివిజన్లోని యారంవారి వీధిలో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలు, వాటి లబ్ధి గురించి ఓటర్లకు వివరించారు. కొండ ప్రాంతవాసులకు వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి నీటి సమస్య లేకుండా చేశారని గుర్తు చేశారు. బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థిగా తూర్పు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గద్దెను మూడోసారి గెలిపించుకోవడానికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని అభ్యర్థించారు. దాసరి గాబ్రియేలు, నుగసాని కృష్ణ ప్రసాద్, చిన్నా, ఎలిశల శ్రీనివాస్, సురేష్‌బాబు, గూటాల జేమ్స్, శ్రీహరి, నాళం నరేంద్ర, నాగేషు, కొండలరావు, పి.రత్నశ్రీ, దుర్గాప్రసాద్, ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన సీతారాముల కల్యాణోత్సవాలు



అన్నప్రసాద వితరణ

సత్యనారాయణపురం, ఏప్రిల్ 21: దేవీనగర్ మూడవలైన్‌లోని శ్రీకోదండ రామాలయంలో సీతారాముల కల్యాణమహోత్సవాలలో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు మూడువేల మంది భక్తులు సీతారాములను దర్శించుకొని పూజలు చేసి, ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షకార్యదర్శులు కే.వీర్రాజు, గంగిశెట్టి సాంబశివరావు, ఉపాధ్యక్షులు కె.సాంబశివరావు , సంయుక్తకార్యదర్శి డి.రామారావు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గవర్నర్‌పేట, ఏప్రిల్ 21: సూర్యారావుపేట నక్కలరోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నక్కల రోడ్డు, చిలుకు దుర్గయ్య వీధి, గోవిందరాజులు నాయుడు వీధి, నరసింహారావు నాయుడు వీధి, కాళేశ్వరరావు రోడ్డు, వెంకటరత్నం వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. **లబ్బీపేట:** స్క్యూ బ్రిడ్జి సెక్షన్, స్క్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 8గంటల నుండి 12గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ తెలిపారు. పకీరు గూడెం, ప్రగతినగర్, శ్రీరాం నగర్, చంద్రమౌళిపురం, ఎంజీ రోడ్ బెంజిసర్కిల్ ప్రాంతం, మైత్రేయ వీధి తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మహాశక్తితో మహిళలకు ఆర్థిక భరోసా

● కేశినేని జానకీ లక్ష్మి



కార్యక్రమంలో కేశినేని జానకీ లక్ష్మి



తండ్రికి విజయం చేకూర్చాలని ప్రచారం చేస్తున్న కేశినేని వెంకట్

పాయకాపురం, ఏప్రిల్ 21 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మహాశక్తితో రాష్ట్రంలోని మహిళలకు ఆర్థిక భరోసా ఉంటుందని కేశినేని జానకీ లక్ష్మి అన్నారు. టీడీపీ సెంట్రల్ ఆధ్వర్యంలో మహిళా ప్రజా చైతన్య యాత్ర ఆదివారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా టీడీపీ సెంట్రల్ మహిళలు కండ్రిక కాలనీ నుంచి ర్యాలీని ప్రారంభించి రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, పైపుల రోడ్డు సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న వివిధ పథకాలతో పాటు మహిళా సంక్షేమం కోసం చేపట్టే మహాశక్తి మేనిఫెస్టోను స్థానికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేశినేని జానకీ లక్ష్మి మాట్లాడుతూ మళ్లీ నారా చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో మహిళల కష్టాలు తీరతాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముందుగా కండ్రిక సాయిబాబు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించిన ఈ కార్యక్రంలో బొండా ఉమా, బొండా సుజాత, పరుచూరి ప్రసాద్, పైడి తులసి, లబ్బా దుర్గ, శ్రావణి, పలగాని శివ, పైడి శ్రీను, లబ్బా వైకుంఠం, సతీష్, దాసరి ఉదయశ్రీ పాల్గొన్నారు.

వన్‌టౌన్: సీఎంగా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఐదేళ్లుగా జగన్ జనాలను మోసం చేయడమే పనిగా పెట్టుకున్నాడని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ కుమారుడు వెంకట్ అన్నారు. ఆదివారం ఆయన 54 వ డివిజన్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కూటమి బలపరచిన అభ్యర్థిగా టీడీపీ నుంచి పోటీ చేస్తున్న తన తండ్రి శివనాథ్ (చిన్ని), పశ్చిమ నియోజకవర్గం నుంచి బీజేపీ నుంచి పోటీ చేస్తున్న సుజనా చౌదరిలకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. జండా సెంటర్ నుంచి ప్రచారం ప్రారంభించి ఆ పరిసర ప్రాంతాల్లో ప్రచారం కొనసాగింది. డివిజన్ పార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కరీముల్లా, సలీం, మహమ్మద్ ఇర్ఫాన్, హుసేన్ జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

అరాచకం కావాలో.. అభివృద్ధి కావాలో నిర్ణయించుకోండి

42,43 డివిజన్లలో ప్రచారంలో సుజనా చౌదరి



ప్రచారంలో సుజనా చౌదరి

విద్యాధరపురం, ఏప్రిల్ 21: ఏపీలో అరాచకం కావాలో, అభివృద్ధి కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని కూటమి బలపరిచిన పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. ఆదివారం ఆయన భవానీపురం 42, 43వ డివిజన్‌లో శివాలయం సెంటర్‌నుంచి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, బీసీ మైనార్టీ నాయకుడు నాగుల్‌మీరా, స్టార్ కాంపైనర్ వంగవీటి రాధా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, సీనియర్ నాయకుడు పైలా సోమినాయుడు, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ముదిరాజు శివాజీ, జనసేన అధ్యక్షుడు తిరుపతి సురేష్ తదితరులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల హామీల కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కూటమిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ● 43 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొనికాని కొండయ్య ఆధ్వర్యంలో సుజనా చౌదరి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో అభివృద్ధిని గురించి వివరించారు. భవానీపురం, లలితానగర్, టెలిఫోన్ కాలనీ, రైతు బజార్, ఊర్మిళానగర్ తదితర వీధుల్లో ప్రచారం సాగింది. మహిళలు హారతులు పట్టారు.

భవానీపురం: పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి, ఎంపీగా కేశినేని శివనాథ్(చిన్ని)లను అఖండ మెజారిటీతో గెలిపించాలని 41వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు షేక్ సుబాని ఓటర్లను అభ్యర్థించారు. 41వ డివిజన్ గాలిబ్ షహీద్ దర్గా ప్రాంతంలో ముస్లిం నివాసిత ప్రాంతాల్లో ఆదివారం ఆయన పశ్చిమ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రిసావుల్లాతో కలిసి సూపర్ సిక్స్ పథకాలపై ఓటర్లను కలిసి వివరించారు. డివిజన్ యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు షేక్ సమద్ భాషా, అఖిల్ పాషా, మోబిన్, సందాని, ఖదీర్, ఆలీ, ఖాదర్ మొహమ్మద్, మైనార్టీ సెల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డివిజన్ కార్యాలయం ప్రారంభం

43వ డివిజన్ ఊర్మిళానగర్‌లో డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొనికి కొండయ్య ఆధ్వర్యంలో పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వై. సుజనా చౌదరి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఏకలవ్యనగర్ మెయిన్‌రోడ్డులో ఎన్డీఏ కూటమి డివిజన్ పార్టీ కార్యాలయాన్ని సుజనా చౌదరి ప్రారంభించారు. కాపు నాయకులు వంగవీటి రాధాకృష్ణ, మైనార్టీ నాయకులు నాగూల్ మీరా, పశ్చిమ తెలుగు యువత అధికార ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

వన్‌టౌన్: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పోతిన వెంకటేశ్వరరావును కొత్తపేటలోని ఆయన నివాసంలో పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరి ఆదివారం మర్యాదపూర్వక భేటీ అయ్యారు. ఇరువురి మధ్య ప్రస్తుత రాజకీయాలపై కొద్దిసేపు చర్చ జరిగింది. ఈ సందర్భంగా సుజనా చౌదరి తనకు సహకరించాలని వెంకటేశ్వరరావును కోరగా, ఆయన సహకారాన్ని అందచేస్తానని అన్నారు.



పంచముఖ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

పటమట, ఏప్రిల్ 21 : స్థానిక ఎలక్ట్రిసిటీ కాలనీ ఎనిమిదో రోడ్డులోని నల్లూరు చక్రధరరావు వీధిలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ధ్యానమందిర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకమైన కృష్ణ శిలతో తయారు చేయించిన పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహానికి తిరుపతిలో హోమాలు చేయించి, మూడు రోజుల యాగక్రతువులు నిర్వహించిన అనంతరం ఆదివారం ఉదయం ఘనంగా నల్లూరి కాశీ దంపతులు, గర్నేని చలపతిరావు, జీవీబీజీ తిలక్ దంపతులు నడికుదిటి నారాయణ దంపతుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. తిరుమల నుంచి వచ్చిన రుత్విక్కులు, వేదాచార్యులు ఆగమశాస్త్ర ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

వెలంపల్లి దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలి

● సెంట్రల్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జైపాల్

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 21 : వెలంపల్లి శ్రీనివాస్ తన స్థాయిని దిగజార్చుకునే వ్యాఖ్యలు మానుకోవాలని సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బెజ్జం జైపాల్ అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బెజ్జం జైపాల్ మాట్లాడుతూ బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధి స్థానంలో ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావు నైంటీ, క్వార్టర్ అంటూ బార్ షాపుల్లో మందుపోసే వాళ్ల భాష మాట్లాడటం అతని దిగజారుడు రాజకీయాలను తేటతెల్లం చేస్తుందన్నారు. గులకరాయి దాడి బాధితుడుగా చెప్పుకుంటున్న వెలంపల్లి ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నాడని, ప్రజలు వైసీపీ నేతల డ్రామాలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఎప్పటికైనా న్యాయం గెలుస్తుంది అనటానికి గులకరాయి దాడి ఓ నిదర్శనమని, వైసీపీ నేతలు ఎన్ని పసలేని ఆరోపణలు చేసినా బొండా ఉమా కడిగిన ముత్యంలా నిరూపితం అవడం రాష్ట్ర ప్రజలందరికి సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

పోక్సో కేసు నమోదు

పాయకాపురం, ఏప్రిల్ 21 : ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న ఓ యువకుడిపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన బాలిక(16) ను శనివారం సాయంత్రం ఓ యువకుడు ప్రేమ పేరుతో బయటకు తీసుకెళ్లాడు. బాలిక ఇంట్లో కనిపించకపోడంతో కుటుంబ సభ్యులు చుట్టు ప్రక్కల ప్రాంతాలు తిరిగి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని, బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. పోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాదాల్లో తలదూరిస్తే కఠిన చర్యలు

● పటమట సీఐ మోహన్ రెడ్డి

గుణదల, ఏప్రిల్ 21: వివాదాల్లో తలదూరిస్తే కఠిన చర్యలు తప్పవని పటమట సీఐ మోహన్ రెడ్డి హెచ్చరించారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీట్, సస్పెక్ట్ షీట్ ఉన్నవారికి స్టేషన్ ఆవరణలో ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రౌడీషీట్, సస్పెక్ట్ షీట్ ఉన్నవారు రాజకీయ నాయకులు ఇచ్చే తాయిలాలకు ఆశపడి వివాదాల్లో తలదూర్చాలని చూస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని ఉద్ఘాటించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల వివాదాల్లో తలదూర్చి కొత్త వివాదాలకు తెరలేపాలని చూస్తే నగర బహిష్కరణ వేటు వేస్తామని హెచ్చరించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేశాం

సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా పికెట్లు ఏర్పాటు చేసి గస్తీని ముమ్మరం చేశామని గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను తెలిపారు. స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చిన ఆయన ఎన్నికల సమయంలో ఓటర్లను భయభ్రాంతులను చేసేందుకు రాజకీయ నాయకుల కనుసన్నల్లో పనిచేసినట్లు తెలిస్తే మాత్రం పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిపేందుకు ప్రభుత్వం, పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బాబూరావు

సానుభూతి కోసం వైసీపీ నేతల తంటాలు

● సీహెచ్ బాబూరావు

పాయకాపురం, ఏప్రిల్ 21 : గులకరాయి దాడిలో గాయపడిన వైసీపీ నేతలు సానుభూతి కోసం తంటాలు పడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. 63వ డివిజన్‌లోని ఉడాకాలనీ, వడ్డెర కాలనీలో ఆదివారం ఆ పార్టీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబూరావు మాట్లాడుతూ ఎన్నికల ఓట్ల కోసం సానుభూతి కోసం వెంపర్లాడుతున్న నేతలను ప్రజలు తిరస్కరించి బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. కె. శ్రీదేవి, రమణారావు, కె. దుర్గారావు, ఝాన్సీ, సాంబిరెడ్డి, వీరు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

పటమట, ఏప్రిల్ 21: విజయవాడ లేడీస్ సర్కిల్-52, విజయవాడ రౌండ్ టేబుల్ 68, సంజీవిని స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో ఏపీఐసీసీ కాలనీలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, బ్లడ్ కల్చర్, ఈసీజీ, కంటి, దంత పరీక్షలతో పాట వాస్క్యులర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. విజయవాడ రౌండ్ టేబుల్ 68 చైర్మన్ విరాత్ సింగ్, విజయవాడ లేడీస్ సర్కిల్ -52 ప్రాజెక్టు కన్వీనర్ శృతి, సంజీవిని స్వచ్ఛంద సేవా సంఘం అధ్యక్షురాలు డి. ప్రసన్న, డాక్టర్లు హర్ష, అమూల్య, లేడీస్ సర్కిల్ చైర్మన్ సునైనా, డాక్టర్ చాగంటి సుబ్బారావు, సునీత, అనిల్‌కుమార్, నిర్వాహకులు శృతి హేమంత్‌లు పాల్గొన్నారు.

ఉచిత యోగాసన శిక్షణ తరగతులు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 21: స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఏపీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత యోగాసన, ప్రాణాయామ, ధ్యాన శిక్షణ, అవగాహన తరగతులు ఆదివారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయం హాలులో గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి ప్రారంభించారు. సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు 9 ఆదివారాల పాటు నిర్వహిస్తారని తెలిపారు. ఆకాశవాణి ఇంజనీర్ టి. నాగేశ్వరరావు , ట్రైనర్ వి. ప్రభాకర్, డిమానిస్ట్రేటర్ సూర్య, సూర్య కుటుంబ ట్రస్టీలు సిహెచ్ నారాయణరావు, జి. ప్రమీల పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసర వస్తువులు పంపిణీ

సత్యనారాయణపురం, ఏప్రిల్ 21: స్థానిక అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం సాయంత్రం వయోవృద్ధా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నయ్య చారిటబుల్‌ట్రస్ట్ సహకారంతో వృద్ధులకు నిత్యావసర వస్తువులు, మందుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరావు సతీమణి బొండా సుజాత మాట్లాడుతూ గత 202 నెలలుగా ప్రతీ నెలా నాణ్యమైన సరుకులను వృద్ధులకు అందచేస్తున్న ట్రస్ట్‌సేవలను అభినందించారు. వయోవృద్ధాచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లాహరికుమార్ మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివన్నారు. వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, నిత్యావసర వస్తువులు అందచేశారు. మేనేజింగ్ ట్రస్టీలు తట్టి అర్జునరావు, పి. లక్ష్మీనరసింహారావు తదితరలుఉ పాల్గొన్నారు.

మహావీర్ జయంతి సందర్భంగా శోభాయాత్ర

వన్‌టౌన్, ఏప్రిల్ 21: భగవాన్ మహావీర్ 2623 జయంతిని పురస్కరించుకుని ఆదివారం సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తి పూజక్ సంఘ్, సంభవనాథ్ రాజేంద్రసూరి జైన్ శ్వేతాంబర ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వన్‌టౌన్‌లో శోభాయాత్రను నిర్వహించారు. మార్వాడీ వీధిలోని ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. వెండి రథంలో మహావీరుని విగ్రహాన్ని, రాజేంద్ర సూరి చిత్రపటాలను ఉంచి ఊరేగించారు. మెయిన్ బజార్, సామారంగం చౌక్, విన్నకోటవారి చౌక్, హిందూ హైస్కూల్, సుబ్బరామయ్య వీధి, ఆర్‌ఆర్ వీధి తదితర ప్రాంతాల్లో ఊరేగింపు సాగింది. సంఘ్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ బోడోతరియా, ఉపాధ్యక్షులు అశోక్ జైన్, జయంతి లాల్ జైన్, కార్యదర్శి పన్నాలాల్ జైన్,భోగిలాల్ జైన్, డుంగర్‌మల్ జైన్,రాహుల్‌జైన్, ప్రవీణ్‌రాంకా, జైన్ శ్వేతాంబర్ ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు రాజీవ్ సోలంకి, నరేంద్రరాథోడ్ రికిబ్ చంద్ జైన్ తదితర బాధ్యులు పాల్గొన్నారు.

వైసీపీకి వీఏఆర్‌కే ప్రసాద్ రాజీనామా

ధర్నాచౌక్, ఏప్రిల్ 21: వైసీపీ వ్యాపార సంస్థగా మారిందని, ఆ పార్టీ విధానాలు నచ్చక ఆ పార్టీకి, బ్రహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు వీఏఆర్‌కే ప్రసాద్ (అమ్మా ప్రసాద్) పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌పై అభిమానంతో 2018లో వైసీపీలో చేరి సోషల్ మీడియా ద్వారా తన సొంత ఖర్చుతో పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానన్నారు. ఇప్పటి వరకు సీఎం జగన్‌ను కలవడమే కాదు కనీసం దూరం నుంచి చూసే అవకాశం తనకు దక్కలేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా పని చేస్తానన్నారు. త్వరలో తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు.

ఓటమి భయంతోనే గులకరాయి డ్రామా

● ఏపీ మాదిగ సంఘాల జేఏసీ చైర్మన్ పేరుపోగు

ధర్నాచౌక్, ఏప్రిల్ 21: ఓటమి భయంతోనే సీఎం జగన్ గులకరాయి డ్రామా ఆడుతున్నారని ఏపీ మాదిగ సంఘాల జేఏసీ చైర్మన్ పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ విమర్శించారు.

గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు ఆడిన డ్రామాలో కోడికత్తి శ్రీను ఐదేళ్ల జైల్లో మగ్గాడని, 2024 ఎన్నికల్లో గులకరాయి డ్రామాలో మైనర్‌ను జైల్లో పెట్టడం జరిగిందని ఆరోపించారు. సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించడం, దళితులకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్‌కు దళితులు ఓట్లెందుకు వేయాల్లో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సంస్కారభారతి ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 21: సంస్కార భారతి ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో ఉగాది వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ హెల్త్ వర్సిటీ మాజీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోగంటి జగన్నాథరావు, రంగస్థల నటుడు చింతలపాటి శూలపాణికి ఉగాది పురస్కారాలు అందజేశారు. అనంతరం డాక్టర్ రామన్ ఫౌండేషన్, శ్రీ సాయిబాబా నాట్యమండలి యువ కళాకారులతో మయసభ, శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్య నాటకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పీవీఎస్ కృష్ణ, పసుమర్తి భాస్కర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

9 ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 22 ఏప్రిల్ 2024

లైబ్రరీ రెస్టారెంట్



ఆజీచమ్ పుస్తకాంచమ్ హోటల్...

మహారాష్ట్రలోని ఓఝర్‌లో... ముంబయి, ఆగ్రా నేషనల్ హైవేలో ఉన్న ఈ హోటల్‌లో...

ఆకలి తీర్చే వేడివేడి ఆహార పదార్థాలే కాదు, విజ్ఞాన దాహాన్ని తీర్చే పుస్తకాలూ సందర్శకుల్ని ఆహ్వానిస్తాయి.

ఆరో క్లాసుతో చదువు ఆపేసినా... అక్షరాన్ని ప్రేమించే భీమ్‌బాయి జోంధాలే ఆలోచనకు ప్రతిబింబం ఇది.

ఆ హోటల్ గురించి, దాని ప్రారంభం వెనుక కథ గురించి డెబ్బై నాలుగేళ్ళ భీమ్‌బాయి చెబుతున్నారిలా...

"నాకు వివాహం జరిగేనాటికి ఆరో తరగతి చదువుతున్నాను. నాకు చిన్నప్పటి నుంచి పరిశీలనాశక్తి ఎక్కువ. పుస్తకాలు చదవడం ఇష్టం. స్కూల్ లైబ్రరీలో పుస్తకాలన్నీ చదివేశాను. కాలేజీకి వెళ్ళాలన్నది నా కోరిక... కానీ హైస్కూల్ దాటలేదు. అత్తవారింట్లో అడుగుపెట్టగానే నా జీవితం పూర్తిగా మారిపోయింది. నా భర్త తాగుబోతు. ఏ పనీ చేయకుండా ఊరకే తిరుగుతూ ఉండేవాడు. దాంతో ఇంటి పనులే కాదు, మాకున్న కొద్దిపాటి పొలం బాధ్యతలు కూడా నా మీద పడ్డాయి. మాకొక అమ్మాయి, తరువాత అబ్బాయి. నాకెలాగూ సరైన చదువులేదు... పొలాన్ని తాకట్టుపెట్టయినా పిల్లల్ని పెద్ద చదువులు చదివించాలనుకున్నాను. కానీ తాగుడుకూ, జూదానికీ నా భర్త ఆ పొలంలో చాలా భాగం అమ్మేశాడు. దాంతో మేము నడిరోడ్డున నిలబడాల్సి వచ్చింది. వేరే వాళ్ళ పొలంలో కొంతకాలం పనిచేశాను. బంధువులెవరూ మా వైపు చూసేవారు కాదు. మా అబ్బాయి న్యూస్ పేపర్లు వేస్తూ... చదువుకు ఫీజులు కట్టుకొనేవాడు. మా ఊళ్ళో మేము గొప్పగా బతకకపోయినా... గౌరవంగానే బతికాం. కానీ రోజురోజుకూ పరిస్థితులు దుర్భరంగా మారడంతో... వేరే చోటికి మారిపోదామని నిర్ణయించుకున్నాం. మిగిలిన కాస్త పొలాన్నీ అమ్మేసి... నాసిక్ నగరానికి వచ్చేశాం.



కొన్నాళ్ళకు మా అబ్బాయి డిగ్రీ పూర్తి చేశాడు. కొందరు స్నేహితులతో మరాఠీ పుస్తకాల ప్రచురణ కంపెనీ పెట్టాడు. నేను చిన్నచిన్న పనులు చేస్తూ ఉండేదాన్ని. దానివల్ల పెద్దగా ఆదాయం వచ్చేది కాదు. నేను, మా అమ్మాయి ఆలోచించి... చిన్న టీస్టాల్ ప్రారంభించాం. "ఆడవాళ్ళు ఇళ్ళలో ఉండాలి. వీధుల్లో టీలు అమ్ముకోడానికా సిటీకి వెళ్ళారు?" అంటూ బంధువులు ఎత్తిపొడిచారు. "మేము కష్టాల్లో ఉన్నప్పుడు మీరు కనీసం పలకరించలేదు. మా బతుకు మేం బతుకుతున్నాం. మీ సలహాలు అవసరం లేదు" అని గట్టిగా చెప్పాను. నా పిల్లలు నాకు అండగా నిలిచారు. కొద్దికొద్దిగా పొదుపుచేసిన డబ్బుతో... మా టీ స్టాల్‌ను టిఫిన్ సెంటర్‌గా మార్చాం. వంటకాలు రుచిగా, శుచిగా ఉండడంతో ఆదరణ పెరిగింది.

తింటున్నదేంటో తెలియనంతగా...

మా హోటల్‌కు వచ్చిన కస్టమర్లు ఏదైనా ఆర్డర్ ఇచ్చాక... అది వచ్చే లోపల వాళ్ళ ఫోన్‌లో నిమగ్నమైపోయేవారు. ఒక్కోసారి ఏం తింటున్నారనేది కూడా వాళ్ళు గమనించనంతగా మమేకం అయిపోయేవారు. అన్ని చోట్లా జరిగేది ఇదే! 'ఇది చాలా చెడ్డ అలవాటు. కనీసం నా హోటల్‌లోనైనా ఈ అలవాటు మార్చడానికి ఏదైనా చెయ్యాలి' అని ఆలోచించాను. ఈలోగా మా అబ్బాయి పబ్లిషింగ్ కంపెనీ మూతపడింది. చాలా పుస్తకాలు మిగిలిపోయాయి. వాటిని కట్టలు కట్టి తెచ్చి, మా హోటల్లో పెట్టాడు. తీరిక సమయాల్లో వాటిని చదువుతూ ఉంటే... ఎంతో హాయిగా అనిపించింది. పుస్తకాలు మనకు మంచి స్నేహితులు, ప్రతి సందర్భంలోనూ మనకు చక్కటి సహచరులు. కానీ జనం ఫోన్లలో కూరుకుపోవడంతో పుస్తకాలు చదివే అలవాటు బాగా తగ్గిపోయింది. దాన్ని మా హోటల్ ద్వారా ప్రోత్సహిస్తే బాగుంటుందనే సలహా నా పిల్లలకు నచ్చింది. హోటల్‌లో ఒక మూల స్టాండ్ ఏర్పాటు చేసి... వాటి మీద పుస్తకాలు పేర్చాం. వాటిని ఉచితంగా చదువుకోవచ్చని కస్టమర్లను ప్రోత్సహించాం. క్రమంగా పుస్తకాల సంఖ్య, వాటిని చదివే వారి సంఖ్య పెరిగింది. ఆర్డర్ చేసిన పదార్థాలు వచ్చేలోగా... పుస్తకంలో రెండో మూడో అధ్యాయాలు చదివేసేవాళ్ళు కూడా ఉన్నారు. ఈ ఏర్పాటును చాలామంది మెచ్చుకున్నారు. ఇది ఆనోటా ఈనోటా విని... పుస్తక ప్రియుల రాక పెరిగింది. రెగ్యులర్ కస్టమర్లు కూడా ఎందరో. వారిలో కొందరు పుస్తకాలను విరాళంగా కూడా ఇస్తూ ఉంటారు.

పాతిక నుంచి అయిదు వేలకు...

ఒక స్థిరమైన బతుకు కోసం ఎంతో పోరాడాను. నా పిల్లలు బాగుండాలనే తపన నన్ను నడిపించింది. నా పిల్లలను చదివించుకోగలిగాను. గత పద్నాలుగు ఏళ్ళలో... మా హోటల్ బాగా అభివృద్ధి చెందింది. పాతికతో మొదలైన పుస్తకాల సంఖ్య అయిదు వేలకు చేరింది. వాటిలో మరాఠీ, హిందీ, ఇంగ్లీష్ పుస్తకాలు ఉన్నాయి. దీనితోపాటు... పుస్తక పఠనం మీద ఆసక్తిని పెంచడానికి మహిళా దినోత్సవం, రిపబ్లిక్ డే లాంటి ప్రత్యేక సందర్భాల్లో... ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేస్తున్నాం. రోగులకు, వారితో వచ్చేవారికి కాలక్షేపం కోసం ఆసుపత్రుల్లో పుస్తకాలను బహుమతులుగా అందజేస్తున్నాం. ఇదంతా మా అబ్బాయి ఆలోచన. మందులు శరీరానికి స్వస్థత కలిగిస్తే... పుస్తకాలు మనసుకు ప్రశాంతత కలిగిస్తాయి. మా హోటల్లో ఎవరైనా పుస్తకాలు చదవడం చూస్తే... ఎంతో సంతోషంగా అనిపిస్తుంది. నేను చేసిన చిన్న ప్రయత్నం విజయవంతమయిందనే సంతృప్తి కలుగుతుంది. నాకు అంతకన్నా ఇంకేం కావాలి?"



బడి వయసులో స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో భాగస్వామ్యం... ఆమెలో సేవా స్ఫూర్తి రగిలించింది. ఆ స్ఫూర్తే నేడు ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలిచి... వారి జీవితానికి భరోసా కల్పిస్తోంది. మహిళలపై వివక్ష, లైంగిక వేధింపులపై మూడు దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న సామాజిక కార్యకర్త, న్యాయవాది... డాక్టర్ సుభాషిణి గుడిమల్ల తన ప్రయాణాన్ని 'నవ్య'తో పంచుకున్నారు.

అండగా నిలుస్తూ... పోరాటం నేర్పుతూ!

"మనం బాగుంటేనే సరిపోదు. మన చుట్టూ ఉన్న సమాజం కూడా బాగుండాలి. అప్పుడే దేశం బాగుంటుంది. ఇది నాకు చిన్న వయసులోనే అర్థమైంది. అందుకు ప్రధాన కారణం... ఐదో తరగతి నుంచే నేను భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పాల్గొనడం. కాలేజీకి వెళ్లాక కూడా ఎన్ఎస్ఎస్‌లో భాగస్వామిని అయ్యాను. 1987లో నాకు 'ప్రెసిడెంట్ గైడ్ అవార్డు' కూడా వచ్చింది. నాటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ నుంచి ఆ అవార్డు అందుకున్నాను. 1995లో ఐదు దేశాలకు వెళ్లాను. భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఇరవై మందిని ఎంపిక చేశారు. అందులో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేనొక్కదాన్నే. విద్యార్థిగా సామాజిక సేవలో భాగస్వామ్యాన్ని గుర్తించి ఈ అంతర్జాతీయ మీట్‌కు ఎంపిక చేశారు. అలాగే కాలేజీ రోజుల్లో ఢిల్లీ రిపబ్లిక్ పరేడ్‌లో జాయింట్ కమాండర్‌గా వ్యవహరించాను. విదేశీ పర్యటన తరువాత ప్రభుత్వం నిర్వహించే అక్షరాస్యత కార్యక్రమాలు, మహిళ ఉద్యమాల్లో పాల్గొన్నాను. రాత్రి పూట వాలంటీర్‌గా బస్తీల్లో చదువు చెప్పాను. పొదుపు, స్వయంసహాయక సంఘాలపై అధిక శ్రద్ధ పెట్టాను. ఎందుకంటే చాలా గ్రూపులు ఏర్పాటవుతాయి కానీ, అనేక కారణాలవల్ల మధ్యలోనే ఆగిపోతాయి. అలాంటి వారికి మార్గదర్శనం చేస్తూ, ప్రభావంతంగా పని చేసేలా ప్రోత్సహించేదాన్ని.

అందుకే 'లా'...

ఇక నా చదువంతా మా సొంతూరు వరంగల్‌లోనే సాగింది. అక్కడి ఎల్‌బీ కాలేజీలో బీకాం చదివాను. కాకతీయ విశ్వవిద్యాలయం (1999)లో ఎల్ఎల్ఎం పూర్తి చేశాను. రెండేళ్ల కిందటే 'లీగల్ ప్రొటెక్షన్ ఆఫ్ గర్ల్ చైల్డ్ ఇన్ ఇండియా' అంశం మీద ఉస్మానియా వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందాను. ఈ మధ్యలో నల్సార్ విశ్వవిద్యాలయంలో 'ఫ్యామిలీ డిస్పూట్స్ రిజల్యూషన్'పై పీజీ డిప్లమో చదివాను. మొదటి నుంచీ సేవా దృక్పథంతో ఉన్నాను కాబట్టి, లా చదివితే చట్టం కూడా తెలుస్తుంది కదా. దాని వల్ల మరింత సమర్థవంతమైన సేవలు ఇవ్వగలుగుతాను. అవసరమైన చోట న్యాయబద్ధంగా పోరాడగలుగుతాను. చాలా వివాదాల్లో అంతిమ నిర్ణయాలు న్యాయ సంబంధ అంశాలతోనే ముడిపడి ఉంటాయి. అందుకే నేను లా చదివాను. మరింత లోతైన అవగాహన కోసం అందులో పీహెచ్‌డీ చేశాను. అంతేకాదు... ఆటల్లో కూడా నేను ముందుండేదాన్ని. కబడ్డీలో జాతీయ స్థాయి క్రీడాకారిణిని. బాస్కెట్‌బాల్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాను. బ్యాడ్మింటన్, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్‌పుట్ పోటీల్లో పాల్గొనేదాన్ని. కూచిపూడి నాట్యం నేర్చుకున్నాను.

జాతీయ భావన...

ఇప్పుడు ప్రధానంగా నేను దృష్టి పెడుతున్న అంశాలేమిటంటే... రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రభుత్వ పథకాల గురించి పౌరులకు చెప్పి, వాటిపై అవగాహన కల్పిస్తున్నాను. ప్రభుత్వానికి... ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తున్నాను. కొన్ని ప్రాంతాలు, సమూహాల్లో మహిళలకు తమ హక్కుల గురించి కనీస మాత్రం తెలియదు. ఒకరికి ఒకరు తోడుగా ఉండాలని, అందరూ కలిస్తేనే సమాజ నిర్మాణం జరుగుతుందని వారికి అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నం నాది. తద్వారా జాతీయ భావన, సద్భావన పెంపొందుతుంది. అదే సమయంలో స్వయం అభివృద్ధి కూడా ముఖ్యం. ఒక కుటుంబం ఆర్థికంగా ఎదగడానికి ఏంచేస్తే బాగుంటుంది? మహిళలపై అత్యాచారాలు, వివక్ష లైంగిక వేధింపులను అరికట్టడానికి ఏమేం చర్యలు తీసుకోవాలి? తదితర కీలక అంశాల పరిష్కారానికి కృషి చేస్తున్నా. నాకు తెలిసిన విజ్ఞానాన్ని నలుగురికీ పంచుతున్నా.

గళం... బలంగా...

ఇప్పటివరకు వరంగల్, హైదరాబాద్, కరీంనగర్, సంగారెడ్డి, రంగారెడ్డి, నల్లగొండ సహా తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో పర్యటించాను. మహిళల పట్ల అసమానతలు, అఘాయిత్యాలు, వివక్షపై పోరాడేందుకు పెద్దఎత్తున రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించాం. వీరైనంతవరకు మహిళలందరూ కలిసికట్టుగా ఉండి, తమ సమస్యలు తామే పరిష్కరించుకొనేలా వారిలో చైతన్యం తీసుకువస్తున్నాను. వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు, స్వయం ఉపాధికి సంబంధించిన వృత్తివిద్యల్లో పలు ఎన్‌జీఓలతో కలిసి శిక్షణ, నైపుణ్య తరగతులు నిర్వహిస్తున్నాం. వీటన్నిటి కోసం ఒక వేదిక ఉండాలనే ఆలోచనతో 'రుద్రమదేవి' పేరిట ఒక స్వచ్ఛంద సంస్థ కూడా నెలకొల్పాను.

> **ట్రాప్ చేసి పట్టేస్తారు...**
>
> నేను డీల్ చేసే కేసుల్లో ఉమెన్ ట్రాఫికింగ్ కూడా ప్రధానమైనది. బడి వయసు పిల్లలను ట్రాప్ చేసి తీసుకువెళ్లిపోతారు. అది ఎలా జరుగుతుందంటే... ఉదాహరణకు పక్కన ఎవరూ లేకుండా బడికి పోయివచ్చేవారు, ఇంట్లో తల్లితండ్రులు పట్టించుకోని అమ్మాయిలను దుండగులు లక్ష్యంగా చేసుకొంటారు. వారి ఇళ్ల పక్కనే భార్యాభర్తల్లా అద్దెకు దిగుతారు. కొంతకాలం ఆ అమ్మాయితో స్నేహం చేస్తారు. కొన్నాళ్లకు భార్య వెళ్లిపోతుంది. తరువాత వీడు అమ్మాయిని తీసుకెళ్లిపోయి వేర్వేరు ప్రాంతాల్లో తిప్పుతాడు. కొన్ని రోజులకు పెళ్లి చేసుకొంటాడు. తరువాత అమ్మేస్తాడు. తల్లితండ్రుల ఫిర్యాదుతో పోలీసులకు దొరికినా ఆ అమ్మాయి వాడిని వదిలి రానంటుంది. అంతలా కంట్రోల్‌లో పెట్టేస్తారు. అలాంటి ఈ మధ్య ఒక పదిహేనేళ్ల అమ్మాయిని కాపాడి తెచ్చారు పోలీసులు. రాత్రి పదకొండు గంటల సమయంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాను. ఎంత చెప్పినా ఆ అమ్మాయి ఇంటికి రానంటుంది. ఆ వయసులో మంచేదో... చెడేదో వాళ్లకేం అర్థం కాదు. చివరకు ఆ అమ్మాయికి నచ్చజెప్పి ఇంటికి పంపించాను. నిందితుడి మీద పోక్సో చట్టం కింద కేసు పెట్టి, జైలుకు పంపించాం. ఇలాంటివి ఒక్క హైదరాబాద్‌లోనే చాలా కేసులు ఉన్నాయి. ఇదంతా ఒక ముఠా ద్వారా జరుగుతుంటుంది. అది పెద్ద చైన్.

న్యాయ సాయం...

అలాగే ఒక న్యాయవాదిగా ఉచిత న్యాయ సాయం (లీగల్ ఎయిడ్) కూడా అందిస్తున్నాను. వేల మందికి ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇచ్చాను. ఇక విడాకులే మార్గం అనుకున్న వెయ్యికి పైగా జంటలను కలపగలిగాను. వరకట్నం సమస్య కావచ్చు, భార్య ఉద్యోగం చేయడం భర్తకు ఇష్టం లేకపోవచ్చు, లేదంటే ఆమె వస్త్రధారణ అతనికి నచ్చకపోవచ్చు, ఆమె పుట్టింటికి పోవడం ఇష్టంలేకపోవచ్చు, ఉద్యోగం చేసే అమ్మాయి ఇంట్లో పని చేయలేదని అత్తమామలు దెప్పి పొడవడం, టైమ్‌కు లేవరని, పనిమనిషి ఉన్నా వీళ్లే పని చేయాలని, పనిమనిషి తప్పు చేసినా వీళ్లనే తిట్టడం... ముఖ్యంగా అసభ్య పదజాలంతో భార్యను దూషించి, మానసిక ఒత్తిడికి గురిచేయడం... ఇలా రకరకాలుగా వేధింపులకు గురవుతున్న మహిళలు నా దగ్గరకు వస్తారు. బాధిత మహిళలకు ధైర్యం చెప్పి, ఇరు కుటుంబాలను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తాను. అవసరమైతే సైకాలజిస్టులు, సైక్రియాటిస్టులను కూడా పిలిపిస్తాను. ఈ సేవలన్నీ ఉచితంగానే అందిస్తున్నాను. నా సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం 'జాతీయ యువ పురస్కారం' అందించింది.

విద్యార్థులకు అవగాహన...

దీంతోపాటు స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి, విద్యార్థులకు లీగల్ కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నాం. వాళ్ల విద్యాసంస్థలకు వెళ్లే దారిలో కానీ, స్నేహాలవల్ల కానీ ఒకవేళ ఊహించని సమస్యలు ఏవైనా ఎదురైతే వాటికి న్యాయపరమైన పరిష్కారాలు తెలియాలనే ఉద్దేశం. తద్వారా ఎలాంటి గొడవలకు పోకుండా సక్రమమైన మార్గంలో నడుచుకొంటారు. చట్టం తెలుసుకొని, కుదురుగా ఉండమని చెప్పే ప్రయత్నం నాది. ఎందుకంటే నేటి విద్యార్థులే భావిభారత నిర్మాతలు కదా. వారిని సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత పెద్దలదే. సుప్రీమ్‌కోర్టు మార్గదర్శకాలను అనుసరించి ఫండమెంటల్ రైట్స్, ఫండమెంటల్ డ్యూటీస్ ఆఫ్ ది సిటిజన్ అన్నది బడి వయసులోనే మొదలుపెట్టాలి. దాని వల్ల వారి భవితవ్యం మెరుగ్గా ఉంటుంది. ఈ దిశగా అవగాహన కల్పించేందుకు పదహారేళ్లగా పాఠశాలలు, కళాశాలల్లో ఏటా 60 నుంచి 70 కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

నలభై వేలమంది...

సామాజిక కార్యక్రమాల నేపథ్యంలో విద్యార్థులు కావచ్చు, మహిళలు, వివిధ వర్గాల సమూహాలు కావచ్చు... ఇప్పటివరకు నేను నలభై వేలమందికి పైగా ప్రజలను కలిశాను. వారందరికీ నాకు సాధ్యమైనంతవరకు సహాయం అందించాను. వీరిలో చాలామంది తమను తాము ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడమే కాకుండా... వేరొకరి సమస్యలు తెలుసుకొనే పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. కనీసం రోజుకు ఒక కేసన్నా నా దగ్గరకు వస్తుంది. మహిళలందరి సమస్యలకు సంబంధించి గతంలో ధర్నాలు, రాస్తారోకోల వంటి పెద్ద పెద్ద కార్యక్రమాలు చేసేవాళ్లం. ఇప్పుడు వ్యక్తిగతంగా వారికి ఎదురయ్యే సమస్యలపై దృష్టి పెట్టాను. అంటే ఒక సమస్య ఎదురైనప్పుడు న్యాయబద్ధంగా ఎలా పోరాడాలనేది నేర్పుతున్నాను.

ఉదాహరణకు ఇటీవల నా దగ్గరకు వచ్చిన ఓ గృహిణి కేసు గురించి చెబుతాను. ఆమెను తన భర్త ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లో నిర్బంధించి, ఎవరితో ఫోన్లో కూడా మాట్లాడనివ్వకుండా వేధించాడు. 'మేమిద్దరం మానసికంగా విడిపోయాం. మా ఇద్దరి మధ్య ఏ సంబంధం లేదు' అని ఆమెతోనే బలవంతంగా లెటర్ రాయించి, వదిలిపెట్టేశాడు. ఆ అమ్మాయి ఎంటెక్ చదివింది. అతడిని ఆమె వద్దనుకున్నా... భయంతో ఇన్నాళ్లూ బయటకు రాలేదు. మన సమాజంలో 70 శాతం మంది మహిళలు ఇలా భయపడుతున్నవారే. ఆ వేధింపులు తట్టుకోలేక, కేసుల గురించి అవగాహన లేక, ఇక నాకు జీవితం లేదనే భావనతో మరణమే శరణ్యమనుకొంటారు. అలాంటి సందర్భాల్లో నాలాంటివారి అండ ఎంతో అవసరం. నేను ఆ అమ్మాయికి కౌన్సెలింగ్ ఇచ్చి, ముందుకు వచ్చి పోరాడే ధైర్యం నింపాను. ఇలా ఎన్నో కేసులు."

● హనుమా

నవ్య | చిత్రజ్యోతి

గురు ద్రోణాచార్య పుత్రుడను..
అశ్వత్థామను



అత్యున్నత సాంకేతిక హంగులతో పాన్ ఇండియా సినిమాగా 'కల్కి 2898 ఏ.డీ' రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. ప్రభాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పీరియాడికల్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఫిల్మ్‌లో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనే, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆదివారం అమితాబ్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ఈ సినిమాలో ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను, క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ వీడియోలో ఒక బాలుడు, అమితాబ్‌ను "నీ పేరేంటి.. నీతో ఏ భాషలో మాట్లాడాలి.. నువ్వు చాలా బాగా ఫైట్స్ చేస్తున్నావ్, ఎవ్వరు నువ్వు" అని ప్రశ్నించగా.. "అంతిమ యుద్ధానికి సమయం ఆసన్నమైంది. నేను కల్కి అవతారం కోసమే ద్వాపర యుగం నుంచి వేచి ఉన్నా.. నేను గురు ద్రోణాచార్యుడి పుత్రుడను.. అశ్వత్థామను" అని అమితాబ్ తన గురించి ఆ బాలుడికి చెప్తారు. ఈ గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచేసింది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

రెండు తరాల ప్రయాణం



అజయ్ ఘోష్, చాందిని చౌదరి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. శివ పాలడుగు దర్శకత్వంలో హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మించారు. చిత్ర బృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. దర్శకుడు అజయ్ భూపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 'రెండు తరాల వ్యక్తులు కలసి ప్రయాణం చేస్తే ఎన్నో మంచి విషయాలు తెలుస్తాయి. అదే ఈ సినిమా చెప్పే పాఠం' అన్నారు. అజయ్ ఘోష్ మాట్లాడుతూ 'కథ విన్నప్పుడు నేను మెయిన్ లీడ్ ఏంటి అనుకున్నాను. సెట్స్ మీదకు వచ్చాక ఈ సినిమా గొప్పదనం తెలిసింది. ఇందులో కథే హీరో' అన్నారు. మధ్యతరగతి కుటుంబాల కథ ఇది. ప్రేక్షకులను నిరాశ పరచదు అని చాందిని చౌదరి తెలిపారు. మంచి సినిమాను ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో బడ్జెట్ పెరిగినా వెనక్కు తగ్గలేదు అని నిర్మాతలు చెప్పారు.

సింగరేణి సైరెన్




ప్రాణాలకు తెగించి సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేస్తున్న కార్మికుల కష్టం వెండితెరపైకి ఎక్కనుంది. 'జార్జిరెడ్డి' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు పొందిన జీవన్ రెడ్డి కథను అందిస్తున్నారు. ధూమ్ర వారాహి బేనర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ ఇనుగుర్తి దర్శకుడు. ఈ చిత్రం టైటిల్‌ను యూనిట్ ఆదివారం వెల్లడించింది. 'సింగరేణి జంగ్ సైరన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 1999లో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా సర్వైవల్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి, త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తామని యూనిట్ తెలిపింది. ఇతర వివరాలను మేడే రోజున వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: సురేశ్ బొబ్బిలి. సినిమాటోగ్రఫీ: రాఖీ వనమాలి.



టాలీవుడ్ హీరో తిరువీర్ ఓ ఇంటివాడయ్యారు. కల్పనారావ్‌తో ఆయన వివాహం ఆదివారం జరిగింది. 'కొత్త జీవితం ప్రారంభం' అంటూ ఈ శుభవార్తను తిరువీర్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించి, తమ పెళ్లి ఫొటోలను షేర్‌చేశారు.

విక్రమ్ చిత్రంలో విలన్‌గా





తమిళ హీరో విక్రమ్ కథానాయకుడిగా ఎస్. యూ అరుణ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వీర ధీర శూరన్'. రియా శిబు నిర్మిస్తున్నారు. హీరోగా విక్రమ్‌కు ఇది 62వ చిత్రం. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. విక్రమ్ పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేసిన టైటిల్ టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా చిత్రబృందం మరో అప్డేట్‌ను వదిలింది. మలయాళ నటుడు సిద్ధిఖీ ఈ చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఆదివారం యూనిట్ తెలిపింది. గతంలో ఆయన 'అంతిమ తీర్పు, అగ్ని నక్షత్రం, నా బంగారు తల్లి' చిత్రాల్లో నటించారు. కాళి అనే కిరాణా షాపు యజమాని పాత్రలో విక్రమ్ కనిపించనున్నారు. ఎస్‌జే సూర్య, దుసరా విజయన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: తేని ఈశ్వర్.

సినీ పురోహితుడు రోహిణి శాస్త్రి కన్నుమూత

- మహేశ్‌బాబుకు నామకరణం చేసింది ఆయనే
- ఎన్టీఆర్ నుంచి ఈతరం హీరోల సినిమాలకు ముహూర్త పూజా కార్యక్రమాల నిర్వహణ

పౌరహిత్యంలో 'శాస్త్రి బ్రదర్స్'గా సుప్రసిద్ధులైన అశ్విని, రోహిణి శాస్త్రుల్లో ఒకరైన రోహిణి శాస్త్రి (70) కన్నుమూశారు. శనివారం ఉదయం నిద్ర లేవకపోవడంతో కుటుంబీకులు ఆయన్ని మేల్కొలిపేందుకు ప్రయత్నించారు. ఆయన అపస్మారక స్థితిలో ఉండడంతో వైద్యులను రప్పించి పరీక్షించగా, అప్పటికే కన్నుమూసినట్లు తేలింది.

సినీరంగంతో ఎనలేని అనుబంధం...

శాస్త్రి బ్రదర్స్ పూర్వీకులది పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు. రోహిణి శాస్త్రి ప్రాథమిక విద్య టి.నగర్‌లోని రామకృష్ణ స్కూలులో జరిగింది. వారి తండ్రి తాండ్ర సుబ్రహ్మణ్య శాస్త్రితో కలిసి ఎంజీఆర్, ఎన్టీఆర్ చిత్రాల నుంచి నేటి మహేష్ బాబు, విజయ్ వంటి అగ్ర కథానాయకుల సినిమాల వరకు ముహూర్తం, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. హీరో మహేష్‌బాబుకు నామకరణం చేసిందీ శాస్త్రి బ్రదర్సే. దివంగత దిగ్గజ దర్శకుడు దాసరి నారాయణరావు తొలి సినిమా 'తాత మనవడు' నుంచి ఆయన 100వ సినిమా 'లంకేశ్వరుడు' వరకు ముహూర్త పూజా కార్యక్రమాలు వారే నిర్వహించడం మరో విశేషం.



శాస్త్రి బ్రదర్స్ పురోహితులుగానే దాదాపు వంద సినిమాల్లో కనిపించారు. రోహిణి శాస్త్రి దాసరి నారాయణరావు రూపొందించిన 'విశ్వామిత్ర' సీరియల్‌లోనూ నటించారు. నేడు టీనగర్ కన్నమ్మపేట శ్మశానవాటికలో రోహిణి శాస్త్రి భౌతికకాయానికి అంత్యక్రియలు జరగనున్నాయి.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

గుకేష్.. మరొక్క గేమ్



'క్యాండిడేట్స్' టైటిల్ దిశగా భారత కుర్రాడు

13వ రౌండ్‌లో విజయం

టొరంటో: భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ గుకేష్ ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీ టైటిల్ దిశగా దూసుకుపోతున్నాడు. ఆదివారం జరిగిన 13వ రౌండ్‌లో 17 ఏళ్ల గుకేష్ ఫ్రాన్స్‌కు చెందిన అలీరెజాను చిత్తు చేశాడు. తద్వారా మొత్తం ఎనిమిది పాయింట్లతో ఒకే ఒక్కడుగా అగ్రస్థానానికి చేరాడు. సోమవారం జరిగే ఆఖరిదైన 14వ రౌండ్‌లో వరల్డ్ నెం.3 హికారు నకామురాను గుకేష్ ఢీకొంటాడు. కరువానాతో గేమ్‌లో ప్రజ్ఞానంద ఓటమిపాలవగా, అబసోవ్‌తో మ్యాచ్‌ను విదిత్ గుజరాతీ డ్రా చేసుకున్నాడు. ఈరౌండ్ తర్వాత నెపోమ్నియాచి, నకామురా, కరువానా తలా ఎనిమిదేసి పాయింట్లతో రెండో స్థానంలో నిలిచారు.ప్రజ్ఞానంద (6), విదిత్ (6) సంయుక్తంగా ఐదో స్థానంలో కొనసాగుతున్నారు. మహిళల్లో..ముజిచుక్‌తో మ్యాచ్‌ను హంపి డ్రాగా ముగించింది. లీ టింగ్జీని ఓడించిన వైశాలీ వరుసగా నాలుగో గేమ్‌లోనూ గెలవడం విశేషం.

పంజాబ్‌కు పంచ్



వరుసగా నాలుగో ఓటమి • 3 వికెట్లతో గుజరాత్ గెలుపు

ముల్లాపూర్: పంజాబ్ కింగ్స్ పరాజయాల పరంపర కొనసాగుతూనే ఉంది. బ్యాటర్లు విఫలమైన చోట బౌలర్లు రాణిస్తూ మ్యాచ్‌ను ఆఖరి ఓవర్ వరకు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. అటు పడుతూ, లేస్తూ సాగుతున్న గుజరాత్ టైటాన్స్ జట్టు తిరిగి గెలుపు బాట పట్టింది. స్పిన్నర్ సాయి కిశోర్ (4/33) అద్భుతంగా రాణించి పంజాబ్ వెన్నువిరిచాడు. దీంతో టైటాన్స్ మూడు వికెట్లతో నెగ్గింది. పంజాబ్‌కిది వరుసగా నాలుగో ఓటమి. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా పంజాబ్ 20 ఓవర్లలో 142 పరుగులకు ఆలౌటైంది. ప్రభ్‌సిమ్రన్ (35), హర్‌ప్రీత్ బ్రార్ (29), కర్రాన్ (20) మాత్రమే రాణించారు. నూర్ అహ్మద్, మోహిత్ శర్మలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 19.1 ఓవర్లలో 7 వికెట్లకు 146 పరుగులు చేసి గెలిచింది. రాహుల్ తెవాటియా (36 నాటౌట్), గిల్ (35), సుదర్శన్ (31) ఆకట్టుకున్నారు. హర్షల్‌కు మూడు, లివింగ్‌స్టోన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సాయి కిశోర్ నిలిచాడు.

బౌలర్ల పోరాటం సరిపోలేదు..: స్వల్ప స్కోరును కాపాడుకునేందుకు పంజాబ్ బౌలర్లు చివరి వరకు పోరాడినా ఫలితం దక్కలేదు. గుజరాత్ ఓపెనర్ సాహా (13) ఆదిలోనే వెనుదిరగ్గా, కెప్టెన్ గిల్, సాయి సుదర్శన్ రెండో వికెట్‌కు 41 పరుగులు జోడించారు. స్వల్ప వ్యవధిలోనే గిల్, మిల్లర్ (4)లతో పాటు సుదర్శన్ వెనుదిరగడంతో టైటాన్స్ ఒత్తిడిలో పడింది. అటు అజ్మతుల్లా (13) కూడా నిరాశపరిచిన వేళ.. తెవాటియా బాధ్యత తీసుకున్నాడు. దీంతో 17, 18వ ఓవర్లలో మొత్తం 33 పరుగులు వచ్చాయి. ఇక 12 బంతుల్లో గెలుపునకు ఐదు పరుగులే కావాల్సి ఉండగా.. టైటాన్స్ నాలుగు రన్స్ చేసి షారుక్ (8), రషీద్ (3) వికెట్లను కోల్పోయింది. అయినా ఆఖరి ఓవర్ తొలి బంతిని ఫోర్‌గా మలిచి తెవాటియా మ్యాచ్‌ను ముగించాడు.

దెబ్బతీసిన సాయి కిశోర్: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ చెలరేగినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. రెండో ఓవర్‌లోనే అతడు 4,4,6,4తో 21 రన్స్ రాబట్టాడు. ఆరో ఓవర్‌లో పేసర్ మోహిత్‌కు చిక్కడంతో తొలి వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత పంజాబ్ వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయింది. జితేశ్ శర్మ (13), అశుతోష్ (3), శశాంక్ (8)లను స్పిన్నర్ సాయి కిశోర్ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చడంతో 99/7 స్కోరుతో జట్టు దయనీయస్థితిలో నిలిచింది. అయితే చివర్లో హర్‌ప్రీత్ బ్రార్ వేగంగా ఆడి జట్టుకు గౌరవప్రదమైన స్కోరందించాడు.

స్కోరుబోర్డు

పంజాబ్: కర్రాన్ (ఎల్బీ) రషీద్ 20, ప్రభ్‌సిమ్రన్ (సి) సాహా (బి) మోహిత్ 35, రొసో (ఎల్బీ) నూర్ 9, జితేశ్ (బి) సాయి కిశోర్ 13, లివింగ్‌స్టోన్ (సి) తెవాటియా (బి) నూర్ 6, శశాంక్ (సి అండ్ బి) కిశోర్ 8, అశుతోష్ (సి) మోహిత్ (బి) సాయి కిశోర్ 3, హర్‌ప్రీత్ సింగ్ (రనౌట్) 14, హర్‌ప్రీత్ బ్రార్ (సి) షారుక్ (బి) సాయి కిశోర్ 29, హర్షల్ (సి) షారుక్ (బి) మోహిత్ 0, రబాడ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 142; వికెట్ల పతనం:** 1-52, 2-63, 3-67, 4-78, 5-86, 6-92, 7-99, 8-139, 9-140, 10-142; **బౌలింగ్:** ఒమర్జాయ్ 2-0-13-0, సందీప్ 1-0-21-0, మోహిత్ శర్మ 4-0-32-2, రషీద్ 4-0-15-1, నూర్ అహ్మద్ 4-0-20-2, సాయి కిశోర్ 4-0-33-4, షారుక్ 1-0-7-0.

గుజరాత్: సాహా (సి) అశుతోష్ (బి) అర్ష్‌దీప్ 13, గిల్ (సి) రబాడ (బి) లివింగ్‌స్టోన్ 35, సాయి సుదర్శన్ (బి) కర్రాన్ 31, మిల్లర్ (బి) లివింగ్‌స్టోన్ 4, ఒమర్జాయ్ (సి) జితేశ్ (బి) హర్షల్ 13, తెవాటియా (నాటౌట్) 36, షారుక్ (బి) హర్షల్ 8, రషీద్ (సి) రొసో (బి) హర్షల్ 3, సాయి కిశోర్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 19.1 ఓవర్లలో 146/7; వికెట్ల పతనం:** 1-25, 2-66, 3-77, 4-97, 5-103, 6-138, 7-142; **బౌలింగ్:** రబాడ 4-0-40-0, అర్ష్‌దీప్ 2.1-0-17-1, హర్షల్ 3-0-15-3, కర్రాన్ 2-0-18-1, బ్రార్ 4-0-35-0, లివింగ్‌స్టోన్ 4-0-19-2.

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.

రాజస్థాన్ X ముంబై

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	7	6	1	0	12	0.677
కోల్‌కతా	7	5	2	0	10	1.206
హైదరాబాద్	7	5	2	0	10	0.914
చెన్నై	7	4	3	0	8	0.529
లఖ్‌నవూ	7	4	3	0	8	0.123
గుజరాత్	8	4	4	0	8	-1.055
ముంబై	7	3	4	0	6	-0.133
ఢిల్లీ	8	3	5	0	6	-0.477
పంజాబ్	8	2	6	0	4	-0.292
బెంగళూరు	8	1	7	0	2	-1.046

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

రేస్‌వాకర్లు అక్షదీప్, ప్రియాంకకు ఒలింపిక్ బెర్త్

రోయింగ్‌లో బాల్‌రాజ్, అనిత, నారాయణలకు కూడా

న్యూఢిల్లీ: భారత రేస్ వాకర్లు అక్షదీప్, ప్రియాంక మిక్స్‌డ్ రిలే టీమ్ ఈవెంట్‌లో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. ఆదివారం టర్కీలోని అంటాల్యాలో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ రేస్ వాకింగ్ టీమ్ చాంపియన్‌షిప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అక్షదీప్-ప్రియాంక జోడీ 18వ స్థానంలో నిలిచింది. దీంతో ఈ జంటకు ఒలింపిక్ బెర్త్ ఖరారైంది. భారత రోయర్ బాల్‌రాజ్ పన్వర్ కూడా పారిస్ క్రీడలకు బెర్త్ దక్కించుకున్నాడు. దక్షిణ కొరియాలోని చుంగ్జూలో జరిగిన ప్రపంచ ఆసియా, ఓసియానియా ఒలింపిక్, పారాలింపిక్ క్వాలిఫికేషన్ రెగెట్టా టోర్నీలో పురుషుల సింగిల్ స్కల్ ఈవెంట్‌లో బాల్‌రాజ్ మూడోస్థానంలో నిలిచి విశ్వక్రీడలకు క్వాలిఫై అయ్యాడు. ఇదే టోర్నీలో భారత పారా రోయర్లు అనిత, నారాయణ సత్తాచాటారు. మిక్స్‌డ్ డబుల్స్ స్కల్ ఈవెంట్ పీఆర్3 మిక్స్2ఎక్స్‌లో విజేతగా నిలవడంతో అనిత- నారాయణ జోడీ పారిస్ పారాలింపిక్స్‌కు అర్హత సాధించారు. జోడీ 18వ స్థానంలో నిలిచి, ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకుంది.

అరెరె.. ఆర్సీబీ!

భారీ ఛేదనలో పరుగు తేడాతో కోల్‌కతా చేతిలో పరాజయం

రాణించిన సాల్ట్, అయ్యర్, రస్సెల్

జాక్స్, పటీదార్, కర్ణ్ పోరాటం వృథా






కోల్‌కతా: ఆఖరి ఓవర్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఆటగాడు కర్ణ్ శర్మ (7 బంతుల్లో 3 సిక్స్‌లతో 20) సిక్స్‌లతో ఆశలు రేపినా.. నరాలు తెగే ఉత్కంఠ మధ్య చివరి బంతికి రనౌట్ చేసి కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) విజయాన్ని దక్కించుకొంది. ఆదివారం నాటకీయ మలుపులు తిరుగుతూ సాగిన మ్యాచ్‌లో కోల్‌కతా ఒక్క పరుగు తేడాతో బెంగళూరుపై గెలిచింది. నైట్ రైడర్స్ నిర్దేశించిన 223 పరుగుల భారీ ఛేదనలో.. ఆఖరి ఓవర్‌లో ఆర్సీబీ గెలుపునకు 21 పరుగులు కావాలి. ఈ దశలో స్టార్క్ బౌలింగ్‌లో శర్మ మూడు సిక్స్‌లతో ఉత్కంఠ రేపాడు. అయితే, అతడు క్యాచవుట్ కావడంతో.. చివరి బంతికి మూడు రన్స్ కావాల్సి వచ్చింది. కానీ, ఒక్క పరుగు పూర్తి చేసిన ఫెర్గూసన్ రనౌటవడంతో ఆర్సీబీకి నిరాశ తప్పలేదు. తొలుత కోల్‌కతా 20 ఓవర్లలో 222/6 స్కోరు చేసింది. ఫిల్ సాల్ట్ (14 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 48), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (36 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 50), రమణ్‌దీప్ (9 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 24 నాటౌట్) సత్తా చాటారు. గ్రీన్, యశ్ దయాళ్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో బెంగళూరు ఓవర్లన్నీ ఆడి 221 రన్స్‌కు ఆలౌటైంది. విల్ జాక్స్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 55), రజత్ పటీదార్ (23 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 52) పోరాడారు. రస్సెల్ 3, హర్షిత్ రాణా, నరైన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. దీంతో ఓటముల్లో డబుల్ హ్యాట్రిక్ నమోదు చేసిన ఆర్సీబీ ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న రస్సెల్ (27 నాటౌట్, 3/25)కు 'మ్యాన్ ఆఫ్ మ్యాచ్' దక్కింది.

ఆదుకొన్న జాక్స్, పటీదార్: ఛేదనలో ఓపెనర్ కోహ్లీ (18).. రాణా బౌలింగ్‌లో వివాదాస్పద రీతిలో అవుటయ్యాడు. విరాట్ దాన్ని నోబాల్‌గా భావించినా.. రివ్యూ అనంతరం లీగల్ డెలివరీగా ప్రకటించారు. ఇక, డుప్లెసి (7)ని వరుణ్ వెనక్కి పంపాడు. అయితే, జాక్స్, పటీదార్ మూడో వికెట్‌కు 48 బంతుల్లో 102 పరుగుల భాగస్వామ్యంతో జట్టును మ్యాచ్‌లో నిలిపారు. కానీ, 12వ ఓవర్‌లో వీరిద్దరినీ అవుట్ చేసిన రస్సెల్ మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. తొలి బంతికి జాక్స్‌ను.. నాలుగో బంతికి పటీదార్‌ను పెవిలియన్ చేర్చడంతో బెంగళూరు 145/4తో నిలిచింది. గ్రీన్ (6)ను నరైన్, సుయాష్ (24)ను హర్షిత్ బోల్తా కొట్టించారు. డెత్ ఓవర్లలో దినేష్ కార్తీక్ (18 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 25) క్రీజులో ఉండడంతో ఆర్సీబీ గెలుస్తుందనుకున్నా.. కీలక సమయంలో కార్తీక్‌ను రస్సెల్ అవుట్ చేశాడు. ఆఖర్లో కర్ణ్ శర్మ భయపెట్టినా ఫలితం లేకపోయింది.

సాల్ట్ దూకుడు..: ఓపెనర్ సాల్ట్ అదిరే ఆరంభాన్నివ్వగా.. మిడిలార్డర్‌లో కెప్టెన్ అయ్యర్ ఆదుకోవడంతో.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ప్రత్యర్థికి సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. నరైన్ (10) విఫలమైనా.. సాల్ట్ భారీషాట్లతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. అయితే, 5వ ఓవర్‌లో సాల్ట్‌ను సిరాజ్ అవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. నరైన్, రఘువంశీ (3)లను యశ్ ఒకే ఓవర్‌లో అవుట్ చేయడంతో.. పవర్‌ప్లే ముగిసేసరికి కోల్‌కతా స్కోరు 75/3. వెంకటేష్ అయ్యర్ (16)ను గ్రీన్ క్రీజులో కుదురుకోనివ్వలేదు. కానీ, రింకూ సింగ్ (24)తో కలసి 5వ వికెట్‌కు 40 పరుగులు జోడించిన శ్రేయాస్ అయ్యర్.. రస్సెల్‌తో ఆరో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టును ఆదుకొన్నాడు. ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న అయ్యర్‌ను గ్రీన్ పెవిలియన్ చేర్చినా.. చివరి రెండు ఓవర్లలో రస్సెల్ అండతో రమణ్‌దీప్ దుమ్మురేపడంతో జట్టు స్కోరు 220 దాటింది.



స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (సి) పటీదార్ (బి) సిరాజ్ 48, నరైన్ (సి) కోహ్లీ (బి) యశ్ 10, రఘువంశీ (సి) గ్రీన్ (బి) యశ్ 3, వెంకటేష్ (సి) లోమ్రోర్ (బి) గ్రీన్ 16, శ్రేయాస్ (సి) డుప్లెసి (బి) గ్రీన్ 50, రింకూ (సి) యశ్ (బి) ఫెర్గూసన్ 24, రస్సెల్ (నాటౌట్) 27, రమణ్‌దీప్ (నాటౌట్) 24; **ఎక్స్‌ట్రాలు: 20; మొత్తం: 20 ఓవర్లలో 222/6; వికెట్ల పతనం:** 1-56, 2-66, 3-75, 4-97, 5-137, 6-179; **బౌలింగ్:** సిరాజ్ 4-0-40-1, యశ్ దయాళ్ 4-0-56-2, ఫెర్గూసన్ 4-0-47-1, కర్ణ్ శర్మ 4-0-33-0, గ్రీన్ 4-0-35-2.

బెంగళూరు: కోహ్లీ (సి అండ్ బి) రాణా 18, డుప్లెసి (సి) వెంకటేష్ (బి) వరుణ్ 7, జాక్స్ (సి) రఘువంశీ (బి) రస్సెల్ 55, పటీదార్ (సి) రాణా (బి) రస్సెల్ 52, గ్రీన్ (సి) రమణ్‌దీప్ (బి) నరైన్ 6, సుయాష్ (సి) రఘువంశీ (బి) రాణా 24, లోమ్రోర్ (సి అండ్ బి) నరైన్ 4, కార్తీక్ (సి) సాల్ట్ (బి) రస్సెల్ 25, కర్ణ్ శర్మ (సి అండ్ బి) స్టార్క్ 20, సిరాజ్ (నాటౌట్) 0, ఫెర్గూసన్ (రనౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 221 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-27, 2-35, 3-137, 4-138, 5-151, 6-155, 7-187, 8-202, 9-220, 10-221; **బౌలింగ్:** హర్షిత్ రాణా 4-0-33-2, స్టార్క్ 3-0-55-1, వరుణ్ 4-0-36-1, నరైన్ 4-0-34-2, సుయాష్ 2-0-33-0, రస్సెల్ 3-0-25-3.

ఇషాసింగ్‌కు రెండోస్థానం

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ సెలెక్షన్ ట్రయల్స్-2లో తెలుగు షూటర్ ఇషాసింగ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆదివారం జరిగిన పిస్టల్ 25 మీటర్ల విభాగంలో మనూ భాకర్ (585 స్కోరు) టాప్‌లో నిలవగా, ఇషా (581) రెండో స్థానం దక్కించుకుంది.

టెన్నిస్‌కు ముగురుజా గుడ్‌బై

మాడ్రిడ్: రెండుసార్లు గ్రాండ్‌స్లామ్ చాంపియన్, స్పెయిన్ స్టార్ గార్బిని ముగురుజా అంతర్జాతీయ టెన్నిస్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ఆదివారం ప్రకటించింది. 2016లో ఫ్రెంచ్ ఓపెన్, 2017లో వింబుల్డన్ టైటిల్ నెగ్గిన 30 ఏళ్ల ముగురుజా.. వరల్డ్ నెంబర్‌వన్‌గానూ నిలిచింది.

బిజినెస్

అల్ట్రాటెక్ చేతికి ఇండియా సిమెంట్స్ గ్రైండింగ్ యూనిట్

డీల్ విలువ రూ.315 కోట్లు

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో ఇండియా సిమెంట్స్‌కు చెందిన గ్రైండింగ్ యూనిట్‌ను రూ.315 కోట్లకు కొనుగోలు చేసినట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ ప్రకటించింది. మహారాష్ట్రలోని పార్లీలో ఏటా 10.1 లక్షల టన్నుల సామర్థ్యం గల ఈ గ్రైండింగ్ యూనిట్‌ను కొనుగోలు చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని అల్ట్రాటెక్ పేర్కొంది. ఈ కొనుగోలుతో మహారాష్ట్ర మార్కెట్లో కంపెనీ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపింది. ఈ ఏడాది మార్చి ముగిసే నాటికి ఈ యూనిట్ టర్నోవర్ రూ.250.66 కోట్లుగా ఉండగా నికర ఆస్తి విలువ రూ.75.10 కోట్లుగా ఉందని తెలిపింది. కాగా పార్లీ యూనిట్‌తో పాటు ఇదే రాష్ట్రంలో కంపెనీకి చెందిన ధూలే యూనిట్ విస్తరణ కోసం మొత్తం రూ.504 కోట్లు పెట్టుబడిగా పెట్టేందుకు బోర్డు అనుమతినిచ్చిందని అల్ట్రాటెక్ వెల్లడించింది. ఇందులో పార్లీ యూనిట్ సామర్థ్యాన్ని ఏటా 12 లక్షల టన్నులకు విస్తరించేందుకు రూ.166.4 కోట్లు, ధూలే యూనిట్ విస్తరణ కోసం రూ.338 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. ఈ ప్లాంట్ల విస్తరణకు అవసరమైన మొత్తాలను పూర్తిగా అంతర్గత వనరుల ద్వారా సమీకరించుకోనున్నట్లు పేర్కొంది.

2023-24లో పన్ను రాబడి

రూ.19.58 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: దేశంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు 2023-24 సంవత్సరంలో అంచనాలను మించి భారీగా వసూలయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 17.7 శాతం వృద్ధితో రూ.19.58 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ప్రత్యక్ష పన్నుల (ఆదాయపు పన్ను+కార్పొరేట్ పన్ను) ద్వారా వచ్చిన ఆదాయం గత ఏడాది బడ్జెట్ అంచనాల కన్నా రూ.1.35 లక్షల కోట్లు, సవరించిన అంచనాల కన్నా రూ.13,000 కోట్లు అధికంగా ఉంది. తాత్కాలిక బడ్జెట్లో ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యాన్ని రూ.19.45 లక్షల కోట్లకు పెంచింది. కాగా ఆర్థిక సంవత్సరం మొత్తానికి స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యం రూ.18.48 లక్షల కోట్లు కాగా వాస్తవంగా వసూలైనది రూ.23.37 లక్షల కోట్లు, రిఫండ్లు (రూ.3.79 లక్షల కోట్లు) పోను నికర వసూళ్లు 17.7 శాతం వృద్ధితో రూ.19.58 లక్షల కోట్లున్నాయి. ఆర్థిక రంగంలో అంతర్గత శక్తికి, వ్యక్తిగత, కార్పొరేట్ ఆదాయాల్లో వృద్ధికి ఇది దర్పణం పడుతున్నదని సీబీడీటీ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా ఇదే సంవత్సరానికి స్థూల పన్ను వసూళ్లు (రిఫండ్లు సర్దుబాటు చేయడానికి ముందు) రూ.23.37 లక్షల కోట్లుంది. 2022-23 సంవత్సరంలో వసూలైన రూ.19.72 లక్షల కోట్లతో పోల్చితే ఇది 18.48 శాతం అధికం. మరిన్ని వివరాలు...

- స్థూల కార్పొరేట్ పన్ను వసూళ్లు (అంచనా) 2023-24 ఆర్థిక సంవత్సరంలో 13.06 శాతం వృద్ధితో రూ.11.32 లక్షల కోట్లకు పెరిగాయి. అంతకు ముందు ఏడాది వసూళ్లు రూ.10 లక్షల కోట్లుగా ఉన్నాయి. నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు ముందు ఏడాదితో పోల్చితే 10.26 శాతం పెరిగి రూ.8.26 లక్షల కోట్ల నుంచి రూ.9.11 లక్షల కోట్లకు చేరాయి.
- సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) సహా స్థూల వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు 24.26 శాతం వృద్ధితో రూ.9.67 లక్షల కోట్ల నుంచి రూ.12.01 లక్షల కోట్లకు పెరిగాయి. నికర వసూళ్లు కూడా 25.23 శాతం వృద్ధితో రూ.8.33 లక్షల కోట్ల నుంచి రూ.10.44 లక్షల కోట్లకు పెరిగాయి.
- పన్ను రిఫండ్స్ మొత్తం రూ.3.79 లక్షల కోట్లుంది. అంటే ముందు ఏడాదిలో నమోదైన రూ.3.09 లక్షల కోట్ల కన్నా 22.74 శాతం పెరిగింది.
- రికార్డు స్థాయిలో జీఎస్‌టీ వసూళ్ల సహాయంతో పరోక్ష పన్ను వసూళ్లు కూడా సవరించిన అంచనాల కన్నా భారీగా పెరిగి రూ.14.84 లక్షల కోట్లకు చేరాయి.

నాట్కో కొత్తూరు ప్లాంట్‌లో

అంతా అపరిశుభ్రతే

యూఎస్ఎఫ్‌డీఏ హెచ్చరిక

న్యూఢిల్లీ: తెలంగాణలోని కొత్తూరు గ్రామంలో ఉన్న నాట్కో ఫార్మా ఫినిష్డ్ ఉత్పత్తుల ప్లాంట్ పరిశుభ్రతను పాటించడంలో విఫలమైందని అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) ఆరోపించింది. ప్లాంట్‌లో ఉపయోగించే పరికరాలు, పాత్రలను నిర్దిష్ట కాలపరిమితిలో క్రమం తప్పకుండా శుభ్రం చేయలేదని అభియోగం మోపింది. ఈ మేరకు నాట్కో ఫార్మాకు హెచ్చరిక లేఖ పంపింది. గత ఏడాది అక్టోబరు 9వ తేదీ నుంచి 18వ తేదీ మధ్యలో ఎఫ్‌డీఏ బృందం ఈ ప్లాంట్‌ను తనిఖీ చేసింది. "మీ ప్లాంట్‌లో ఔషధాలకు తీసుకోవలసిన శుభ్రత చర్యలు తీసుకోలేదు. పరికరాలు, పాత్రలు క్రమం తప్పకుండా శానిటైజ్ లేదా స్టెరిలైజ్ చేయలేదు. ఇది ఔషధ భద్రత, నాణ్యత, స్వచ్ఛతలకు విఘాతం కలిగించేదిగా ఉంది" అని ఆ లేఖలో పేర్కొంది. ప్లాంట్‌లో ఉత్పత్తి అయిన ఔషధాల శాంపిల్స్ పరీక్షించగా ఉత్పత్తులు కాలుష్యరహితంగా ఉన్నాయనేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని స్పష్టం చేసింది. అలాగే ఒక బ్యాచ్‌లోని ఔషధాలు లేదా వాటిలో ఉపయోగించిన పదార్థాలు నిర్దేశిత భద్రతా ప్రమాణాలు కలిగి ఉన్నాయా లేవా ఆ బ్యాచ్ ఔషధాలు అప్పటికే పంపిణీ నెట్‌వర్క్‌కు వెళ్లాయా అని నిశితంగా తనిఖీ చేయడంలో కూడా కంపెనీ విఫలమైందని ఆరోపించింది. వీటన్నింటిపై సమగ్ర, స్వతంత్ర దర్యాప్తు నిర్వహించి తగు దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది. ఈ దిద్దుబాటు చర్యలు పూర్తయ్యే వరకు ఈ ప్లాంట్ నుంచి అమెరికా మార్కెట్‌కు పంపే ఉత్పత్తుల తయారీని తాత్కాలికంగా నిలిపివేయాలని కూడా కోరింది. తయారీ కార్యకలాపాలు పునరుద్ధరించాలనుకుంటే ముందుగా తమకు తెలియచేయాలని సూచించింది.

బంధన్ ఇన్నోవేషన్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. బంధన్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ థెమాటిక్ ఫండ్. ఆర్ అండ్ డీ పెట్టుబడులు, హై స్కిల్డ్- ఎంప్లాయీ కాస్ట్, ప్రత్యేక ఉత్పత్తులు లేదా సర్వీసులు, మంచి రిటర్నులకు ఆస్కారం ఉన్న కంపెనీలను ఎంచుకుని ఈ ఫండ్ ప్రధానంగా పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 14. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఆ తర్వాత రూపాయి చొప్పున పెట్టుబడులు పెంచుకుంటూ పోవచ్చు.

22,550 పైన బుల్లిష్

(ఏప్రిల్ 22-26 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో గైడ్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 21,778-2,2427 పాయింట్ల మధ్యన కదలాడి గత వారంతో పోల్చితే 372 పాయింట్ల నష్టంతో 22,147 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,550 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,100, 22,343, 22,432, 22,262 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,550
బ్రేక్‌డౌన్ స్థాయి : 21,750
నిరోధ స్థాయిలు: 22,350,22,450, 22,550 (22,250 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 21,950, 21,850, 21,750 (22,050 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	390	విజయవాడ	397
వరంగల్	392	గోదావరి	397
చిత్తూరు	493	విశాఖపట్నం	411

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	గోదావరి	121
వరంగల్	118	విజయవాడ	121
కరీంనగర్	118	గుంటూరు	125
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	125
కర్నూలు	118	చిత్తూరు	110
విశాఖపట్నం	113		

అంతర్జాతీయ పరిణామాలే కీలకం..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఎన్నికలు, అంతర్జాతీయ అంశాలు.. మార్కెట్లపై ప్రభావం చూపించే వీలుంది. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది. ఫియర్ ఇండియా విక్స్ పెరగటం దీన్ని ప్రతిబింబిస్తోంది. వరుసగా నాలుగు వారాలు లాభపడ్డ నిఫ్టీ గత వారం 1.65 శాతం మేర నష్టపోయింది. నిఫ్టీకి 21,900 వద్ద మద్దతు, 22,150 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. ఒకవేళ సూచీ 22,000 ఎగువన నిలదొక్కుకుంటే 22,600 వెళ్లే అవకాశం ఉంది. బ్యాంకింగ్, ఫార్మా రంగాల్లో కన్సాలిడేషన్ జరిగి అప్‌ట్రెండ్ బాట పట్టొచ్చు. ఆర్థిక ఫలితాల సీజన్ మొదలవటంతో ఎంపిక చేసిన షేర్లలోనే పెట్టుబడులు పెట్టడం బెటర్.

స్టాక్ రికమండేషన్స్

ట్రెంట్: జీవితకాల గరిష్ఠాల్లో సాగుతున్న ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ గణనీయంగా పెరుగుతోంది. నిఫ్టీతో పోల్చితే జోరు ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.71 లాభపడి రూ.4,158 స్థాయిల్లో క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.4,150/4,130 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.4,255/4,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,100 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

బ్లూడార్ట్: సుదీర్ఘకాలంగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు టర్న్ అరౌండ్ అవుతోంది. క్రమక్రమంగా వాల్యూమ్ పెరుగుతోంది. డైలీ టైమ్ ఫ్రేమ్‌లో రూ.6,195 వద్ద నిరోధాన్ని అధిగమించింది. క్రితం నెల, వారం గరిష్ఠాలను క్రాస్ చేసింది. గత శుక్రవారం ఈ షేరు రూ.183 మేరకు లాభపడి రూ.6,297 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.6,250/6,270 స్థాయిల్లో ప్రవేశించి రూ.6,455/6,490 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకోవచ్చు. అయితే రూ.6,220 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్కార్ట్స్: ఈ షేరు జీవితకాల గరిష్ఠానికి చేరిన తర్వాత ఈ కౌంటర్‌లో కరెక్షన్ జరిగింది. గత ఏడాది అక్టోబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో సాగుతూ వస్తున్న ఈ షేరు క్రమంగా లాభాల్లో పయనిస్తోంది. మార్చి మూడో వారం నుంచి బైయింగ్ వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 2.93 శాతం లాభంతో రూ.3,106 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.3,100 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.3,180/3,240 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,075 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

రేమండ్: ఈ కౌంటర్‌కు చాలా సానుకూల అంశాలు ఉన్నాయి. చివరి ఐదు సెషన్లలో డెలివరీ వాల్యూమ్ 3.7 రెట్లు పెరిగింది. షేరు విలువ అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను క్రాస్ చేసింది. అంతక్రితం వారం గరిష్ఠ స్థాయిని అధిగమించింది. కన్సాలిడేషన్ జరిగింది. గత శుక్రవారం ఈ షేరు 5.33 శాతం లాభంతో రూ.2,011 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.2,000 స్థాయిల్లో ప్రవేశించి రూ.2,110/2,165 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,970 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మోతీలాల్ ఓస్వాల్: బెంచ్ మార్క్ సూచీలతో సంబంధం లేకుండా ఈ స్టాక్ బ్రోకింగ్ షేరు గణనీయంగా రాణిస్తూ వస్తోంది. సరికొత్త గరిష్ఠాలను నమోదు చేస్తోంది. డెలివరీ, వాల్యూమ్ గణనీయంగా పెరుగుతోంది. బోనస్ షేర్లు ఇవ్వాలని యోచిస్తుండటం మరో సానుకూల అంశం. గత శుక్రవారం ఈ షేరు 7.02 శాతం లాభంతో రూ.2,232 వద్ద ముగిసింది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.2,200 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.2,355 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,160 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

నిరోధం 22,300



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కీలక స్థాయి 22,500 కన్నా దిగువన బలమైన కరెక్షన్‌తో ప్రారంభమై బలహీనతను ప్రదర్శించింది. శుక్రవారం మరో కీలక స్థాయి 22,000 కన్నా కూడా దిగజారి 22,150 సమీపంలో వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు మధ్యన ముగిసింది. 22,500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలం కావడంతో స్వల్పకాలిక ర్యాలీకి బ్రేక్ పడింది. 21,700 వద్ద బలమైన మద్దతు తీసుకుంది. మొత్తం మీద మార్కెట్ 22,700, 21,700 మధ్యన కదలాడుతోంది. గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 1,370 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 220 పాయింట్లు నష్టపోయాయి. మరింత కన్సాలిడేషన్ తర్వాత మాత్రమే తదుపరి కదలికలో స్పష్టత ఏర్పడుతుంది. ఈ వారం మార్కెట్ పాజిటివ్‌గానే ప్రారంభమయ్యే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ పాజిటివ్ ధోరణిలో ట్రేడయితే ప్రధాన నిరోధం 22,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో నిరోధం 22,500. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన నిరోధం 22,800 (చారిత్రక గరిష్ఠ స్థాయి).

బేరిష్ స్థాయిలు: మరింత బలహీనపడినా ట్రెండ్‌లో సానుకూలత కోసం మద్దతు స్థాయి 21,950 కన్నాపైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 21,700.

బ్యాంక్ నిఫ్టీ: బలమైన డౌన్‌ట్రెండ్‌లో ప్రారంభమై చివరిలో రికవరీ సాధించినా వారం మొత్తం మీద 1,000 పాయింట్ల నష్టంతో క్లోజయింది. ఈ సూచీ 49,000, 46,000 పరిధిలో చిక్కుకుపోయినట్టు కనిపిస్తోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం 48,000 వద్ద నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 48,300. మద్దతు స్థాయిలు 47,300, 46,900.

పాటర్న్ : మార్కెట్ స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకుంటున్నట్టు కనిపిస్తోంది. గత వారం 100 డిఎంఏ వద్ద రికవరీ సాధించింది. రాబోయే కొద్ది రోజుల్లో 25, 50 డిఎంఏల వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి రివర్సల్ ఉంది.

సోమ వారం స్థాయిలు	
నిరోధం :	22,255, 22,300
మద్దతు :	22,100, 22,040

www.sundartrends.in

ఏపీలో అరాచకాలపై వేలు నరుక్కొని నిరసన

దేశ రాజధాని ఢిల్లీలో కలకలం

- బాధితురాలు గుంటూరు మహిళ
- మాజీ హోంమంత్రి సుచరిత అనుచరుల అక్రమాలపై ఏకరువు
- ప్రధాని, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు సీజేకి వినతులు

గుంటూరు, ఏప్రిల్ 21 : దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అక్రమాలపై గుంటూరు రూరల్ మండలం స్వర్ణ భారతి నగర్‌లోని కృష్ణతులసి నగర్ డి బ్లాక్ కు చెందిన కోపూరి లక్ష్మి దేశ రాజధానిలో ఆదివారం 'ఏకలవ్య' తరహాలో నిరసన చేపట్టారు. ఢిల్లీలోని ఇండియా గేటు వద్ద అనుచరులతో నిరసన వ్యక్తం చేస్తూ ఒక్కసారిగా తన ఎడమ చేతి బొటన వేలును నరుక్కుని కలకలం రేపారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలకు గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో జరుగుతున్న ఘటనలే నిదర్శనమంటూ ఆమె ఆక్రోశించారు. ముఖ్యంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో ఆమె మూడురోజుల క్రితం మహిళా, ప్రజా సంఘాల నాయకులు బొందలపాటి



ఢిల్లీలోని ఆస్పత్రిలో చేతికి కట్టు కట్టించుకున్న బాధిత మహిళ కోపూరి లక్ష్మి

అమరేశ్వరి, మారిపాక జయమ్మ, నూతక్కి కృష్ణరేఖ, గణేష్, నామాల నాగార్జున తదితరులతో కలిసి ఢిల్లీ చేరుకున్నారు. ప్రధాని, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులను కలిసేందుకు ప్రయత్నించి, సాధ్యం కాకపోవడంతో వారి కార్యాలయాల్లో వినతి పత్రాలు అందించారు. అనంతరం ఆదివారం సాయంత్రం ఆమె తన ఎడమ చేయి బొటనవేలు నరుక్కున్నారు. ప్రధాని, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులను కలిసి విజ్ఞప్తి చేసే అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. ఆమె కథనం మేరకు.. కోపూరి లక్ష్మి ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు. మాజీ హోం మంత్రి సుచరిత ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలో ఓ ముఠా...చిన్న పిల్లలకు గంజాయి అలవాటు చేయడం, వారితో విక్రయించడం, నేరాలు చేయించడం ద్వారా వారిలో నేర ప్రవృత్తిని పెంపొందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. వీటిపై ప్రశ్నిస్తే.. అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ తమపై తప్పుడు ప్రకటనలిచ్చి అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.41వ డివిజన్‌లో భూకబ్జాలు, ప్రభుత్వాధికారుల సంతకాలను సుచరిత అనుచరులే చేస్తున్నారని తెలిపారు. ఎస్పీలు, కలెక్టర్‌లకు ఫిర్యాదులు చేసినా, వారు చర్యలకు ఆదేశించినా, కేసులు నమోదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.

ప్రధాని, రాష్ట్రపతి, మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదులు: బాధితురాలు

ఏపీలో, ప్రత్తిపాడు నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలను దేశం దృష్టికి తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నా. మూడు రోజుల క్రితం ఢిల్లీ చేరుకున్నాను. జాతీయ మానవ హక్కుల కమిషన్, ప్రధాని, రాష్ట్రపతి కార్యాలయాల్లో ఆయా ఫిర్యాదులు అందించాను. చివరిగా ఆదివారం సాయంత్రం ఎడమ చేయి బొటనవేలు నరుక్కున్నాను. నేను చేసిన ఆయా ఆరోపణలకు అన్ని ఆధారాలూ ఉన్నాయి. ప్రతి దానినీ నిరూపిస్తాను. రాష్ట్రంలో ఈ అవినీతి, అక్రమాలు ప్రపంచం దృష్టికి తీసుకురావడం కోసమే గత్యంతరం లేక ఇలా నిరసనకు దిగాల్సి వచ్చింది..



రాజాం మెంతిపేటలో వైసీపీ అభ్యర్థిని చుట్టుముట్టిన దళితులు

గోబ్యాక్ వైసీపీ!

- రాజాంలో వైసీపీ అభ్యర్థికి నిరసన సెగ
- ఈ ఐదేళ్లలో ఏం అభివృద్ధి చేశారని నిలదీసిన దళితులు

రాజాం, ఏప్రిల్ 21: విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి తలే రాజేష్, తండ్రి తలే భద్రయ్యకు శనివారం ఎన్నికల ప్రచారంలో నిరసన సెగ తగిలింది. రాజాం పురపాలక సంఘం పరిధిలోని మెంతిపేట ఎస్సీ కాలనీకి ప్రచారానికి వెళ్లిన వారిని స్థానిక దళితులు అడ్డుకున్నారు. ఈ ఐదేళ్లలో ఏం అభివృద్ధి చేశారని తమ ప్రాంతానికి వచ్చారంటూ వైసీపీ అభ్యర్థి రాజేష్‌ను స్థానికులు నిలదీశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎస్సీ కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేయడమే కాకుండా దళితులకు అందాల్సిన 23సంక్షేమ పథకాలను రద్దు చేసిందని ధ్వజమెత్తారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఖర్చు చేయాల్సిన నిధులను కూడా నవరత్నాలకు మళ్లించి తమ సామాజిక వర్గాన్ని వంచించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోబ్యాక్ వైసీపీ అంటూ నినాదాలు చేశారు. వెనక్కి వెళ్లిపోవాలన్న దళితులకు నచ్చజెప్పేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నించి భంగపడ్డారు. వైసీపీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కేకలు వేయడంతో ఇక లాభం లేదని నాయకులు మెల్లగా జారుకున్నారు.

ఆ మసాలాల్లో క్యాన్సర్ కారకాలు!

- ఎవరెస్ట్, ఎండీహెచ్ స్పైసెస్‌కు చెందిన నాలుగు ఉత్పత్తుల్లో ఇథిలీన్ ఆక్సైడ్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ప్రసిద్ధి చెందిన మసాలా ఉత్పత్తుల తయారీ సంస్థలు.. ఎవరెస్ట్, ఎండీహెచ్ (మహాషియాన్ డి హట్టి ప్రైవేట్ లిమిటెడ్)! ఈ రెండు సంస్థలకు చెందిన నాలుగు ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారకాలు ఉన్నాయని హాంకాంగ్ ఆహార నియంత్రణ ప్రాధికార సంస్థ 'సెంటర్ ఫర్ ఫుడ్ సేఫ్టీ' వెల్లడించింది. సాధారణ పరీక్షల్లో భాగంగా ఈ రెండు కంపెనీలకు చెందిన నాలుగు ఉత్పత్తుల నమూనాలను పరీక్షించామని.. వాటిలో మానవ వినియోగానికి పనికిరాని ఇథిలీన్ ఆక్సైడ్ (పురుగుమందుల్లో ఉండే రసాయనం) ఉన్నట్టు వెల్లడైందని వివరించింది. ఆ నాలుగు ఉత్పత్తుల్లో ఒకటి ఎవరెస్ట్ కంపెనీకి చెందిన ఫిష్ కర్రీ మసాలా కాగా.. మిగతా మూడూ ఎండీహెచ్ స్పైసెస్‌కు చెందిన మద్రాస్ కర్రీ పౌడర్ (స్పైస్ బ్లెండ్ ఫర్ మద్రాస్ కర్రీ), మిక్స్‌డ్ మసాలా పౌడర్, సాంబార్ మసాలా. వీటిలో తాము గుర్తించిన ఇథిలీన్ ఆక్సైడ్‌ను.. 'ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రిసెర్చ్ ఆన్ క్యాన్సర్' సంస్థ గ్రూప్ 1 క్యాన్సర్ కారకంగా వర్గీకరించిందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ నాలుగు ఉత్పత్తుల విక్రయాన్ని నిలిపివేయాలని, ఇప్పటికే దుకాణాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచినవాటిని తొలగించాల్సిందిగా విక్రేతలను ఆదేశించినట్టు వెల్లడించింది. హాంకాంగ్ సెంటర్ ఫర్ ఫుడ్ సేఫ్టీ ప్రకటన నేపథ్యంలో.. భారతదేశం నుంచి దిగుమతి చేసుకున్న ఎవరెస్ట్ ఫిష్ కర్రీ మసాలను సింగపూర్ తన మార్కెట్ల నుంచి ఉపసంహరించింది. రొమ్ము క్యాన్సర్, లింఫోమా (లింప్ గ్రంధుల్లో క్యాన్సర్)కు కారణమయ్యే ఇథిలీన్ ఆక్సైడ్ ఆనవాళ్లు అందులో ఉండడమే తమ నిర్ణయానికి కారణంగా పేర్కొంది.

కోడ్ ఉన్నా 'అజేయం'గా బిల్లులు!

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన లేఖలను ముందుంచి బిల్లులు చెల్లిస్తోంది. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడంలో ముఖ్యమంత్రి జగన్‌తో రెవెన్యూ శాఖ పోటీ పడుతోంది. ఈ మొత్తం ప్రక్రియలో ముఖ్యమంత్రి జగన్ కార్యాలయం బిల్లులపై సిఫారసు లేఖలు రాస్తుంటే, వాటిని రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్ తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు. బిల్లుల చెల్లింపులకు గృహ నిర్మాణశాఖ(హౌసింగ్) స్పెషల్ సీఎస్‌గా ఆయన రెవెన్యూకు సిఫారసు చేస్తున్నారు. మరోచేత్తో రెవెన్యూ స్పెషల్ సీఎస్ హోదాలో ఆయనే ఆమోదిస్తున్నారు. మొత్తంగా ఈ ప్రక్రియలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల స్పెషల్ సీఎస్‌గా ఉన్న అజయ్‌జైన్ కర్త, కర్మ, క్రియగా వ్యవహరిస్తున్నారు. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా బిల్లులు సెటిల్ చేయాలంటూ హడావుడి చేశారు. రెవెన్యూశాఖ నుంచి ఆదేశాలు వెలువడిన మరుక్షణం సీనియారిటీతో సంబంధం లేకుండా పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయించడంలో ప్రభుత్వ పెద్దలు తమదైన పాత్ర పోషిస్తున్నారు. కోడ్ తమకు వర్తించదని, అదో లెక్కలేని అంశమని సీనియర్ ఐఏఎస్‌లే వ్యవహరిస్తుండటం గమనార్హం.

ఇదీ ఇంటి కథ: నవరత్నాలు-పేదలందరికి ఇళ్లు స్కీమ్ కింద పేదల ఇళ్ల స్థలాల కోసం గ్రామాల వారీగా 20 వేల ఎకరాలపైన భూసేకరణ చేశారు. జగనన్న కాలనీలను చదును చేసి లే అవుట్‌లు వేశారు. ఇందుకోసం 45 వేల కోట్లపైనే ఖర్చుపెట్టారు. తొండలు గుడ్లుపెట్టని భూములు, కొండ పోరంబోకులు, చివరకు ఖనిజ నిక్షేపాలున్న భూములను సైతం సేకరించి లే అవుట్‌లు వేశారు. ఎకరం లక్ష రూపాయలు కూడా విలువ చేయని వాటికి కోటి, రెండు కోట్ల రూపాయల చొప్పున చెల్లింపులు చేశారు. ఈ వ్యవహారంలో వైసీపీ నేతలు భారీగా అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలున్నాయి. ప్రభుత్వం మారితే ఈ అంశంపై సమగ్ర విచారణ చేస్తామని ఇదివరకే తెలుగుదేశం, జనసేన ప్రకటించాయి. దీంతో భూసేకరణ చెల్లింపులన్నీ గత ఏడాది డిసెంబరు నాటికే పూర్తి చేశారు. కోర్టు కేసులు, వివాదాల్లో ఉన్న భూములు వినహా మిగతా 80 శాతం చెల్లింపులు పూర్తయ్యాయి. ఇటీవలి కాలంలో కొన్ని భూములపై ఉన్న వివాదాలను వైసీపీ ఎమ్మెల్యేలే సెటిల్ చేశారు. వాటికి బిల్లులు చెల్లించాలంటూ మార్చి రెండో వారంలో సీఎంఓకు లేఖలు రాశారు. ఆ లేఖల సిఫారసు మేరకు బిల్లుల చెల్లింపు జరిగేలా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలంటూ సీఎంవో నుంచి హౌసింగ్ విభాగానికి ఆదేశాలు వెళ్లాయి.

అజయ్‌జైన్ హడావుడి: జగనన్న కాలనీలకు భూసేకరణ, లే అవుట్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మార్చి 10 నుంచి 15వ తేదీ వరకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు సీఎంవోకు లేఖలు రాశారు. ప్రతీ లేఖను ఎండార్స్ చేస్తూ బిల్లుల చెల్లింపు అంశాన్ని పరిశీలించాలని సీఎంవో నుంచి అజయ్‌జైన్‌కు వరసగా సిఫారసులు వెళ్లాయి. గృహ నిర్మాణ శాఖ స్పెషల్ సీఎస్‌గా అజయ్ జైన్ వాటిని పరిశీలన చేసి అంతా బాగుందనుకున్నాకే బిల్లులు చెల్లించాలంటూ రెవెన్యూ శాఖకు సిఫారసు చేయాలి. భూసేకరణ బిల్లుల చెల్లింపు బాధ్యత రెవెన్యూదే. లే అవుట్‌లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల ఖర్చును గృహ నిర్మాణశాఖ భరించాల్సి ఉంటుంది. బిల్లుల చెల్లింపు రొటీన్‌గా జరిగే ప్రక్రియ. అయితే, సీఎఫ్ఎమ్ఎస్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత సీనియారిటీని బట్టి చెల్లించాలి. కాబట్టి కోడ్‌కు పది రోజుల ముందు వరకు వచ్చిన బిల్లులకు సీనియారిటీనే లేదు. దీంతో సీనియారిటీతో సంబంధం లేకుండా బిల్లుల చెల్లింపులకు టోకెన్లు జారీ చేయించేందుకు పెద్దలు రంగప్రవేశం చేశారు. బిల్లుల చెల్లింపుపై సీఎంఓ నుంచి సిఫారసులు రాగానే, వాటిని సెటిల్ చేయాలని అజయ్‌జైన్ రెవెన్యూ శాఖను కోరారు. రెవెన్యూ శాఖ ఇన్‌చార్జి స్పెషల్ సీఎస్‌గా కూడా అజయ్‌జైనే ఉన్నారు. గృహ నిర్మాణ శాఖ నుంచి వచ్చిన విన్నపాలను అజయ్‌జైన్ చకచకా సెటిల్ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్న విషయం పట్టించుకోకుండా సీఎంఓ చెప్పిందన్న కారణంతో హడావుడి చేశారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అనపర్తి నియోజకవర్గ బిల్లుల చెల్లింపు.

కోడ్ వచ్చాక కూడా...

అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి కాకినాడ జిల్లా కరకుదురు గ్రామంలోని భూసేకరణ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మార్చి 12వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌ను కోరారు. ఎమ్మెల్యే విన్నపంపై తగిన చర్యలు తీసుకోవాలంటూ 15వ తేదీన అంటే ఎన్నికల కోడ్‌కు ఒక రోజు ముందు సీఎం కార్యాలయం గృహ నిర్మాణ శాఖ స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్‌ను కోరింది. ఆ లేఖ పలు విభాగాలు తిరిగి మార్చి 26న స్పెషల్ సీఎస్‌కు చేరుకుంది. 'సీఎంఓకు వచ్చిన వినతిపత్రంపై సత్వరమే తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖకు పంపిస్తున్నాం. ఈ అంశంలో వెంటనే ఏం చర్యలు తీసుకున్నారో సీఎంఓ అదనపు కార్యదర్శికి తెలియజేయాలని కోరారు' అని పేర్కొంటూ అజయ్‌జైన్ మార్చి 26న రెవెన్యూ శాఖకు నోట్ పంపించారు. నోట్ పంపించే నాటికే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి పది రోజులవుతోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి మార్చి 16వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు అమల్లోకి వచ్చింది. ఈ విషయం స్పెషల్ సీఎస్‌కు తెలియని విషయమా? అయినా సీఎంఓ నుంచి వచ్చింది కాబట్టి అటు హౌసింగ్ నుంచి ఇటు రెవెన్యూ నుంచి బిల్లు చెల్లింపు ప్రతిపాదనలు చకచకా కదిలించారు.

కోడ్ ఉల్లంఘన కాదా?

ప్రభుత్వంలో బిల్లుల చెల్లింపునకు ఓ విధానం ఉంది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ముందు వచ్చిన వారికి సీనియారిటీ ప్రాతిపదికన సీఎఫ్ఎమ్ఎస్‌లో బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు ఆయా శాఖల బిల్లులు అప్‌లోడ్ చేయాలి. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా రెగ్యులర్ పద్ధతిలోనే చెల్లింపు జరగాలి. సీనియారిటీ ప్రకారం చెల్లింపు జరగాల్సినచోట, సీఎంఓ సిఫారసులతో హడావుడిగా బిల్లులు చెల్లించాలనుకోవడమే తప్పు. సీఎంఓ సిఫారసు చేయడం కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. సీఎంఓ సిఫారసు చేసినా రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్ కోడ్ అమలు గురించి ఆలోచించాలి. కోడ్ అమల్లోకి వచ్చిన పది రోజుల తర్వాత కూడా బిల్లుల చెల్లింపుపై రెవెన్యూ శాఖకు నోట్‌లు పంపడం గమనార్హం. ఏ ప్రతిపాదికన సీఎంఓ సిఫారసును ఆయన పరిగణనలోకి తీసుకొని బిల్లుల చెల్లింపు కోరుతూ రెవెన్యూ శాఖకు సిఫారసు చేశారు? అన్నది పెద్ద ప్రశ్నగా మారింది. కోడ్‌ను ఉల్లంఘించేలా నిర్ణయాలు తీసుకోవడం అజయ్‌జైన్‌కు కొత్త కాదు. కోడ్ అమల్లో ఉండగానే సుమోటో కుల ధృవీకరణ చేపట్టాలనుకొని సీఎస్ నేతృత్వంలోని స్ర్కీనింగ్ కమిటీకి ప్రతిపాదనలు ఇచ్చారు. దాన్ని అమలు చేయడానికి సమర్థనీయ కారణాలు లేవని ఫైలును కమిటీ వెనక్కి పంపించింది. అలాగే 118 మంది డీటీలకు తహసిల్దార్లుగా పదోన్నతులు ఇవ్వాలని రెవెన్యూ శాఖ ఫైలును స్ర్కీనింగ్ కమిటీకి పంపించింది. ఈ రెండు అంశాలను 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. ఇవి కోడ్ ఉల్లంఘనకు కిందకు వస్తాయని ప్రభుత్వం వెనక్కి తగ్గింది. తాజాగా భూసేకరణ బిల్లుల అంశంలో సీఎంఓ, అజయ్‌జైన్ హడావుడి వెలుగుచూసింది.

రాష్ట్రస్థాయి అండర్-17 చెస్ విజేతలు వీరే



విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 21 : స్థానిక గ్రీన్ స్కూల్‌లో రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-17 చెస్ ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో ఏడు రౌండ్ల పోరులో బాలుర విభాగంలో డి.సాత్విక్ (ప్రథమ), భాస్కర్ రత్న షణ్ముకరెడ్డి (ద్వితీయ), బాలికల విభాగంలో జి.అమూల్య (ప్రథమ), పెర్నీ రక్షిత (ద్వితీయ) స్థానాల్లో నిలిచారు. ప్రతి ఏజ్ గ్రూప్‌ల్లో టాప్ -4గా నిలిచిన విజేతలకు ప్రత్యేక బహుమతులు అందించారు. అండర్-17 బాలబాలికల విజేతలను జాతీయ స్థాయి పోటీలకు పంపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతల బహుమతుల ప్రధానోత్సవంలో ఆంధ్రా చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రామసుబ్బారెడ్డి, గ్రీన్‌స్కూల్ ప్రిన్సిపాల్ జె.సాయి అపర్ణ, కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్ఎం. ఫణికుమార్, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పి.రేణుక పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత చంద్రబాబు

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 21 : అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే ఒక్క నారా చంద్రబాబునాయుడికే సాధ్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆదివారం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థిగా బొండా ఉమాకు చంద్రబాబు బీఫాం అందజేశారు.



కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన ఆర్యవైశ్య నాయకులను ఆహ్వానిస్తున్న చంద్రబాబునాయుడు

టీడీపీలో ఆర్యవైశ్య నాయకుల చేరిక

వన్‌టౌన్, ఏప్రిల్ 21 : విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సమక్షంలో విజయవాడ వన్‌టౌన్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పలువురు ఆర్యవైశ్య నాయకులు టీడీపీలో చేరారు. ఆదివారం ఉండవల్లిలోని చంద్రబాబు నాయుడు తన నివాసంలో వారందంరినీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వస్త్రలత, కృష్ణవేణి మార్కెట్ గొల్లపూడి ఐరన్ యార్డ్, వాసవీ క్లబ్ నాయకులు పలువురు పార్టీలో చేరారు.

సుజనా చౌదరికే మా మద్దతు

● రెల్లి గ్రూప్ కులాల సంఘం అధ్యక్షుడు అప్పారావు

విద్యాధరపురం, ఏప్రిల్ 21 : విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరికి మద్దతు ప్రకటిస్తున్నామని, ఎన్నికల్లో ఆయన గెలుపునకు పనిచేస్తామని రెల్లి గ్రూప్‌కులాల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు భూపతి అప్పారావు తెలిపారు. భవానీపురం బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.



అవార్డు అందుకుంటున్న పీబీ సిద్దార్థ కళాశాల కంప్యూటర్ సైన్సు హెడ్ డాక్టర్ టి.రవికిరణ్

సైన్సు అధ్యాపకుడికి ఎక్సలెన్స్ అవార్డు

మొగల్రాజపురం, ఏప్రిల్ 21 : పీబీ సిద్దార్థ కళాశాల కంప్యూటర్ సైన్సు విభాగం హెడ్ డాక్టర్ టిఎస్ రవికిరణ్‌కు బ్రెయిన్ ఓ విజన్ సంస్థ భారత్ ఎడ్యుకేషన్ అవార్డు ప్రదానం చేసింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఈ సంస్థ ప్రతి ఏడాదీ దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన అధ్యాపకులకు జాతీయ స్థాయిలో ఈ అవార్డు ప్రదానం చేస్తుంది. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 300 మందిని రెండు దశాబ్దాలు బోధన - పరిశోధన రంగంలో విశేష కృషి చేసిన వారిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఆదివారం విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చీఫ్ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, ఆంధ్రా యూనివర్శిటీ వైస్ చాన్సలర్ పీవీజీడీ.ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా బ్రెయిన్ ఓ విజన్ సీఈవో డి.గణేష్ నాగ్ రవికిరణ్‌కు అందించారు. కొత్తకొత్త సాంకేతిక పరిజ్ఞానం, పాఠ్యాంశాలకు సంబంధించి అవార్డు గ్రహీతలకు ఈ సంస్థ తర్ఫీదు ఇస్తుంది.

జగన్, వెలంపల్లి పునీతులయ్యారా.. మహేశ్?

● జనసేన నేత అమ్మిశెట్టి వాసు

వన్‌టౌన్, ఏప్రిల్ 21 : జనసేనలో ఉన్నపుడు ప్రతినిత్యం జగన్, వెలంపల్లి శ్రీనివాసరావుల అవినీతి, అరాచకాలపై మాట్లాడిన పోతిన మహేష్ వైసీపీలో చేరగానే వాళ్లు పునీతులయ్యారా అని జనసేన సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు ప్రశ్నించారు. భవానీపురం 42వ డివిజన్‌లోని ఒక ఫంక్షన్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనసేన వీర మహిళలు మల్లెపూడి విజయలక్ష్మి, తిరుపతి అనూషలతో కలిసి మాట్లాడారు. జగన్, వెలంపల్లి శ్రీనివాసరావుల అవినీతి, అరాచకాలపై మహేష్‌కు ఉన్నంత అవగాహన మరెవరికీ లేదన్నారు. పవన్ కల్యాణ్ ఆస్తులు, సినిమాలపై మహేశ్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నారు. తన తీరును మార్చుకోకుంటే జనసైనికులు అతని ఇంటిని ముట్టడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మహేశ్ మోసాలపై కరపత్రాలు వేసి పంచుతామన్నారు.

కేశినేని నాని, వెలంపల్లి దొంగ ఆలోచనలు మానుకోవాలి

● టీడీపీ నేత లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్



విద్యాధరపురం, ఏప్రిల్ 21 : సీఎంపై రాయి దాడి కేసులో ఏ2 నిందితుడుగా పేర్కొని, పోలీసులు తీసుకువెళ్లడం, అతనిని తిరిగి వదిలి పెట్టిన నేపథ్యంలో సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావుపై కేశినేని శ్రీనివాస్ (నాని), వెలంపల్లి శ్రీనివాసరావు దొంగ ఆలోచనలు మానుకోవాలని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయి రాం ప్రసాద్ గౌడ్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా గౌడ సాధికార సమితి కన్వీనర్ పామర్తి కిషోర్‌బాబుతో కలిసి ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పారిస్ పారా ఒలింపిక్స్‌కు నారాయణ అర్హత



పారా రోయింగ్‌లో అనితాచౌదరితో కలిసి అర్హత సాధించిన కె.నారాయణ

విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 21 : పారిస్‌లో జరగనున్న పారా ఒలింపిక్స్ రోయింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కె.నారాయణ (కర్నూల్) మిక్స్‌డ్ ఈవెంట్‌కు అర్హత సాధించాడని ఏపీ రోయింగ్, స్కలింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు తరుణ్ కాకానీ ఒక ప్రకటనలో తెలిపారు. చైనాలో ఆదివారం పారిస్ క్వాలిఫికేషన్ పోటీల్లో ఏపీ సర్వీసెస్ క్రీడాకారిణి అనితా చౌదరితో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌కు అర్హత సాధించారన్నారు. ఈ ఈవెంట్‌లో తొలి క్వాలిఫైర్స్ జంట వీరిదేనని కాకాని తెలిపారు.

ముగిసిన ఉచిత పుస్తకాల పంపిణీ



పుస్తక ప్రియులతో కిక్కిరిసిన సర్వోత్తమ గ్రంథాలయం

పటమట, ఏప్రిల్ 21 : పుస్తక పఠనం ఒక మహా యజ్ఞంలాగా సాగాలని పిల్లల్లో ఆసక్తి పెంచేందుకు గ్రంథాలయాలు చేస్తున్న కృషి ఎంతో గొప్పదని రిటైర్డు తెలుగు ఆచార్యులు గుమ్మా సాంబశివరావు అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో బెంజిసర్కిల్‌లో సర్వోత్తమ గ్రంథాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత పుస్తకాల పంపిణీ ఆదివారం ముగిసింది.

కూటమి గెలుపు తథ్యం : కేశినేని చిన్ని



టీడీపీ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చిన్ని

పాతరాజరాజేశ్వరి పేట, ఏప్రిల్ 21 : రాబోయే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి గెలుపు తథ్యమని విజయవాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. స్థానిక 34వ డివిజన్, కేదారేశ్వరపేట, 3వ లైన్‌లో ఆదివారం టీడీపీ నాయకులు మహమ్మద్ సుభాని, మహమ్మద్ విజయలక్ష్మి ఏర్పాటు చేసిన కూటమి కార్యాలయ ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది.

నేడు గద్దె రామ్మోహన్ నామినేషన్


● పటమటలంక నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ

పటమట, ఏప్రిల్ 21 : జనసేన, బీజేపీ బలపర్చిన టీడీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా సోమవారం నాడు నామినేషనల్ దాఖలు చేయనున్నట్టుగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. పటమటలంకలోని డీమార్టు దగ్గర నుంచి సోమవారం ఉదయం 8 గంటలకు నామినేషన్ ర్యాలీ మొదలవుతుందన్నారు. అక్కడ నుంచి రామలింగేశ్వర్‌నగర్ స్క్రూబ్రిడ్జి, రాణిగారితోట, కృష్ణలంక, ఎం. హోటల్, సత్యంగారి దొడ్డి, బస్టాండ్ ప్రాంతం నుంచి ఈ యాత్ర జరుగుతుందన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో తాను నామినేషన్ దాఖలు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

జన చేతనం

ప్రజా అజెండా

అభివృద్ధి.. సంక్షేమం.. సమ న్యాయం..



ఆంధ్రజ్యోతి
సోమవారం ◇ 22-4-2024
కౌంట్ డౌన్ 21 రోజులు

గతంలో ఏం చెప్పారంటే...

'మన ప్రభుత్వం వచ్చాక ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తాను. ఏటా జనవరి 1న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాను. ఈ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వట్లేదు. అందుకే జాబ్ రావాలంటే బాబు పోవాలని మన పిల్లలు అంటున్నారు'

- 2019 ఎన్నికల ప్రచారంలో జగన్ ఇచ్చిన హామీ ఇది.

గెలిచాక ఏం చేశారంటే...


జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఒకటి కాదు.. 5 జనవరి నెలలు వెళ్లిపోయాయి. ఒక్కసారి కూడా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు. ఈ ఐదేళ్లలో ఒకే ఒక్కసారి 2021 జూన్‌లో 10,143 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసినా.. వాటిని కూడా పూర్తిగా భర్తీ చేయలేదు. గత ప్రభుత్వంలో 2.30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్న జగన్.. ఈ ఐదేళ్లలో కేవలం 5 వేల పోస్టులే భర్తీ చేశారు.



డీఎస్సీపైనా దగా

డీఎస్సీ విషయంలోనూ జగన్ దగా చేశారు. 23 వేల టీచర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, తామొచ్చాక మెగా డీఎస్సీ వేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. సీఎం అయ్యాక నాలుగున్నరేళ్లు ఆ మాట మరిచిపోయారు. ఇప్పుడు ఎన్నికల ముందు 6100 టీచర్ పోస్టులతో మినీ డీఎస్సీ ప్రకటించినా కోడ్ దెబ్బతో దానినీ నిర్వహించలేని పరిస్థితి.

జాబులేవీ.. జగన్?



నిరుద్యోగులను నమ్మించి నయ వంచన

ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ ఏదీ?

- గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ గాలికి
- 2.30 లక్షల ఉద్యోగాలు ఖాళీ అన్నారే?
- ఐదేళ్లలో భర్తీ చేసింది 5 వేల ఉద్యోగాలే
- 2021 జూన్‌లో ఒకే ఒక్కసారి క్యాలెండర్
- అందులోనూ 60 శాతం భర్తీ కాని పోస్టులు
- ఒక్క గ్రూప్-2 ఉద్యోగమూ ఇవ్వలేదు
- నిలిచిపోయిన వర్సిటీల ఉద్యోగాల భర్తీ
- టీచర్ ఉద్యోగాలపైనా మాట తప్పిన వైనం
- మెగా డీఎస్సీ గాయబ్.. మినీ డీఎస్సీతో హడావుడి

హడావుడి నోటిఫికేషన్లతో సరి

2019 జూన్ నుంచి ఏపీపీఎస్సీ ఇప్పటి వరకూ 75 నోటిఫికేషన్లు జారీచేసింది. గతేడాది జూలై నాటికి 6,040 పోస్టుల భర్తీకి 64 నోటిఫికేషన్లు ఇచ్చింది. అందులో 4,636 పోస్టులు మాత్రమే భర్తీ చేసింది. ఆ తర్వాత ఈ ఏడాది గ్రూప్ 1, 2, ఇతర నోటిఫికేషన్లు ఇచ్చింది. కానీ ఆ ఉద్యోగాల భర్తీ ఇంకా పూర్తి కాలేదు. మొత్తంగా ఈ ఐదేళ్లలో ఏపీపీఎస్సీ భర్తీ చేసిన ఉద్యోగాలు 5 వేలు దాటలేదు. తొలి రెండేళ్లు మౌన ముద్ర పాటించిన ఏపీపీఎస్సీ కొంతకాలంగా నోటిఫికేషన్ల హడావుడి ప్రారంభించింది. ఇంకేముంది... నోటిఫికేషన్ ఇవ్వడంతోనే ఉద్యోగాలు ఇచ్చేసినట్లుగా అధికార పార్టీ ప్రచారం చేసుకుంటోంది.

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతానని నమ్మించారు. అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తానని హామీ ఇచ్చారు. పాదయాత్రలో, గత ఎన్నికల ప్రచారంలో ఊరూ వాడా ఎన్నో మాటలు చెప్పారు. 2.3 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే చంద్రబాబు ప్రభుత్వం భర్తీ చేయట్లేదని విమర్శలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను నట్టేట ముంచారు. ఉద్యోగాల భర్తీ మాటను గాలికి వదిలేశారు. ఇదీ జగన్ మార్క్ రాజకీయం. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక జనవరి 1న ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా రాలేదు. ఇక నోటిఫికేషన్ల సంగతి సరే సరి. రెండేళ్ల పాటు ఉద్యోగాల భర్తీ ఊసే పట్టించుకోలేదు. 2021 జూన్ 14న మొదటిసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేశారు. ఈ ప్రభుత్వం విడుదల చేసిన ఏకైక జాబ్ క్యాలెండర్‌గా అది మిగిలిపోయింది. 10,143 పోస్టులతో అప్పట్లో క్యాలెండర్ విడుదల చేశారు. ఆ పోస్టులన్నా పూర్తిగా భర్తీ చేశారా అంటే.. అదీ లేదు. ఆ జాబ్ క్యాలెండర్‌లో 60 శాతం ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు. భర్తీ చేయనపుడు జాబ్ క్యాలెండర్ ఎందుకులే అనుకున్నారో ఏమోగానీ ఆ తర్వాత ఆ ప్రస్తావన తేలేదు. మొత్తానికి నిరుద్యోగులకు అర్హత వయసు దాటిపోతోంది గానీ ఉద్యోగాలు రాలేదు.

ఒకే ఒక్క గ్రూప్-2

ఏ ప్రభుత్వంలో అయినా నిరుద్యోగులు గ్రూప్-2 ఉద్యోగాలపైనే ఎక్కువ ఆశలు పెట్టుకుంటారు. గ్రూప్-1తో పోలిస్తే ఎక్కువ ఉద్యోగాలు ఉండటం వల్ల ఏదో ఒకటి సాధించవచ్చన్నది నిరుద్యోగుల ఆశ. అందుకే ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకుని మరీ గ్రూప్-2కు సన్నద్ధమవుతుంటారు. గత ప్రభుత్వం రెండు గ్రూప్-2 నోటిఫికేషన్లు ఇచ్చింది. లక్షల ఖాళీలు భర్తీ చేస్తానని జగన్ ఎన్నికల హామీ ఇవ్వడంతో నిరుద్యోగులు ఈ ప్రభుత్వంపై ఆశలు ఎక్కువగా పెట్టుకున్నారు. అయితే ఐదేళ్ల పాటు ఒక్క గ్రూప్-2 ఉద్యోగాన్ని కూడా ఏపీపీఎస్సీ భర్తీ చేయలేదు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఇటీవల 897 పోస్టులతో తొలి నోటిఫికేషన్ జారీచేసింది. ఇటీవల ప్రిలిమ్స్ నిర్వహించగా త్వరలో మెయిన్స్ జరుగుతుంది. ఉద్యోగాల భర్తీ మాత్రం దాదాపుగా వచ్చే ప్రభుత్వంలోనే పూర్తవుతుంది.

మాటల్లోనే వర్సిటీల ఉద్యోగాలు

యూనివర్సిటీల్లో అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తామని 2021 జాబ్ క్యాలెండర్‌లో పేర్కొన్న ప్రభుత్వం ఇప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదు. న్యాయపరమైన వివాదాలు ఉన్నాయంటూ కొంతకాలం సాగదీసింది. గతేడాది చిక్కులు తొలగిపోవడంతో నియామక ప్రక్రియ చేపట్టింది. కానీ సక్రమంగా పూర్తిచేయకుండా మళ్లీ న్యాయపరమైన చిక్కులు వచ్చేలా వింత విధానాలు చేపట్టింది. దాదాపు 3,200 ఉద్యోగాలు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు జారీ చేసింది. కానీ యూనివర్సిటీల్లో వివాదాలకు కేంద్రమైన రోస్టర్‌ను ఉన్నత విద్యామండలి మార్చేసింది. మొత్తం యూనివర్సిటీకి కేటాయించిన పోస్టులకు రోస్టర్ అమలు చేయాల్సి ఉండగా, కొత్తగా భర్తీ చేయబోయే ఖాళీలకు కొత్త రోస్టర్ రూపొందించింది. దీనిపై ఉద్యోగులు కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియ ఆగిపోయింది. అసలు ఈ ఉద్యోగాలు భర్తీ చేయడం ఇష్టంలేకే రోస్టర్‌ను గందరగోళం చేశారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికీ భర్తీ కాని ఈ పోస్టులపై 2021లో ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసుకుంది.

సచివాలయ ఉద్యోగాలపైనే గొప్పలు

గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చిన ప్రభుత్వం 1.3 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసింది. అయితే ఇప్పటికీ ఆ ఉద్యోగాల స్థాయి ఏంటనేదానిపై స్పష్టత లేదు. రెండేళ్లకు పైగా రూ.15 వేల జీతంతో పనిచేసిన వీరు, ఆ తర్వాత రెగ్యులర్ ఉద్యోగులుగా మారారు. వారి పదోన్నతి చానల్ ఏంటో ఎవరికీ స్పష్టత లేదు. గ్రామ మహిళా పోలీసుగా పనిచేస్తున్న ఉద్యోగినులకు తర్వాత పదోన్నతి ఏంటనేది ప్రభుత్వం చెప్పడం లేదు. ఈ ప్రభుత్వం సృష్టించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ పోస్టులూ అంతే. 2.3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పిన జగన్... వాటిని ఎందుకు భర్తీ చేయలేదో చెప్పకుండా, సచివాలయాల ఉద్యోగాలపై గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి



దగా డీఎస్సీ

టీచర్ ఉద్యోగాల భర్తీపైనా జగన్ మాట తప్పారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేస్తామని చెప్పిన ఆయనకు మొన్నటి వరకూ ఆ హామీ గుర్తుకు రాలేదు. 23 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రతిపక్షనేతగా చెప్పిన జగన్... ఇప్పుడు 6,100 పోస్టులతో మినీ డీఎస్సీ వేశారు. అది కూడా ఎన్నికల ముందు ఫిబ్రవరిలో. నిరుద్యోగులు 20 వేల పోస్టుల మెగా డీఎస్సీని ఆశిస్తే... ప్రభుత్వం మినీ డీఎస్సీని ఇచ్చింది. ఏదో ఎన్నికల కోసం హడావుడి తప్ప నిజంగా భర్తీ చేయాలన్న ఉద్దేశం లేకపోవడంతో గందరగోళంగా లెక్కలు వేసింది. 1998 డీఎస్సీ వివాదంతో మిగిలిపోయిన 4,534 మందిని, 2008 డీఎస్సీ వివాదంలో 1,910 మందిని ఈ ప్రభుత్వం మినిమం టైమ్ స్కేలుపై కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాల్లోకి తీసుకుంది. ఎంటీఎస్‌పై ఇచ్చిన ఉద్యోగాలు రెగ్యులర్ కాదు.

ఆ పోస్టులు ఏమయ్యాయి?

గత టీడీపీ ప్రభుత్వం 7,729 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వగా.. భర్తీ ప్రక్రియ ఈ ప్రభుత్వంలో పూర్తయ్యింది. అంతేకానీ జగన్ ప్రభుత్వం కొత్తగా భర్తీ చేయలేదు. గతంలో జగన్ చెప్పినట్టుగా 23 వేల టీచర్ ఉద్యోగాల ఖాళీల్లో 7,729 పోస్టులు తీసేసినా ఇంకా 15,271 ఖాళీలుంటాయి. అవి కాకుండా ఈ ప్రభుత్వం వచ్చాక రిటైర్ అయిన టీచర్ల స్థానాల్లో ఖాళీలూ ఉంటాయి. అవన్నీ కలిపితే 20వేలకు పైగా ఖాళీలుంటాయని అంచనా. మరి 6,100 పోస్టులకే డీఎస్సీ వేశారు. మిగిలిన పోస్టులు ఏమైపోయాయో? గతంలో టీచర్ పోస్టుల భర్తీ విషయంలో చంద్రబాబు ప్రభుత్వాన్ని విమర్శించిన జగన్.. సీఎం అయ్యాక డీఎస్సీని పట్టించుకోలేదు. టీచర్ పోస్టులు భర్తీ చేయకూడదని ఆయన ప్రభుత్వం మొదట్లోనే ప్లాన్ చేసింది. రేషనలైజేషన్ పేరుతో 2022లో తీసుకొచ్చిన జీవో 117తో పోస్టులను కుదించేసింది. ప్రాథమిక పాఠశాలల్లో 20 మంది విద్యార్థుల వరకు ఒక్క టీచర్ చాలనే నిబంధన తీసుకొచ్చింది. దీంతో భారీగా సింగిల్ టీచర్ పాఠశాలలు పెరిగిపోయాయి. దాదాపు 10వేల బడులు కేవలం ఒక్క టీచర్‌తోనే నడుస్తున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో 20 మంది విద్యార్థులు దాటితే రెండో టీచర్‌ను ఇచ్చింది. 60 మంది విద్యార్థుల వరకూ ఇద్దరే టీచర్లను ఇచ్చే విధానం అమలు చేసింది. టీచర్లపై పనిభారాన్ని పెంచింది. 137 మంది కంటే తక్కువ విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల్లో, 98 మంది కంటే తక్కువ మంది ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో హెచ్ఎం పోస్టులు అవసరం లేదని చెప్పింది.

ప్రపంచ బ్యాంకు రుణం కోసం

విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్నట్లు చెప్పుకొంటున్న జగన్ ప్రభుత్వం అందుకోసం ప్రపంచ బ్యాంకు రుణంపై ఆధారపడింది. సుమారు రూ.10వేల కోట్లు వివిధ రూపాల్లో రుణం తీసుకుంది. అయితే రుణం ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ఓ షరతు పెట్టింది. బోధనా సిబ్బందిపై పెట్టే ఖర్చును పెంచకూడదని స్పష్టంచేసింది. దీంతో ప్రపంచ బ్యాంకు రుణం కోసం క్రమంగా టీచర్ల అవసరాన్ని తగ్గిస్తూ వచ్చారు. జీవో 117తో రేషనలైజేషన్, 4250 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సమీపంలోని పాఠశాలల్లో విలీనం చేయడం, 1150 ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్ పోస్టులు రద్దు లాంటి అనేక చర్యలు తీసుకుంది. చివరికి టీచర్ల అవసరమే లేదని తేల్చేసింది.

నిరుద్యోగుల ఆశలు ఆవిరి

జగన్ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు లేకపోవడంతో నిరుద్యోగులు ఉద్యోగాలపై ఆశలు వదులుకున్నారు. మొదట రెండు మూడేళ్లు ఎదురు చూసినా ఆ తర్వాత చాలామంది ఇతర ఉపాధి మార్గాల్లోకి వెళ్లిపోయారు. ఈ ప్రభుత్వం వచ్చేనాటికే కొంత కాలంగా కోచింగ్ తీసుకున్న నిరుద్యోగులు చిన్నాచితకా ప్రైవేటు ఉద్యోగాలు చూసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులు వ్యవసాయం, కూలి పనులకు పరిమితమయ్యారు. ఇంకా ఎంతోమంది ఖాళీగా మిగిలిపోయారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో నిరుద్యోగిత రేటు క్రమంగా పెరుగుతోంది. 2019లో 5.1 శాతంగా ఉంటే, 2023 జూన్ నాటికి 7.7 శాతానికి పెరిగినట్లు కేంద్ర గణాంకాలు చెబుతున్నాయి. ఏటా రాష్ట్రంలో సుమారు లక్ష మంది ఇంజనీరింగ్ పూర్తిచేసి బయటికొస్తున్నారు. డిగ్రీ కోర్సులు చదువుతున్నవారు సగటున 1.3 లక్షల మంది ఉన్నారు. ఇవి కాకుండా ఉపాధి ఆధారిత కోర్సులు, పీజీ చదివినవారు ఉన్నారు. డిగ్రీలు, పీజీలు చేసిన వారి సంఖ్య ఏటా పెరుగుతుండగా, ప్రభుత్వం మాత్రం ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టడం లేదు. మరోవైపు పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేయడంతో ఉపాధి అవకాశాలు అడుగంటాయి.





చిత‌బ‌జో!

చింటూ: ఏంట్రా కబుర్లు! ఈ దారి మధ్యలో పచ్చటి చెట్లు ఉండాలి కదరా!

చిన్నూ: నెల కిందట మీ అన్నియ్య వచ్చాడులే!

చింటూ: ఇక్కడ రోడ్డు ఉండాలే?

చిన్నూ: ఆ గోతుల మధ్య అక్కడక్కడా ఉంది కదరా! చాలదేంటి?

చింటూ: మన బ్యాచోళ్లు ఎవరూ కనపడరే!

చిన్నూ: హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో కనిపిస్తారు.

చింటూ: ఇంకెంతసేపురా బాబూ.. ఆ కానిస్టేబులు ట్రాఫిక్ ఆపేసి పైకి చూస్తున్నాడేంటి?

చిన్నూ: అన్నియ్య హెలికాప్టర్‌లో వెళ్తున్నాడు కదరా!





అన్న దెబ్బకు అబ్బా...

పంచాయతీలపై జగన్ పగ

- డెలివరీ బాయ్‌గా దళిత సర్పంచ్



డెలివరీ బాయ్‌గా వెళ్తున్న సర్పంచ్ గిరి

సర్పంచ్‌గా గ్రామ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం గుండెల నిండా ఉంది! కానీ పంచాయతీకి నిధులు లేవు. ఉన్న నిధులూ ఖర్చు చేసుకోనివ్వరు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వరు. చివరికి తాను ఊరిలో ఉండి ఏం చేయాలో అర్థం కాక ఆ దళిత సర్పంచ్ డెలివరీ బాయ్‌గా మారిపోయారు. పంచాయతీలపై జగన్ సర్కారు పగ పట్టిన ఫలితమిది! పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం కుదమ పంచాయతీకి చెందిన చెరుకుబిల్లి గిరి డిగ్రీ పూర్తి చేశారు. విశాఖపట్నంలో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంలో చేరారు. అక్కడ మూడు పూటలా భోజనం పెట్టి నెలకు రూ.15 వేల జీతం ఇచ్చేవారు. కానీ, సొంత ఊరికి మేలు చేద్దామనే ఉద్దేశంతో 2021లో జరిగిన ఎన్నికల్లో కుదమ సర్పంచ్‌గా పోటీ చేసి వైసీపీ మద్దతుతో బరిలో ఉన్న అభ్యర్థిపై నెగ్గారు. కానీ.. జగన్ సర్కారు తీరుతో ఊరికి మేలు చేయాలన్న ఆయన ఆశలు ఆవిరయ్యాయి. 2023 మార్చిలో తన చెక్ పవర్‌ను వైసీపీ నేతలు రద్దు చేయించారని, తర్వాత ఎన్నో ఇబ్బందులు పెట్టారని గిరి ఆవేదన వ్యక్తంచేశారు. గత ఏడాది నవంబరులో చెక్ పవర్‌ను పునరుద్ధరించారు. కానీ... చేసిన పనులకు బిల్లులే చెల్లించలేదు. గ్రామ ప్రజలకు ఏమీ చేయలేకపోతున్నానని గిరి ఎంతో మదనపడ్డారు. చివరికి... ఊరిలో బతుకు తెరువు కూడా కనిపించలేదు. మరో దారి లేక... 'ఈ కామ్ ఎక్స్‌ప్రెస్'లో నెలకు రూ.11 వేల జీతానికి డెలివరీ బాయ్‌గా చేరారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీలను నిర్వీర్యం చేసి, తమ సర్పంచ్‌కు ఇలాంటి దుస్థితి తీసుకొచ్చిన జగన్ సర్కారుపై గ్రామ ప్రజలు మండిపడుతున్నారు.

- జియ్యమ్మవలస

రోడ్లు వెయ్యం.. తవ్వుతాం!

రోడ్లు వెయ్యడం ఎలాగూ చేతకాదు! కానీ... చక్కగా ఉన్న హైవేలను తవ్వేందుకు మాత్రం జగనన్న 'సిద్ధం'! ఏలూరు శివార్లలో జరిగిన 'సిద్ధం' సభ ప్రాంగణంలోకి వాహనాలు నేరుగా వచ్చేందుకు వీలుగా ఏకంగా జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌నే తవ్వేశారు. పోలీసులే దగ్గరుండి ఈ పని చేయించారు. ఇక... పార్కింగ్, ఇతర ఏర్పాట్ల కోసం పొలాలకు నీరందించే కాలువను కూడా పూడ్చేశారు. ఇంత ఘోరం ఎక్కడైనా కన్నారా... విన్నారా!




పోలీసును పెట్టి మరీ జాతీయ రహదారిపై డివైడర్‌ను తవ్వేశారిలా..

అట్లుంటది అన్నతోని..





పార్కింగ్ కోసం పంట కాలువను పూడ్చేశారిలా..



బ్యాలెట్లు బుల్లెట్లకు సరైన, శాంతియుత వారసులు



- అబ్రహాం లింకన్



వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎంపీ

అబ్బ ఛా!

నేను ఎవరికీ ద్రోహం చేయలేదు

నాకు సంబంధంలేని వ్యవహారంలో నరకం అనుభవిస్తున్నా. నా జీవితంలో ఎవరికీ ద్రోహం చేయలేదు. నాకు ముందస్తు బెయిల్ వస్తే రిలీఫ్ అంటున్నారు. వ్యవస్థల్లో పలుకుబడిని ఉపయోగించుకుని, చంద్రబాబు పరపతితో బీజేపీలో ఉన్న పెద్దలతో మమ్మల్ని నరకయాతనకు గురిచేశారు.



"దేశంలో ఎక్కడాలేని విధంగా నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతాను. వడ్డీలేని రుణం లక్ష రూపాయలు ఇస్తాను. ప్రతి చేనేత కుటుంబానికీ పెన్షన్ ఇస్తాను. వైసీపీని గెలిపిస్తే చేనేత మగ్గానికి మహర్దశ తీసుకొస్తాను"...గత ఎన్నికల ముందు ఓట్ల కోసం పాదయాత్రలో వైసీపీ అధినేత జగన్ చెప్పిన మాటలివి. కానీ, జగన్ ముఖ్యమంత్రి పదవిలో కూర్చోగానే వడ్డీలేని రుణం 'ఫ్యాను'గాలిలో కొట్టుకుపోయింది. నిబంధనల కొర్రీలతో పింఛన్ల పథకం 3.50లక్షల మంది నుంచి 81వేలకు తగ్గిపోయింది. చేతి మగ్గాలకు అండగా ఆప్కోను బలోపేతంచేస్తానని మాటిచ్చి, మరమగ్గాల నుంచి విద్యార్థుల యూనిఫామ్ కొనుగోలు చేసి నేతన్నలను జగన్ వంచించారు.

అలా హామీ.. ఇలా హుష్‌కాకి!

పట్టుచీరల తయారీ కార్మికులకు టీడీపీ ప్రభుత్వం ఇస్తున్న రూ.రెండు వేలు ఇన్సెంటివ్‌ను కొనసాగిస్తానని ప్రజాసంకల్ప యాత్రలో మాటిచ్చారు. కానీ, ఓట్లు పడగానే తూచ్ అనేశారు.

చేనేత మహిళలకు 45 ఏళ్లకే పెన్షన్, వడ్డీ లేని రుణం ఇస్తానని నమ్మకంగా చెప్పారు. కానీ, అధికారంలోకి రాగానే నిబంధనల కొర్రీలతో లబ్ధిదారులను వంచించారు.



రూ.లక్ష రూపాయలను వడ్డీ లేకుండా చేనేత కార్మికుడికి బ్యాంకుల నుంచి ఇప్పిస్తానని, ఒకవేళ బ్యాంకులు ముందుకు రాకపోతే హ్యాండ్లూమ్ కార్పొరేషన్ నుంచి అప్పు అందిస్తానని జగన్ నమ్మబలికారు. కానీ, అధికారంలోకి రాగానే షరామామూలుగానే మడమ తిప్పేశారు.

మసిపూసి మారేడుకాయ చేసెన్! (మాట తప్పిన జగన్)

చేనేతను చిదిమేశారు!

రూ.లక్ష వడ్డీ లేని రుణం ఎక్కడ జగన్?

'నేతన్న నేస్తం' అమలులో నిబంధనల కొర్రీలు

లక్షల్లో లబ్ధిదారులు.. కొన్ని వేల మందికే సాయం

అందులోనూ అద్దె మగ్గాలకు మొండిచేయి

నెల ఆదాయంలో 8% కార్మికుడు పొదుపుచేస్తే అంతే మొత్తం సర్కారు ఇచ్చేలా టీడీపీ 'త్రిఫ్ట్' స్కీమ్

రాగానే రద్దుచేసిన జగన్ ప్రభుత్వం

పట్టుచీరల కార్మికులకు 2వేలు ఇన్సెంటివ్ కట్

బ్యాంకులు ఇవ్వకపోతే కార్పొరేషన్ ఇస్తుందని హామీ

చేనేత మహిళల పింఛను హామీకీ తూట్లు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత గ్రామీణ ప్రజానీకానికి ఎక్కువ ఉపాధి కల్పిస్తున్న రంగం చేనేత. లక్షన్నరకు పైగా మగ్గాలున్న మన రాష్ట్రంలో మూడున్నర లక్షలమంది చేనేత అనుబంధ రంగాల్లో జీవనోపాధి పొందుతున్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అధికారంలోకి రాగానే చేనేత వస్త్రాలు స్వయంగా ధరించడంతోపాటు ఆ రంగానికి జవజీవాలు నింపారు. చంద్రబాబు ప్రభుత్వం చేనేత రంగానికి ఊతమిస్తూ మార్కెటింగ్ సదుపాయాలు కల్పించింది. ఆప్కోను బలోపేతం చేసి రిబేటు అమలుచేసింది. రాష్ట్రంలోని 800చేనేత సహకార సంఘాల్లోని కార్మికుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త పడింది. అందులో సభ్యులైన కార్మికులకు 'త్రిఫ్ట్' పథకాన్ని ప్రవేశపెట్టి నేత కార్మికులు నెలవారీ ఆదాయంలో ఎనిమిది శాతం పొదుపు చేస్తే అందుకు సమానంగా ప్రభుత్వం మరో ఎనిమిది శాతం కలిపేది. పట్టు చీరలు నేసే కార్మికులకు ముడిసరుకు రాయితీగా నెలకు రూ.రెండు వేలు చెల్లించేది. ఇలా గత ప్రభుత్వం వీలైనంత మేరకు చేనేతలకు ప్రోత్సాహం అందిస్తుంటే అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్, అవన్నీ తీసేశాడు. కానీ తానే చేనేత రంగాన్ని ఉద్ధరిస్తున్నట్లు రోత పత్రికలో భారీ ప్రకటనలు ఇస్తూ వంచిస్తున్నారు.

ఇదీ జగన్ మోసం..

జగన్ గత ఎన్నికలకు ముందు ఓట్ల కోసం చేనేత కార్మికులందరికీ పెన్షన్ ఇస్తానంటూ హామీ ఇచ్చి, అమల్లోకి వచ్చే సమయానికి ఆరు దశల్లో వడపోశారు. సొంత మగ్గం ఉండాలని, అద్దె మగ్గాలకు వర్తించబోదని, కరెంటు బిల్లు తక్కువ ఉండాలని, సొంత ఇల్లు లేనివారికేనని, వ్యవసాయ భూమి లేకుంటేనే ఇస్తామని...ఇలా కొర్రీలు పెట్టి 'నేతన్న నేస్తం' ఒక్కటే అమలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3.50లక్షల మంది చేనేత కార్మికులు, అందులో పనిచేసే వారు దరఖాస్తు చేసుకోగా, 81వేల మందికి మాత్రమే ఇచ్చారు. అద్దె మగ్గాలపై కూలీ పని చేసుకుంటే తాము చేనేత కార్మికులం కాదా.? మిమ్మల్ని నమ్మి ఓటేశాం జగనన్నా.. మోసం చేయకు.. అంటూ కన్నీరు పెట్టుకున్న నేతన్నల రోదన జగనన్నను కదిలించలేక పోయింది.

ఐదేళ్లలో 3 బండలు..

జగన్ హామీలు నమ్మి మూడు రెక్కల ఫ్యాన్‌కు ఓటేసినప్పటి నుంచి చేనేత రంగంపై మూడు బండలు పడ్డాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో రూ. మూడు వేల కోట్లకు పైగా చేనేత రంగం నష్టపోయిందని ఆ వర్గాలు వాపోతున్నాయి.

1 2020లో వచ్చిన కరోనా వల్ల ఆంక్షలు పెట్టడంతో పనిలేక చేనేత కార్మికులు ఆకలితో అలమటించారు. ఆ తర్వాతి ఏడాది కూడా అదే ప్రభావం పడటంతో బతకడానికి కూలీ పనులకు వెళ్లారు.



2 ఆప్కోను ప్రక్షాళన చేస్తానంటూ చేనేత సహకార సంఘాలను నిర్వీర్యం చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జగన్ బొమ్మ వేసి ఇస్తోన్న యూనిఫామ్ చేనేత నుంచి కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన మరమగ్గాల నుంచి కొనుగోలు చేశారు. వేల కోట్ల ఆర్డర్ అటు పోవడంతో ఏపీలోని చేనేత సొసైటీల్లో వస్త్ర నిల్వలు పేరుకు పోయాయి.సకాలంలో అప్పులు చెల్లించకుండా ప్రభుత్వ శాఖలు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో కార్మికులు ఉపాధిలేక రోడ్డున పడ్డారు.

3 చేనేత వస్త్రాలపై ఐదు శాతం జీఎస్టీ, ముడిసరుకుపై 18శాతం పన్ను పడటంతో వస్త్రాల ధరలు పెంచాల్సి వచ్చింది. ఫలితంగా అమ్మకాలు తగ్గిపోయి భారీగా నష్ట పోయారు.



నోట్ దిస్ పాయింట్!



అత్యధిక మహిళా ఓటర్ల జిల్లా కర్నూలు
10,19,597

అతి తక్కువ.. అల్లూరి సీతారామరాజు
3,94,832

అత్యధిక మహిళా ఓటర్లున్న అసెంబ్లీ భీమిలి

అతి తక్కువ మహిళా ఓటర్లు.. పెడన
83,525

ది లీడర్



సంక్షేమ హాస్టళ్లు ఆయన చలువే!

అసెంబ్లీలో 18 గంటలపాటు ప్రసంగం

ఆత్మస్తుతి, పరనింద, కొండకచో ప్రత్యర్థులపై కొంత పరుష పదజాల ప్రయోగం! ఇదీ.. ఇప్పుడు శాసనసభ జరుగుతున్న తీరు! ఆలోచింపజేసే మాటలు, కొత్త ఆలోచనలు, ప్రజలకు మేలు చేసే పథకాలకు సంబంధించిన ప్రతిపాదనలు! ఇది ఒకప్పుడు అసెంబ్లీ జరిగిన తీరు! అలాంటి రోజుల్లో ఒక నాయకుడు అసెంబ్లీలో ఏకధాటిగా 18 గంటలు ప్రసంగించారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటుకు కారణమయ్యారు. ఆయనే.. బీవీ రమణయ్య! అమలాపురం పట్టణానికి చెందిన రమణయ్య స్వచ్ఛమైన అంబేడ్కర్ వాది. అంబేడ్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) తరఫున అప్పటి అల్లవరం ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1967లో ఎమ్మెల్యేగా గెలిచారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు మాట దేవుడెరుగు. ప్రాథమిక విద్యకు సైతం దూరమైపోతున్నారని ఆయన గుర్తించారు. ప్రభుత్వపరంగా వసతి గృహాలు ఏర్పాటు చేస్తే దళిత, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని ఆయన భావించారు. 1970లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇదే అంశంపై మైక్ అందుకున్న బీవీ రమణయ్య ఏకధాటిగా 18 గంటల పాటు ప్రసంగించారు. సామాజిక అంశాన్ని, అణగారిన వర్గాల వారి సమస్యను ఆయన వివరిస్తుండగా... మిగిలిన శాసన సభ్యులు మనసు పెట్టి విన్నారు. మరీ ముఖ్యంగా నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి చలించిపోయారు. రమణయ్య సూచనల మేరకు ఒకటి నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్యనందించేందుకు, ప్రభుత్వ వసతి గృహాలను ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు. అప్పటి నుంచే సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖల వసతి గృహాలు అందుబాటులోకి వచ్చాయి. అసెంబ్లీలో రమణయ్య ప్రసంగాలను కొన్ని ఏళ్లపాటు ఎమ్మెల్యేలు గుర్తుకు తెచ్చుకునేవారు. అసెంబ్లీలో ఏకధాటిగా 18 గంటలు మాట్లాడిన రికార్డు ఆయనదే!

- అమలాపురం టౌన్

వైసీపీలో వారసుల హల్‌చల్!

చెవిరెడ్డి, భూమన, పేర్ని, బలరాం కొడుకులకు టికెట్లు

ముత్యాలనాయుడు, నారాయణస్వామి, ముస్తఫా కుమార్తెలకూ

బొత్స కుటుంబంలో ఏకంగా నలుగురికి చాన్సు



అభినయ్‌రెడ్డి



చెట్టి తనూజారాణి



కరణం వెంకటేశ్



కృపాలక్ష్మి



షేక్ నూర్ ఫాతిమా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరఫున ఈ సారి కొందరు కీలక నేతల వారసులు బరిలోకి దిగుతున్నారు. వారసులకు టికెట్లు ఇవ్వనని గతంలో గంభీరంగా ప్రకటించిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. ఇప్పుడు పలువురు ఎమ్మెల్యేలు, మంత్రుల కుమారులు, కుమార్తెలకు, కోడళ్లకు సీట్లు కట్టబెట్టడం గమనార్హం. ఒకే కుటుంబంలో ఇద్దరి నుంచి నలుగురి వరకు టికెట్లు దక్కాయి. చంద్రగిరిలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి కొడుకు మోహిత్‌రెడ్డి, తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి కొడుకు అభినయ్‌రెడ్డి, మచిలీపట్నంలో పేర్ని నాని కొడుకు కృష్ణమూర్తి, చీరాలలో కరణం బలరాం కొడుకు వెంకటేశ్.. మాడుగులలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కుమార్తె అనూరాధ, గంగాధర నెల్లూరు (ఎస్సీ)లో మరో డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి, గుంటూరు తూర్పులో షేక్ ముస్తఫా కుమార్తె షేక్ నూర్ ఫాతిమాకు అసెంబ్లీ టికెట్లు ఇచ్చారు. అరకులోయ (ఎస్టీ) ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ కోడలు తనూజారాణిని అరకు (ఎస్టీ) లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కోడలు మురుగుడు లావణ్యను మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థిగా బరిలో దింపారు.



భాస్కరరెడ్డి (ఒంగోలు ఎంపీ) మోహిత్‌రెడ్డి (చంద్రగిరి అసెంబ్లీ)



బూడి ముత్యాలనాయుడు (అనకాపల్లి ఎంపీ) అనురాధ (మాడుగుల)



కారుమూరి నాగేశ్వరరావు (తణుకు) సునీల్ (ఏలూరు ఎంపీ)

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒంగోలు లోక్‌సభకు, ముత్యాలనాయుడు అనకాపల్లి లోక్‌సభకు వైసీపీ అభ్యర్థులుగా పోటీచేస్తుండడం గమనార్హం. మరోవైపు.. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తణుకు నుంచి అసెంబ్లీకి పోటీచేస్తుండగా.. ఆయన కుమారుడు సునీల్ కుమార్ ఏలూరు లోక్‌సభ స్థానానికి పోటీచేస్తున్నారు. వీరి ఇళ్లలో రెండేసి టికెట్లు అన్న మాట.



ఆదిమూలపు సురేశ్, సతీశ్

మంత్రి ఆదిమూలపు సురేశ్ ప్రకాశం జిల్లా కొండపి (ఎస్సీ) నుంచి పోటీచేస్తుండగా.. ఆయన సోదరుడు ఆదిమూలపు సతీశ్ కర్నూలు జిల్లా కోడుమూరు (ఎస్సీ) స్థానం నుంచి బరిలోకి దిగుతున్నారు.



అంబటి రాంబాబు, మురళి

పల్నాడు జిల్లా సత్తెనపల్లి నుంచి మంత్రి అంబటి రాంబాబు మళ్లీ పోటీ చేస్తుండగా.. ఆయన సోదరుడు అంబటి మురళి గుంటూరు జిల్లా పొన్నూరు నుంచి బరిలోకి దిగుతున్నారు.

కడప జిల్లా పులివెందుల నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పోటీ చేస్తుంటే.. ఆయన మేనమామ పి.రవీంద్రనాథరెడ్డి కమలాపురం నుంచి.. సీఎం సోదరుడు వైఎస్ అవినాశ్‌రెడ్డి కడప లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగుతున్నారు.





ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్

శ్రీకాకుళం అసెంబ్లీ స్థానంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, అదే జిల్లా నరసన్నపేట నుంచి ఆయన సోదరుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పోటీ చేస్తున్నారు.



బొత్స ఝాన్సీలక్ష్మి

మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబానికి జాక్‌పాట్ తగిలింది. విజయనగరం జిల్లా చీపురుపల్లి అసెంబ్లీ స్థానం నుంచి ఆయన, గజపతినగరంలో ఆయన సోదరుడు బొత్స అప్పలనర్సయ్య, నెల్లిమర్లలో ఆయన సమీప బంధువు బడ్డుకొండ అప్పలనాయుడు పోటీ చేస్తుండగా.. విశాఖ లోక్‌సభ స్థానం నుంచి బొత్స భార్య ఝాన్సీలక్ష్మి బరిలోకి దిగుతున్నారు.



బడ్డుకొండ అప్పలనాయుడు బొత్స అప్పల నర్సయ్య

ఆనాటి ముచ్చట

గెలిచింది 175 ఎమ్మెల్యేలు 250

1970ల్లో భారీఎత్తున పార్టీల ఫిరాయింపులు ఉండేవి. ఈ రోజు ఒక పార్టీలో ఉన్నవారు రేపు ఏ పార్టీలో ఉంటారో చెప్పలేని పరిస్థితి. అప్పట్లో ఇందిరా కాంగ్రెస్, పాత కాంగ్రెస్ నడుమ ఈ జంపింగ్‌లు యథేచ్ఛగా సాగేవి. (ఉమ్మడి) ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే జాడ్యం ఉండేది. 1978 అసెంబ్లీ ఎన్నికల్లో ఇందిరా కాంగ్రెస్ (కాంగ్రెస్-ఆర్) 175 స్థానాల్లో విజయం సాధించింది. జనతా పార్టీ 60, కాంగ్రెస్ (ఆర్గనైజేషన్) 30 చోట్ల గెలిచాయి. ఐదేళ్లలో నలుగురు సీఎంలు (మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య, భవనం వెంకట్రామ్, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి) మారారు. ఇదే సమయంలో ఫిరాయింపులు కూడా జోరందుకున్నాయి. 1982 నాటికి ఇందిరా కాంగ్రెస్ బలం 250కి చేరడం విశేషం. జనతా, కాంగ్రెస్ (ఓ) ల నుంచి దరిదాపుగా 75 మంది ఈ పార్టీలో చేరిపోయారు.



గంటా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరిన కుసులవాడ పంచాయతీ సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు

జగన్ ఉన్నా.. జంపయ్యారు!

- విశాఖ వైసీపీకి భారీ షాక్
- భీమిలి పరిధిలోని ఒక పంచాయతీ కార్యవర్గం మొత్తం పార్టీకి గుడ్‌బై
- 500 కుటుంబాలు వైసీపీకి దూరం
- గంటా సమక్షంలో టీడీపీలో చేరిక
- ఆదివారం రాత్రి అక్కడే జగన్ బస

విశాఖపట్నం/ఆనందపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి భీమిలి నియోజకవర్గం పరిధిలో బస చేసిన సీఎం, వైసీపీ అధినేత జగన్‌కు సొంత పార్టీ నాయకులు గుడ్‌బై చెప్పారు. నియోజకవర్గం పరిధిలోని ఆనందపురం మండలం కుసులవాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ ఆల్తి రామారావు, వార్డు సభ్యులతో పాటు గ్రామానికి చెందిన 500 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. కుసులవాడ పంచాయతీ సర్పంచ్ వెంకటలక్ష్మి.. భర్త శివాజీ జగన్ మీడియా ఆనందపురం మండల విలేకరిగా ఉన్నారు. అయితే, వైసీపీ పాలనపై విసుగుచెందిన శివాజీ ఆదివారం ఆ మీడియాకు కూడా రాజీనామా చేసి, తన భార్య, సర్పంచ్ వెంకటలక్ష్మి, ఇతర వార్డు సభ్యులతో కలిసి తెలుగుదేశంలో చేరారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జగన్ పాలన పట్ల ప్రజలంతా తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్ర ప్రజానీకాన్ని దగా చేశారని ఆరోపించారు.

టీడీపీ అధినేత చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో గ్రామాలకు గ్రామాలు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కాగా, సీఎం జగన్ స్థానికంగా బస చేసిన సమయంలోనే ఇన్ని వందల కుటుంబాలు పార్టీకి దూరం కావడం నేతల్లో కలవరం రేపింది. ఒక్కరంటే ఒక్కరు కూడా సీఎం జగన్‌ను పట్టించుకోకపోవడంపైనా స్థానికంగా చర్చ జరిగింది.

విశాఖలో జగన్ రోడ్ షో



విశాఖ నగర పరిధిలోని నాయుడుతోట ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన రోడ్ షోలో బస్సుపై నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి జగన్

ప్రసంగాలు లేవు...అభివాదాలతో సరి

- విశాఖలో ముగిసిన జగన్ బస్సు యాత్ర

విశాఖ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సీఎం జగన్ విశాఖలో ఆదివారం తన రోడ్‌షోను ప్రసంగాలు లేకుండా కేవలం అభివాదాలతోనే ముగించేశారు. పెందుర్తి నియోజకవర్గం నుంచి ప్రారంభమైన జగన్ బస్సు యాత్ర విశాఖ పశ్చిమ, ఉత్తరం, దక్షిణం, తూర్పు నియోజకవర్గాల మీదుగా భీమిలి నియోజకవర్గం పరిధిలో ముగిసింది. అయితే జగన్ కొన్నిచోట్ల బస్సుపైన నిలబడి, మరికొన్నిచోట్ల లోపల కూర్చొని ప్రజలకు అభివాదం చేశారు. రెండు,మూడు చోట్ల బస్సు ఆపి వినతిపత్రాలు అందుకున్నారు. ఎక్కడా ప్రజలను ఉద్దేశించి మాట్లాడకపోవడం, తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కనీసం కోరకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది.

సింహాలు కాదు.. పందికొక్కులు!

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యం నుంచి వచ్చారో తెలియదు, సింహం సింగిల్‌గా వస్తుందంటాడు.. కానీ రాష్ట్రాన్ని దోచుకున్న పందుకొక్కుల సమూహం మీది. మీ అందరికీ డబ్బులు, అధికారం, అహంకారం ఎక్కువయ్యాయి. సజ్జలను హెచ్చరిస్తున్నా.. మా అన్న చిరంజీవి అజాత శత్రువు.. ఆయన జోలికి గానీ, శెట్టి బలిజ, కాపు, ఎస్సీ, ఎస్టీ.. ఇలా ఏ సామాజికవర్గం జోలికి గానీ వచ్చినా ఊరుకోను. చిరంజీవి జనసేనకు రూ.5 కోట్లు ఇచ్చి, ఆయన కుమారుడు రామ్‌చరణ్‌ను కూడా విరాళం ఇవ్వమని చెప్పినందుకు రాజకీయం చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీఎం రమేశ్ (అనకాపల్లి లోక్‌సభ), పంచకర్ల రమేశ్ బాబు (పెందుర్తి)ను గెలిపించాలని సోషల్ మీడియా వేదికగా చిరంజీవి చెబితే.. సజ్జలా నీకెందుకంత బాధ? ఒక్కసారి అద్దాల్లో మీ ముఖాలు చూసుకోండి. సింహాల్లా కాదు.. గుంట నక్కల్లా ఉన్నారు. మీరు కలుగుల్లో పందికొక్కుల సమూహం.. చంద్రబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పిన సూపర్ స్టార్ రజనీకాంత్‌ను కూడా తిడుతున్నారు. ఒకప్పుడు చంద్రబాబు చాలా సాఫ్ట్‌గా ఆలోచించేవారు. జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత చాలా మార్పు వచ్చింది. దుర్మార్గులపై కఠినంగా ఉండాలని నిర్ణయానికి వచ్చారు. ఆయనకు నేను తోడు. జగన్ అండ్ కోకు ఎదురుదెబ్బ తప్పదు. నరసాపురం గడ్డ నుంచి చెబుతున్నా.. సజ్జలా.. నువ్వు, మీ జగన్ పద్ధతులు మార్చుకోండి. లేదంటే కూటమి అధికారంలోకి వచ్చాక రోడ్డుపై మోకాళ్లపై దేకిస్తా' అని స్పష్టం చేశారు. ఇంకా ఏమన్నారంటే..

వ్యక్తిగత జీవితాల గురించి ఎందుకు?

ముగ్గురు పెళ్లాలంటావేంట్రా మూర్ఖుడా.. వ్యక్తిగత జీవితాల గురించి ఎందుకు మాట్లాడుతున్నావ్? ప్రతి జీవితంలో ఒడిదొడుకులుంటాయి. సమస్యలు లేని కుటుంబం ఎక్కడుంటుంది? మీ సతీమణి భారతిని నీ పెళ్లాం అంటే నీకు కోపం రాదా..? వ్యక్తిగత జీవితాల జోలికొస్తే ఊరుకునేది లేదు. ఈ సీఎంకు రౌడీ గ్యాంగులు, బ్లేడ్‌బ్యాచ్‌లున్నాయి, వంతపాడే అధికారులున్నారు. ఈయనలా నాది రాజకీయాల్లో మూడో తరం కాదు.. మొదటి తరం. కింది స్థాయి కుటుంబం నుంచి వచ్చాను. పార్టీ పెట్టాను. రెండు చోట్ల ఓడిపోయాను. దెబ్బలు పడ్డా, రాజకీయాలు నుంచి పారిపోలేదు. పదేళ్ల పాటు పార్టీని నిలబెట్టాను. జగన్ అధికారంలోకి వచ్చాక రౌడీ మూకలు పెరిగిపోయాయి. చంద్రబాబు సతీమణిని, షర్మిలను, చివరకు పినతండ్రి కుమార్తె చెల్లెలు సునీతనూ వదలలేదు. జగన్‌కు మళ్లీ అధికారమిస్తే ఆస్తులు కూడా మిగలవు. ఆస్తులపై ఆంధ్ర ప్రభుత్వ రాజముద్ర ఉండాలి. కానీ జగన్ బొమ్మ ఉంటుంది. ఆస్తులన్నీ డిజిటలైజేషన్ చేశాడు, ప్రభుత్వ ఆస్తులను అమ్మేశాడు, మళ్లీ అధికారమిస్తే ప్రైవేటు ఆస్తులనూ తాకట్టు పెట్టేస్తాడు. జగన్‌కు వంతపాడుతున్న నాయకులను ఇదే హెచ్చరిస్తున్నా.. మీ ఆస్తులూ దక్కవు. మళ్లీ ఆయనకు చాన్సిస్తే ఆడబిడ్డల మాన ప్రాణాలకు రక్షణ ఉండదు. ఆలోచించి ఓటేయండి.. ఎన్డీయేని గెలిపించండి.

> జగన్ కులాలను విడగొట్టి రాజకీయం చేయాలని చూస్తున్నాడు. కానీ నేను ఏకం చేస్తాను. నేను ఓటు బ్యాంకు రాజకీయాలు చేయను.. భారత రాజ్యాంగాన్ని నమ్మి రాజకీయం చేస్తున్నా.
>
> జగన్‌లా నాపై 32 కేసులు లేవు. నా తెగింపు ఏమిటో ఆయనకు తెలియదు. ఆయన ఊహించుకునేదానికి పదిరెట్లు ఉంటుంది. ఆయనలా చిల్లర రాజకీయాలు చేయను. - పవన్ కల్యాణ్



జగన్ గొడుకు కిందకు వెళ్తే ఎవరైనా రౌడీలే

జగన్ గొడుగు కిందకు వెళ్లిన వారంతా రౌడీలుగా మారిపోతున్నారు. జక్కంపూడి రాజా నుంచి ముదునూరి ప్రసాదరాజు వరకు ఎవరైనా ఇంతే. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకుతిన్నారు, కోట్లు సంపాదించారు. బ్లేడ్ బ్యాచ్, రౌడీలను అడ్డం పెట్టుకుని విధ్వంసం సృష్టించారు. ఇక మీ రౌడీయిజం ఆపండి. నేను బయటకు రాగానే జగన్ కాపలా కుక్కలు బూతులు మాట్లాడతారు. సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేస్తారు. ఎన్నికల సమయంలో ఎర్రి గొర్రి వేషాలు వేస్తే తాట తీస్తాం. ఇప్పటి వరకు రాజకీయం వేరు.. ఇక నుంచి రాజకీయం వేరు. ఇప్పటి వరకు బూతుల అసెంబ్లీ చూశారు, ఆడపడుచులు, మహిళలపై నీచంగా మాట్లాడారు, ఇంట్లో నుంచి బయటకు రాని ఆడబిడ్డలను తిట్టే బ్యాచ్ మీది. మేం వచ్చాక అసెంబ్లీ పనితీరు ఎలా ఉంటుందో చేసి చూపిస్తాం. నా ఆశయం ఒక్కటే.. రాష్ట్రాన్ని బాగు చేయడం. అందుకు ఎన్డీయేకి ఓటేయండి.. 5 కోట్ల ఆంధ్రుల భవిష్యత్ కోసం బీజేపీ పెద్దలను ఒప్పించి.. పొత్తు కోసం నేను తగ్గాను. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేస్తాం. పోలవరాన్ని నిర్మిస్తాం. అన్న క్యాంటీన్లతో సమానంగా డొక్కా సీతమ్మ క్యాంటీన్లు కూడా ఏర్పాటు చేసి పేదల కడుపు నింపుతాం.

మత్స్యకారులకు 10 లక్షల బీమా..

ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక మత్స్యకారులకు ఏ ప్రమాదం జరిగినా రూ.10 లక్షలు బీమా కల్పిస్తాం. మత్స్యకార వృత్తికి ప్రమాదంగా మారిన 217 జీవోను రద్దు చేస్తాం. మత్స్యకార సొసైటీలకు పూర్తి స్థాయిలో రుణాలందిస్తాం. గౌడ, శెట్టిబలిజలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేస్తాం. మీరు చేయాల్సింది ఒక్కటే.. ఈ ఎన్నికల్లో మాకు అండగా నిలబడండి. జగన్ అధికారంలోకి వచ్చి ఆక్వా రైతులను ముంచేశాడు. విద్యుత్ యూనిట్ ధరను రూ.5కు పెంచాడు. హేచరీలకు రూ.8 చేశాడు.. రొయ్య రైతులకు గిట్టుబాటు లేకుండా చేశాడు. కూటమి అధికారంలోకి రాగానే ఆక్వా రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తాం. ధరలను పెంచేందుకు కృషి చేస్తాం. రాయితీలు, విద్యుత్ సబ్సిడీలు కల్పిస్తాం.

అవినాశ్ నేరచరిత్రపై జగన్ వివరణ ఇవ్వాలి



- వివేకా హత్య కేసు నిందితులకు ఓట్లు వేయొద్దు
- న్యాయం జరగాలంటే పోరాడే శక్తి కావాలి: సునీత

వేంపల్లె, ఏప్రిల్ 21: నేరచరిత్ర ఉన్న అవినాశ్‌రెడ్డి అఫిడవిట్‌లో పొందుపరిచిన కేసుల వివరాలపై వైసీపీ అధ్యక్షుడిగా సీఎం జగన్మోహన్‌రెడ్డి వివరణ ఇవ్వాలని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత డిమాండ్ చేశారు. వివేకా హత్య కేసులో నిందితులుగా ఉన్న వ్యక్తులకు ఓట్లు వేయొద్దని వైఎస్, వివేకా అభిమానులు అందరికీ చెప్పాలని కోరారు. ఆదివారం వేంపల్లెలోని పీసీసీ మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి స్వగృహంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో పోటీచేసే వ్యక్తులపై క్రిమినల్ కేసులు ఉంటే అభ్యర్థి ఆ విషయాన్ని అఫిడవిట్‌లో పొందుపరచాలని అన్నారు. అటువంటి వ్యక్తికి ఎందుకు టికెట్ ఇచ్చారో పార్టీ అధ్యక్షుడు ప్రకటించాలన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసిన 48 గంటల్లోగా స్థానిక, జాతీయ పత్రికల్లో ఈ విషయాన్ని ప్రకటించాలని ఎన్నికల నిబంధనలు ఉన్నాయన్నారు. వైసీపీ అభ్యర్థుల క్రిమినల్ సమాచారాన్ని పార్టీ వెబ్‌సైట్‌లో, సోషల్ మీడియాలో పెట్టారా..? అని జగన్‌ను ప్రశ్నించారు. హత్య కేసులో నిందితుల వైపు ఉంటారో లేక ధర్మం వైపు ఉంటారో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. కడప ఎంపీగా షర్మిలరెడ్డి, పులివెందుల ఎమ్మెల్యేగా ధ్రువకుమార్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, ఈ ఇద్దరినీ గెలిపించేందుకు హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

ఇటీవల బస్సు యాత్రలో జగనన్న మీద రాయి విసిరాడనే నెపంతో పిల్లాడిపై పోలీసులు హత్యాయత్నం కింద నాన్‌బెయిలబుల్ కేసును పెట్టారన్నారు. అయితే పులివెందుల నియోజకవర్గంలోని మురారిచింతలలో వృద్ధ దంపతులపై వైసీపీ నాయకులు దాడిచేస్తే వారిపై మాత్రం బెయిలబుల్ కేసు పెట్టడం ఎంతవరకు న్యాయమో చెప్పాలని ప్రశ్నించారు. ఈ దాడి విషయాన్ని తాను బయటకు తేవడంతో అవినాశ్‌రెడ్డికి, వైసీపీకి భయం పట్టుకుందన్నారు.

విద్యుత్ డిమాండ్ పైపైకి



అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలు మండిపోతుండడంతో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. శని, ఆదివారాల్లో రికార్డు స్థాయిలో 250 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. బహిరంగ మార్కెట్లో రూ.27 కోట్లను చెల్లించి 36.155 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను డిస్కమ్‌లు కొనుగోలు చేశాయి. స్వాప్‌లో మరో 4.9 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను పొందాయి. ఇంకోవైపు.. జెన్కో విద్యుత్కేంద్రాల్లోని బొగ్గు నిల్వలు తగ్గిపోతున్నాయి. వీటీపీఎస్‌లో 2.30 రోజులు, ఆర్టీపీపీలో 3.55 రోజులు, కృష్ణపట్నంలో 4.30 రోజులు, హిందూజాలో 1.75 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నాయి. సెయిల్‌లో మాత్రం 14.64 రోజులకు అవసరమైన బొగ్గు నిల్వలున్నాయి.

మన యుద్ధం రాక్షసులతో!

(మొదటి పేజీ తరువాయి)

గులకరాయి దాడి చేయించానని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఘటన జరిగిన కొద్ది క్షణాలకే ప్లకార్డులు పట్టుకుని వచ్చి ధర్నాలు చేశారు. రాయి విసిరాడంటున్న వ్యక్తితో బొండా ఉమామహేశ్వరరావు ప్రమేయం ఉందని చెప్పించేందుకు కుట్రలు చేస్తున్నారు. పెన్షన్ల పంపిణీకి నిధుల్లేకుండా చేశారు. కానీ వలంటీర్లతో పంపిణీ చేయొద్దనడంతోనే పెన్షన్లు ఆగిపోయాయని విషప్రచారం చేశారు. జగనే అందరినీ అంతం చేయడానికి ప్రయత్నిస్తూ.. తనను అంతం చేయడానికి వస్తున్నారంటూ ఎదుటివారిపై బురద జల్లుతున్నారు. అమరావతి, పోలవరాన్ని విధ్వంసం చేశారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్నారు' అని విరుచుకుపడ్డారు.



పార్టీ బీ ఫారం అందుకున్న తర్వాత చంద్రబాబుకు పాదాభివందనం చేస్తున్న లోకేశ్

'ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలవాలి'

బీఫాం పొందిన ప్రతి ఒక్కరూ గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రజలు, కార్యకర్తల అభీష్టం మేరకే అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. 'రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితుల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలవాలన్నదే మన నినాదం. మూడు పార్టీల మధ్య సమన్వయం ఉండాలి. ఓటు బదిలీ జరగాలి' అని ఉద్బోధించారు. తాను ఇప్పటికి 40కి పైగా ప్రజాగళం సభలు నిర్వహించానని, పవన్ కల్యాణ్‌తోనూ కలిసి సభలు నిర్వహించానని గుర్తుచేశారు. అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

147 మంది అభ్యర్థులు హాజరు

జనసేన, బీజేపీలతో పొత్తుల కారణంగా 144 అసెంబ్లీ స్థానాల్లో, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీచేస్తున్న సంగతి తెలిసిందే. వీరిలో 17 మంది ఎంపీ అభ్యర్థులూ ఉండవల్లి వచ్చి తొలుత బీ ఫారాలు తీసుకున్నారు. అసెంబ్లీ అభ్యర్థుల్లో 144 మందికిగాను 130 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో 14 మంది గైర్హాజరయ్యారు. అనపర్తి టికెట్‌తో ముడిపడి ఉండడం.. తంబళ్లపల్లె, దెందులూరు అభ్యర్థులను ఇంకా ఖరారు చేయకపోవడంతో వారిని పిలవలేదు. మంగళగిరి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లోకేశ్ కూడా చంద్రబాబు నుంచి బీ ఫారం స్వీకరించి, తండ్రి కాళ్లకు నమస్కరించి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

ఉండి టికెట్ రఘురామకే

- బండారుకు మాడుగుల
- ఐదుగురు టీడీపీ అభ్యర్థుల మార్పు
- తంబళ్లపల్లె, దెందులూరు సీట్లు పెండింగ్

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఐదుగురు అసెంబ్లీ అభ్యర్థులను టీడీపీ నాయకత్వం మార్చింది. వెంకటగిరి, ఉండి, మాడుగుల, పాడేరు(ఎస్టీ), మడకశిర (ఎస్సీ) స్థానాల్లో ఈ మార్పులు జరిగాయి. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు స్థానంలో నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజుకు అవకాశం దక్కింది. పెందుర్తిని జనసేనకు కేటాయించడంతో అక్కడ మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తికి అవకాశం లభించలేదు. దీంతో మాడుగుల స్థానాన్ని ఆయనకు కేటాయించారు. పాడేరు టికెట్‌ను గతంలో వెంకట రమేశ్‌నాయుడికి కేటాయించగా.. తాజాగా ఆయన్ను మార్చి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి అవకాశం కల్పించారు. మడకశిరను సునీల్‌కుమార్ స్థానంలో ఎంఎస్ రాజుకు కేటాయించారు. వెంకటగిరి స్థానాన్ని మొదట మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మీ సాయిప్రియకు కేటాయించారు. అయితే ఇప్పుడు రామకృష్ణనే ఖరారు చేసి బీఫాం అందించారు. కాగా.. పెండింగ్‌లో ఉన్న అనపర్తి టికెట్ వ్యవహారం పరిష్కారమైంది. అక్కడి టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీలో చేరి ఆ పార్టీ తరఫున పోటీ చేయడానికి సమ్మతించారు. నల్లమిల్లి చేరిక, టికెట్ ఖరారుపై బీజేపీ నుంచి అధికారిక ప్రకటన వెలువడ్డాక దెందులూరు, తంబళ్లపల్లె అభ్యర్థులపై టీడీపీ నిర్ణయం వెలువడనుంది. దెందులూరులో టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేరు గతంలోనే ప్రకటించారు. ఆయనకు సోమవారం బీఫారం ఇచ్చే అవకాశముందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అలాగే తంబళ్లపల్లె అభ్యర్థిగా జయచంద్రారెడ్డి కొనసాగించడంపై సందేహాలు నెలకొన్నాయి. ప్రత్యామ్నాయంగా సరళారెడ్డి, శంకర్ యాదవ్, కొండా నరేంద్ర పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇక్కడ కూడా సోమవారం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇంకోవైపు.. రఘురామరాజు కోసం ఉండి సీటు వదులుకున్న మంతెన రామరాజును నరసాపురం పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు అక్కడ పార్లమెంటు అధ్యక్షురాలిగా కొనసాగిన మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మిని పొలిట్‌బ్యూరోలోకి తీసుకున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన కొమ్మి లక్ష్మయ్యనాయుడిని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు.

బకాయిలపై సంఘాలు స్పందించాలి

- డీఏ, పీఆర్సీ బకాయిలపై ఉద్యోగుల్లో ఆందోళన
- ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ



అనంతపురం విద్య, ఏప్రిల్ 21: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 వేల కోట్ల వరకు బకాయి పడిందని, వీటిపై ఉద్యోగ సంఘాలు స్పందించాలని ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ కోరారు. అనంతపురంలో ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యవేదిక చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.25 వేల కోట్ల చెల్లింపు ఆగిపోయినా ఉద్యోగ సంఘాలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. వేల కోట్ల బకాయిలు ఎలా చెల్లిస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగులకు కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని, వాటికి సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చినా ఇంకా చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఏర్పడిన సమస్యలు నేటికీ అపరిష్కృతంగానే ఉన్నాయని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. సచివాలయ ఉద్యోగుల సర్వీస్ రెగ్యులరైజేషన్ ఆలస్యం కావడంతో ప్రతి ఉద్యోగికి 9 నెలల నుంచి 10 నెలల జీతం పెండింగ్‌లో ఉందని వివరించారు. అంతకుముందు సూర్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కాకపోగా, జఠిలంగా మారాయన్నారు. సంఘాల మధ్య ఉన్నది భేదాభిప్రాయాలేగానీ, వ్యక్తిగత కక్షలు కావన్నారు. కాగా, సదస్సు ఆరంభానికి ముందు ఎంపీడీఓ గీతావాణి, ఇతర అధికారులు అభ్యంతరం తెలపగా, సదస్సు గురించి ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చామని సూర్యనారాయణ వివరణ ఇచ్చారు.

పెన్షనర్లూ.. తస్మాత్ జాగ్రత్త!

- జగన్‌కు అధికారమిస్తే పెన్షన్ మర్చిపోవడమే: సుబ్బరాయన్

గుంటూరు తూర్పు, ఏప్రిల్ 21: పెన్షనర్లను అన్ని విధాలుగా మోసం చేసిన వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.సుబ్బరాయన్ అన్నారు. ఆదివారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనలో ప్రతి పెన్షనర్ రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాలందక గత ఐదేళ్లలో వేదనతో చాలమంది పెన్షనర్లు చనిపోయారన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనేకమార్లు ప్రభుత్వ పెద్దలను కలిసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. అందుకే పెన్షనర్లకు జరుగుతున్న నష్టాన్ని వివరిస్తూ, జగన్‌ను ఓడించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త ప్రచారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బి.పెద్దన్నగౌడ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మున్నయ్య మాట్లాడారు.

ప్రతి కార్యకర్త రోజుకు 200 మందిని కలవాలి

- జగన్ విధ్వంసంపై ప్రజల్లో చైతన్యం తేవాలి: చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త రోజుకు 200 మంది ఓటర్లను కలిసి సూపర్ సిక్స్ పథకాలను వివరించాలని టీడీపీ అధినేత చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల తేదీలోపు కనీసం కోటీ 60 లక్షల మందిని కలవాలని స్పష్టం చేశారు. 'బాబును మళ్లీ రప్పిద్దాం' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ఇన్ఫ్లుయన్సర్లతో టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'జగన్ అరాచక పాలనపై జనంలో చైతన్యం తేవాలి. జనసమూహాలు ఉండే ప్రాంతాల్లో జగన్ విధ్వంసపాలనా విధానాలను వివరించాలి. ఈ ఎన్నికల్లో ప్రజలు గెలవాలి, రాష్ట్రం నిలబడాలి. రాష్ట్రాన్ని వైసీపీ రహిత రాష్ట్రంగా మార్చాలని ప్రజలకు వివరించాలి. జగన్ అరాచక, విధ్వంస పాలనపై పెద్ద ఎత్తున చర్చ జరగాలి. ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేయాలి. వైసీపీ ప్రభుత్వంతో ఒక తరం నష్టపోయిందన్న విషయాన్ని ప్రజలకు వివరించాలి' అని సూచించారు. కాగా, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పార్టీ సమన్వయకర్త నాదెండ్ల బ్రహ్మంను చంద్రబాబు ఆదివారం ఫోన్‌లో పరామర్శించారు. ఆరోగ్య స్థితిపై ఆరా తీశారు.



నందికొట్కూరులో కాంగ్రెస్ నిర్వహించిన సభకు హాజరైన జనం

ప్రాణాలకు తెగించి పోరాడుతున్నాం



(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలులో అవినాశ్‌రెడ్డిని సీబీఐ అధికారులు అరెస్టు చేయడానికి వచ్చినప్పుడు ఎంత డ్రామా జరిగిందో అందరికీ తెలుసని, ఆ సమయంలో సీఎం జగన్ అడ్డుపడకుండా ఉండి ఉంటే వివేకా హత్య కేసులో నిందితులకు నేడు శిక్షపడి ఉండేదని చెప్పారు. అప్పుడు తాను, సునీత రోడ్డుపైకి రావాల్సిన అవసరమే ఉండేది కాదన్నారు. వివేకా హత్య కేసులో అవినాశ్‌రెడ్డిని సీబీఐ నిందితుడిగా చేర్చింది వాస్తవం కాదా? సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొన్న విషయాలే మాట్లాడుతున్నాం. సీబీఐ వెల్లడించాకే హత్య ఎవరు చేశారన్నది తెలిసింది. ప్రజాకోర్టులో న్యాయం జరుగుతుందని సునీత, నేను కొంగు పట్టుకుని ప్రజలను అభ్యర్థిస్తున్నాం. వివేకానందరెడ్డి ప్రజాసేవలో బతికిన వ్యక్తి. ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు ఆయన పర్సనల్ లైఫ్ గుర్తుకు రాలేదా?' అని వైసీపీ నాయకులను ఆమె నిలదీశారు. 'వివేకానందరెడ్డి సుదీర్ఘకాలం రాజకీయ నాయకుడిగా కొనసాగారు. ఆయన సేవలను జగన్ అన్ని విధాలుగా వాడుకున్నారు. చనిపోయిన వ్యక్తి, సంజాయిషీ ఇవ్వలేని వ్యక్తిగత జీవితంపై దుర్మార్గంగా మాట్లాడటం తగదు. వైసీపీ గూండాలు, మూకలకు మళ్లీ చెబుతున్నా.. వివేకా పర్సనల్ లైఫ్‌ని టార్గెట్ చేసి మాట్లాడటం మానుకోవాలి' అని షర్మిల హెచ్చరించారు.

చెల్లికి వాటా ఇవ్వాల్సిందే

ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న అప్పులపై షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆస్తిలో వాటా పొందే హక్కు ఆడబిడ్డకు ఉంటుందన్నారు. న్యాయపరంగా ఇవ్వాల్సింది పోయి.. ఏదో కొసరు ఇచ్చి దాన్ని కూడా అప్పుగా చూపించే వాళ్లను ఏమనాలి? అని ఆమె సీఎం జగన్‌పై అసహనం వ్యక్తం చేశారు. 'జగన్ నాకు అప్పు ఇచ్చారని అఫిడవిట్‌లో చూపించాను. అదే విషయంపై ఇప్పుడు క్లారిటీ ఇస్తున్నా. సమాజంలో ఏ అన్న అయినా తన చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వాల్సిందే. అది ఆడబిడ్డకు ఉన్న హక్కు... తల్లి తర్వాత తల్లి స్థానంలో నిలబడేది మేనమామ కాబట్టి ఆయనకు కూడా బాధ్యత ఉంది. అయితే కొందరు మాత్రం ఆస్తిలో చెల్లెళ్లకు ఇవ్వాల్సిన వాటాను తమ వాటాగా భావిస్తారు. తామేదో చెల్లికి గిఫ్ట్‌గా ఇస్తున్నామని బిల్డప్ ఇచ్చే వాళ్లు కూడా సమాజంలో ఉన్నారు. మరికొందరు చెల్లెలు వాటా ఇవ్వాల్సింది ఇవ్వకపోగా... దాంట్లో ఒక్క కొసరు ఇచ్చి... అది కూడా అప్పు ఇచ్చినట్లు చూపిస్తున్నారు. అలాంటివాళ్లను ఇంకేమనాలి?... ఇది వాస్తవం. ఇది దేవుడికి తెలుసు. మా కుటుంబం మొత్తానికి తెలుసు' అని షర్మిల పేర్కొన్నారు.

ఐదేళ్ల పాటు గాడిదలు కాశారా?

ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సీఎం జగన్ కుంభకర్ణుడిలా వ్యవహరించాడని.. అభివృద్ధిని గాలికొదిలేసి ఐదేళ్లపాటు గాడిదలు కాశారా? అంటూ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఏపీ న్యాయ్ యాత్ర'లో భాగంగా ఆమె కర్నూలు, నందికొట్కూరులో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్‌షోలో ఆమె మాట్లాడారు. ధరల స్థిరీకరణ నిధి కోసం ఏటా రూ.3వేల కోట్లు కేటాయిస్తామన్న జగన్‌రెడ్డి ఈ ఐదేళ్లలో ఒక్క ఏడాదైనా అమలు చేశాడా? అని ప్రశ్నించారు. ప్రతి జనవరికి జాబ్ కేలెండర్ ఎక్కడిచ్చారని నిలదీశారు. అధికారంలోకి వచ్చాక 6 నెలల్లోనే టీచర్ల పోస్టులు భర్తీ చేస్తానని చెప్పి ఐదేళ్లు ఏంచేశాడని ప్రశ్నించారు. మూడు రాజధానులు అన్నారు.. ఒక్క రాజధాని అయినా వచ్చిందా? ఉన్న కేపిటల్ కూడా లేకుండా చేశాడని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.